సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 318

బుధవారం 8-2-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'



తెలుగు చతురంగ బలం

ఉమెన్ ఫిడే మాస్టర్ టైటిల్ బాలపురస్కార్ గ్రహీత అలన మీనాక్షిపై కథనం -11లో



డబుల్ డెక్కర్ ఆగయా

హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులు మంగళవారం రోడ్డెక్కాయి. -7లో



2014 తర్వాతే 'అదానీ మ్యాజిక్'

మోదీ ప్రధాని అయ్యాక మ్యాజిక్ జరిగి ప్రపంచంలో అదానీ రెండో సంపన్నుడిగా ఎదిగారని రాహుల్‌గాంధీ ఎద్దేవా చేశారు.

- వివరాలు 6లో▶



జేఈఈ మెయిన్‌లో కుర్రాళ్ల సెంచరీ

తొలివిడత పరీక్షల ఫలితాల్లో 100 స్కోర్ పాయింట్లు సాధించిన 20 మంది బాలురే. వారిలో నగం మంది తెలుగు రాష్ట్రాల వారే కావడం విశేషం.

- వివరాలు 3లో▶

బతుకు శిథిలం

గుండె పగిలిన తుర్కియే, సిరియా | **6,200 దాటిన మృతులు** | **ఇంకా శిథిలాల కింద వేలాది మంది** | **కాపాడాలంటూ ఆక్రందనలు**





నాన్న.. లేరా: భూకంపం సృష్టించిన విలయంలో కళ్లెదుటే కన్నకూతురు శాశ్వతనిద్రలోకి జారుకుంది. శిథిలాల్లో ఆమె మృతదేహం చిక్కుకుపోయింది. ఆమె చేతిని పట్టుకుని అక్కడే స్థాణువై కూర్చుండిపోయాడా తండ్రి. టర్కీలోని ఖరామన్మరస్ ప్రాంతంలోనిదీ హృదయవిదారక దృశ్యం



శిథిలాల్లో ప్రసవం

తుర్కియే (టర్కీ), సిరియా భూకంపంలో గుండె పగిలే దృశ్యాలు వెలుగులోకి వస్తున్నాయి. సిరియాలోని అలెప్పో గ్రామీణ ప్రాంతంలో శిథిలాల మధ్య ఓ మహిళ ప్రసవించింది. కొత్తగా లోకాన్ని చూసిన ఆ పసిబాలుడ్ని సహాయ సిబ్బంది సురక్షితంగా బయటకు తీశారు. బాలుడి ప్రాణాన్ని కాపాడగలిగారు కానీ కన్న తల్లికి మాత్రం నూరేళ్లు నిండిపోయాయి. సహాయ సిబ్బంది ఒకరు ఆ పసిబాలుడ్ని బయటకు తీసుకువస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఒక విపత్తుని ఎదిరించి పురుడు పోసుకున్న ఆ బాలుడు సిరియన్లకు ఆశాకిరణంగా మారాడన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఎటు చూసినా శిథిలాలే.
వాటికింద చితికిన బతుకులే. కుప్పలుగా శవాలే.

వరుస భూకంపాలు తుర్కియే, సిరియాల్లో అంతులేని విధ్వంసం సృష్టించాయి. వేలాది భవనాలు కుప్పకూలడంతో వాటి శిథిలాలను తొలగించడం తలకుమించిన పనిగా మారింది. వాటికింద చిక్కుకున్న వారు కాపాడాలంటూ చేస్తున్న ఆక్రందనలు కలచివేస్తున్నాయి. మృతుల సంఖ్య ఇప్పటికే 6 వేలు దాటింది. శిథిలాలన్నింటినీ తొలగిస్తే అది మరింత భారీగా పెరిగేలా కన్పిస్తోంది.

6 లో

ప్రస్తుతానికి అడ్‌హక్ కమిటీలే

- వివిధ రాష్ట్రాల నేతలకు పగ్గాలపై బీఆర్ఎస్ అధినేత యోచన
- చేరికలు పుంజుకున్నాకే కొత్త అధ్యక్షులను నియమించేలా కసరత్తు
- ఉత్తరాది రాష్ట్రాల నేతలతో కొనసాగుతున్న కేసీఆర్ భేటీలు

- వివరాలు 2లో▶

టీచర్లందరికీ బదిలీ చాన్స్

- ఉపాధ్యాయులందరికీ బదిలీ అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను అమలు చేస్తామని విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి కార్యాలయం మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొంది.

- వివరాలు 5లో▶

మే 7 నుంచి ఎంసెట్

- ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే టీఎస్ ఎంసెట్‌ను మే 7న నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

- వివరాలు 14లో▶

క్లుప్తంగా...

ఆ జాతీయ రహదారి సమస్యలు పరిష్కరించండి
కేంద్రమంత్రిని కోరిన ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: ఖమ్మం– అశ్వారావుపేట (ఎన్‌హెచ్ 365బీబీ) జాతీయ రహదారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఆర్‌ఎస్ ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, పార్థసారథి రెడ్డి, ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం ఢిల్లీలో కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమై వినతిపత్రం సమర్పించారు. సత్తుపల్లి మీదుగా వెళ్లే జాతీయ రహదారులను మరింత విస్తరించాలని...రోడ్లకిరువైపులా డ్రైన్స్ మంజూరు చేయాలని కోరారు. కొత్తగా కట్టిన కలెక్టరేట్ వద్ద అలైన్‌మెంట్ మార్పును గురించి వివరించారు. జాతీయ రహదారిలోని తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి పట్టణాల్లో అంతర్గత రహదారుల విస్తరణ, సెంట్రల్ లైటింగ్ కోసం గతంలోనే అంచనాలతో ప్రతిపాదించిన అంశాన్ని ఎంపీ నామా కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ డిమాండ్ల పట్ల కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించి అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా వారు గడ్కరీకి ధన్యవాదాలు తెలిపి శాలువాతో సత్కరించారు.

9న జంతర్‌మంతర్ వద్ద బీసీల మహాధర్నా
బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఈనెల 9న బీసీ రాజ్యాధికార సమితి మహాధర్నాను చేపట్టనుంది. ఢిల్లీలోని మంగళవారం తెలంగాణ భవన్‌లో బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ మాట్లాడుతూ...బీసీలకు సంపూర్ణ సాధికారత సిద్ధించాలంటే అసెంబ్లీ, పార్లమెంటులో వారికి తొలి దశగా 27% రాజకీయ రిజర్వేషన్లను కల్పించాలన్నారు. ఢిల్లీలోని అన్ని రాజకీయ పార్టీలు బీసీ రాజకీయ రిజర్వేషన్‌లకు సహకరించే విధంగా అన్ని రాజకీయ పార్టీల మద్దతు కూడగడతామని తెలిపారు.

జనగణనలో బీసీ కులాలను లెక్కించాలి
జంతర్‌మంతర్‌లో మహాధర్నా

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా జరిగే జనగణనలో బీసీ కులాలను తప్పకుండా లెక్కించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ కోరారు. బీసీ కులాల లెక్కలు లేకపోవడం వలన దేశంలో 52 శాతం ఉన్న బీసీ కులాల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కారణంగా సామాజికంగా, రాజకీయంగా, విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాలలో బీసీ కులాల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మంగళవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన మహాధర్నాలో నరేందర్‌గౌడ్ ప్రసంగించారు. 75 సంవత్సరాలుగా బీసీల కులగణన చేపట్టకుండా ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. మహాధర్నాలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విక్రమ్ గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణమరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాతాళంలోకి వెళ్లకుండా చూసుకోండి
రేవంత్‌పై మంత్రి సత్యవతి ధ్వజం

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్‌ని పాతాళంలోకి తొక్కుతానంటూ ఉపన్యాసాలు ఇస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి ఆ పరిస్థితి రాకుండా చూసుకోవాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మేడారం జాతరకు బీఆర్‌ఎస్ నాలుగు పర్యాయాలు నిధులు ఇచ్చిందని, కాంగ్రెస్ హయాంలో ఎన్నడూ నయాపైసా కేటాయించలేదని దుయ్యబట్టారు. ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, బానోత్ హరిప్రియనాయక్‌తో కలిసి మంగళవారం బీఆర్‌ఎస్ శాసనసభాపక్షం కార్యాలయంలో సత్యవతి మీడియాతో మాట్లాడారు. రేవంత్ పెద్ద గొంతుతో మాట్లాడినంత మాత్రాన అబద్ధాలు నిజాలు కాబోవని, చేతనైతే కేంద్రంపై పోరాటం చేయాలన్నారు. గిరిజన వర్సిటీ ఏర్పాటుపై కేంద్రం అబద్ధాలు చెప్తోందన్నారు.



సొంతవారిపైనే 'నో కాన్ఫిడెన్స్'!

ఆగని అవిశ్వాసాల రచ్చ

పలు జిల్లాల్లో బల్దియాల చైర్మన్లు, వైస్ చైర్మన్లపై తిరుగుబాటు

కలెక్టర్లకు నోటీసులు ఇస్తున్న బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

- ఏకతాటిపై ఉంటామంటూ దేవాలయాల వద్ద ఒట్లు!
- తమ వ్యతిరేకత పార్టీపై కాదని స్పష్టీకరణ
- అధికార పార్టీకి తలనొప్పిగా మారిన వైనం
- సర్దిచెప్పే ప్రయత్నాల్లో స్థానిక ఎమ్మెల్యేలు
- గవర్నర్ వద్ద పెండింగ్‌లో 'నాలుగేళ్ల నిబంధన' బిల్లు

→ ఉమ్మడి నల్లగొండ నందికొండ మున్సిపాలిటీలో ఎమ్మెల్యే భగత్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి వర్గీయ కౌన్సిలర్ల మధ్య విభేదాలు అవిశ్వాసానికి దారి తీశాయి. చైర్‌పర్సన్ కర్న అనూషారెడ్డిపై ఎనిమిది మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసం నోటీసులు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.

→ ఉమ్మడి మెదక్ జిల్లా సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ లతలపై బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చారు.

→ కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణపై అవిశ్వాస తీర్మానం పెట్టే క్రమంలో ఏడుగురు కౌన్సిలర్లు గోవా క్యాంపునకు వెళ్లారు. ఒకటి రెండు రోజుల్లో నోటీసులు ఇవ్వాలనే ఆలోచనలో వారున్నట్టు సమాచారం.


అవిశ్వాస తీర్మాన నోటీసు ఇచ్చేందుకు జనగామ కలెక్టరేట్‌కు వచ్చిన కౌన్సిలర్లు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: బల్దియాల్లో అవిశ్వాసాల రచ్చకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నప్పటికీ.. రాష్ట్రవ్యాప్తంగా పలు మున్సిపాలిటీల్లో అసంతృప్త కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాలకు సై అంటున్నారు. కొన్నిచోట్ల చైర్మన్లు ఏకపక్షంగా వ్యవహరిస్తూ కౌన్సిలర్లను పట్టించుకోక పోవడంతో వారంతా గుర్రుగా ఉన్నారు. కొన్ని మున్సిపాలిటీల్లో అక్రమ కట్టడాలు, రియల్‌ఎస్టేట్ వెంచర్లు, ఇంటి నిర్మాణాల అనుమతుల్లో పెద్ద మొత్తంలో ముడుపులు చేతులు మారుతున్నాయి. ఈ పంపకాల్లో తేడాలు కూడా పలుచోట్ల అసంతృప్తికి దారితీసి అవిశ్వాసాలకు కారణమవుతున్నాయనే ఆరోపణలున్నాయి. మరికొన్ని చోట్ల.. ఎన్నికల్లో రూ.లక్షలు ఖర్చు చేసి గెలుపొందిన కౌన్సిలర్లు పలువురు అక్రమాలకు పాల్పడుతున్నారు. దీనిని చైర్మన్లు వ్యతిరేకించడం కౌన్సిలర్లకు మింగుడు పడటం లేదు. ఈ నేపథ్యంలోనే మూడేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న చైర్మన్లు, వైస్ చైర్మన్లపై నిబంధనల ప్రకారం అవిశ్వాస తీర్మానాలకు తెర లేపుతున్నారు. అయితే ప్రభుత్వం ఇటీవల చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఉన్నవారు 4 ఏళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న పక్షంలోనే అవిశ్వాస తీర్మానాలు పెట్టే సవరణ బిల్లుకు ఇటీవల కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ బిల్లు ప్రస్తుతం గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉంది. దీంతో పలుచోట్ల అవిశ్వాసాల రచ్చ కొనసాగుతోంది.

తిరుగుబాటు పార్టీపై కాదు

ఒకటీ రెండు మినహా బల్దియాలన్నీ అధికార బీఆర్‌ఎస్ పార్టీ చేతుల్లోనే ఉన్నాయి. అయితే దాదాపు అన్నిచోట్లా అధికార పార్టీ కౌన్సిలర్లే అవిశ్వాస తీర్మానాలకు నాయకత్వం వహిస్తున్నారు. వీరికి ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం కౌన్సిలర్లు మద్దతు తెలుపుతుండటం గమనార్హం. అయితే తాము పార్టీకి వ్యతిరేకం కాదని, కేవలం చైర్మన్ పదవుల్లో కొనసాగుతున్న వారి తీరుకు మాత్రమే వ్యతిరేకమని కౌన్సిలర్లు పేర్కొంటున్నారు. పార్టీ ఆదేశాలకు కట్టుబడి ఉంటామని వారు స్పష్టం చేస్తున్నారు.

కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు

బల్దియాల్లో అవిశ్వాసాల రచ్చ కొనసాగుతున్న నేపథ్యంలో కలెక్టర్లకు ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. మున్సిపల్ చట్ట సవరణ బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నందున అవిశ్వాస తీర్మానాల నోటీసులపై ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని, ఆ నోటీసులను మున్సిపల్ పరిపాలన శాఖకు పంపాలని ఆదేశించింది. నిబంధనల ప్రకారం అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టాలంటే ఆయా మున్సిపాలిటీల్లో ఉన్న కౌన్సిలర్ల సంఖ్యలో 50 శాతం మంది స్వయంగా కలెక్టర్ ముందు హాజరు కావాలి. తమకు సంబంధించిన వ్యక్తిగత ధ్రువీకరణ (ఐడెంటిటీ ప్రూఫ్) చూపించి కలెక్టర్ ముందే నోటీసుపై సంతకాలు చేయాలి. అనంతరం కలెక్టర్ సర్వసభ్య సమావేశం తేదీ ప్రకటించాల్సి ఉంటుంది. అయితే పలుచోట్ల కలెక్టర్లు అందుబాటులో లేకపోవడంతో అసమ్మతి కౌన్సిలర్లు అదనపు కలెక్టర్లకు, ఏఓలకు నోటీసులు అందజేస్తున్నారు. వారు తీసుకునేందుకు నిరాకరించడంతో ఇన్‌వర్డ్ సెక్షన్లలో ఇచ్చి వెళ్తున్నారు. ఇలా అవిశ్వాస నోటీసులు ఇస్తున్న కౌన్సిలర్లు ప్రత్యేక శిబిరాలకు వెళుతున్నారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్లు ఏడుగురు గోవా వెళ్లారు. సంగారెడ్డి అసమ్మతి కౌన్సిలర్లు హైదరాబాద్‌లో ఓ రిసార్టుకు వెళ్లివచ్చారు. 'మీరు ఇచ్చే నోటీసులు ప్రభుత్వ పరిశీలనకు పంపుతాం.. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు తదుపరి చర్యలుంటాయి..'అంటూ సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్లపై అవిశ్వాస తీర్మానాల నోటీసు ఇచ్చిన కౌన్సిలర్లకు ఆ జిల్లా కలెక్టర్ శరత్ స్పష్టం చేయడం గమనార్హం. అవిశ్వాస తీర్మానాలు తలనొప్పిగా మారడంతో ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు అసంతృప్తి కౌన్సిలర్లను బుజ్జగించే పనిలో పడ్డారు.

ఎక్కడెక్కడ..

● ఉమ్మడి మెదక్ జిల్లాలో పలుచోట్ల అవిశ్వాసాల బెడద కొనసాగుతోంది. సదాశివపేట చైర్‌పర్సన్ పిల్లోడి జయమ్మ, జోగిపేట మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్యలపై కూడా అధికార పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం నోటీసులు కలెక్టర్ శరత్‌కు అందజేశారు. సిద్దిపేట జిల్లా చేర్యాల మున్సిపాలిటీలో అవిశ్వాసం తీర్మానం పెట్టే యోచనలో ఉన్న కౌన్సిలర్లు ఇటీవల జరిగిన బల్దియా సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించారు. బీఆర్‌ఎస్ నుంచి గెలిచి ఇటీవల బీజేపీలో చేరిన మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్‌పైనా అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు పావులు కదుపుతున్నారు.

● ఉమ్మడి నల్లగొండ జిల్లా యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధపై అవిశ్వాస తీర్మానం వివాదం హైకోర్టు పరిధిలోకి వెళ్లింది. చండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళ, వైస్ చైర్‌పర్సన్ బి.సుజాతలపై అవిశ్వాస తీర్మానం పెట్టగా వీరిద్దరు హైకోర్టును ఆశ్రయించారు. ఆలేరు మున్సిపాలిటీలో అధికార బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం నోటీసులు అందజేశారు. భువనగిరి మున్సిపాలిటీ చైర్మన్ ఎ.ఆంజనేయులు, వైస్‌చైర్మన్ చింతల కిష్టయ్యలపై అవిశ్వాసం ప్రకటిస్తూ 19 మంది సంతకాలు చేశారు. ఈ మేరకు తీర్మాన పత్రాన్ని కలెక్టర్ పమేలా సత్పతికి అందజేశారు.

● ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధికపైనా కొందరు అవిశ్వాసం ప్రకటించారు. కొత్తకొండ వీరభద్రస్వామి దేవస్థానం వద్ద.. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం విషయంలో ఏకతాటిపై ఉండాలని కోరారు. అయితే ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ కలుగజేసుకోవడంతో ప్రస్తుతానికి కౌన్సిలర్లు శాంతించారు. జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ బోగ శ్రావణిపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని కౌన్సిలర్లు నిర్ణయించారు. దీంతో శ్రావణి గత నెల 22న పదవికి రాజీనామా చేశారు.

● ఉమ్మడి వరంగల్ జిల్లా జనగామ బల్దియాలో అవిశ్వాస తీర్మానం పెట్టిన కౌన్సిలర్లను బుజ్జగించేందుకు స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇక్కడ చైర్‌పర్సన్ పోకల జమున, వైస్ చైర్మన్ పోకల రాంప్రసాద్‌లపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని 19 మంది కౌన్సిలర్లు నిర్ణయించారు. యశ్వంతపూర్ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ఒట్టు పెట్టుకుని అవిశ్వాసం నోటీసులు అదనపు కలెక్టర్‌కు అందజేశారు.

● ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఇల్లందు మున్సిపల్ చైర్మన్ డి.వెంకటేశ్వర్‌రావుపై కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసును స్వీకరించేందుకు కలెక్టర్ డి.అనుదీప్ తొలుత నిరాకరించారు. అసమ్మతి కౌన్సిలర్లు ఆయన చాంబర్ ముందు బైఠాయించడంతో ఆ నోటీసును తీసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే హరిప్రియ వారిని బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నారు.

● నిర్మల్ జిల్లా కేంద్ర మున్సిపాలిటీతో పాటు, మంచిర్యాల జిల్లా నస్పూర్ బల్దియాలో కూడా అసంతృప్తి జ్వాలలు అంతర్గతంగా రగులుతున్నాయి.

దేశాన్ని దోచుకునేందుకు బయలుదేరారు

సీఎం కేసీఆర్‌పై పీసీసీ చీఫ్ రేవంత్ ధ్వజం

- కేటీఆర్‌ను డ్రామారావు అంటూ ఎద్దేవా
- కాంగ్రెస్‌కు అధికారం ఖాయమని పునరుద్ఘాటన


ములుగు జిల్లా కేశవాపూర్‌లో పత్తి ఏరుతున్న కూలీలు తమ భోజనాన్ని రేవంత్, సీతక్కలకు పెడుతున్న దృశ్యం

ములుగు/వెంకటాపురం(ఎం): 2001లో రబ్బరు చెప్పులకు కూడా గతిలేని కేసీఆర్ కుటుంబం నేడు రాష్ట్రాన్ని దోచుకుని రూ.లక్షల కోట్లకు పడగలెత్తిందని, అది చాలదన్నట్లు ఇప్పుడు దేశాన్ని దోచుకోవడానికి ముఖ్యమంత్రి బయలుదేరారని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి ఆరోపించారు. డ్రామారావు (కేటీఆర్‌నుద్దేశించి) రాష్ట్ర ప్రజలు తమ కుటుంబ సభ్యులని, కుటుంబ పాలన ఉంటుందని అనడం హాస్యాస్పదమన్నారు. తెలంగాణ ద్రోహులు ఎర్రబెల్లి, తలసాని శ్రీనివాస్, మల్లారెడ్డిని చుట్టూ చేర్చుకొని దిక్కుమాలిన రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు. హాథ్ సే హాథ్ జోడో యాత్ర రెండో రోజు మంగళవారం ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలంలోని రామప్ప దేవాలయాన్ని ఎమ్మెల్యే సీతక్కతో కలిసి రేవంత్ సందర్శించారు. రామలింగేశ్వరస్వామికి అభిషేకం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం ముందు విలేకరుల సమావేశంలో, రాత్రి 8 గంటలకు పాదయాత్ర ములుగుకు చేరుకున్నాక గ్రామ పంచాయతీ ఎదుట ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాగానే సమ్మక్క–సారలమ్మ జిల్లా రాష్ట్రంలో లక్షలాది మంది ప్రజలు సరైన ఇల్లు లేక రోడ్లపై అవస్థలు పడుతుంటే 160 పడక గదుల భవనంలో దొర దర్జాగా గడుపుతున్నారని విమర్శించారు. ములుగు ప్రజల ఆదరణ, పౌరుషాన్ని పుణికి పుచ్చుకొని రాష్ట్ర మంతటా సీతక్కతో కలిసి యాత్ర కొనసాగించి అధికారంలోకి వస్తామని అన్నారు. అధికారంలోకి రాగానే ములుగు జిల్లాను సమ్మక్క–సారలమ్మల పేరు మీద మారుస్తూ తొలి సంతకం పెడతామని ప్రకటించారు. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీన కొత్త ప్రభుత్వాన్ని నెలకొల్పుతామని పునరుద్ఘాటించారు.

భోజనం పెట్టిన కూలీలు

ములుగు జిల్లా కేశవాపూర్ రోడ్డు మీదుగా యాత్ర సాగుతుండగా మధ్యాహ్నం సమయంలో పక్కనే పత్తి, మిర్చి ఏరుతున్న కూలీలను రేవంత్ పలకరించారు. ఇప్పటి ప్రభుత్వం బాగుందా? కాంగ్రెస్ ప్రభుత్వం బాగుందా? అని అడగడంతో ఇందిరమ్మ రాజ్యం కోరుకుంటున్నట్లు కూలీలు తెలిపారు. తాము తెచ్చుకున్న టిఫిన్ బాక్సులను తెరిచి రేవంత్‌రెడ్డి, సీతక్కలకు భోజనం పెట్టారు.

ఏడుగురు ఐపీఎస్‌ల బదిలీ

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్రంలో ఏడుగురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఐపీఎస్ అధికారుల వివరాలు...

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎస్ రంగారెడ్డి	వెయిటింగ్	ఎస్పీ (పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ -పీసీఎస్ అండ్ ఎస్)
యోగేష్ గౌతం	గ్రేహౌండ్స్, ఏఎస్పీ	అడ్మిన్ డీసీపీ, సైబరాబాద్
ఆర్ వెంకటేశ్వర్లు	వెయిటింగ్	ఎస్పీ, సీఐడీ
జే రాఘవేందర్‌రెడ్డి	వెయిటింగ్	అడ్మిన్ ఎస్పీ, రైల్వేస్
సీ సతీశ్	వెయిటింగ్	ఎస్పీ(లీగల్), డీజీపీ ఆఫీస్
డి.మురళీధర్	వెయిటింగ్	డీసీపీ(క్రైమ్స్), వరంగల్
ఐ పూజ	ప్రిన్సిపాల్, పీటీసీ, వరంగల్	డిప్యూటీ డైరెక్టర్, టీఎస్‌పీఏగా గతంలో ఇచ్చిన ఉత్తర్వులు రద్దు.. ప్రిన్సిపాల్, పీటీసీ, వరంగల్ కొనసాగింపు

ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా వెళ్లొద్దు!
అవిశ్వాసాలపై బీఆర్‌ఎస్ కౌన్సిలర్లకు మునిసిపల్ చాంబర్ చైర్మన్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పురపాలికల్లో అవిశ్వాసాలపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా వెళ్లొద్దని బీఆర్‌ఎస్ కౌన్సిలర్లకు మున్సిపల్ చాంబర్ చైర్మన్ రాజు వెన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మునిసిపల్ చైర్మన్ల అవిశ్వాస తీర్మానానికి గడువును నాలుగేళ్లకు పెంచుతూ రూపొందించిన బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉందని, ఈ నేపథ్యంలో అవిశ్వాసాల పేరిట ప్రభుత్వ ఉద్దేశాలకు భిన్నంగా వ్యవహరించవద్దని కోరారు. హైదరాబాద్‌లోని మున్సిపల్ చైర్మన్ చాంబర్ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కొన్ని మునిసిపాలిటీల్లో చైర్మన్లపై ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసులపై రాష్ట్ర హైకోర్టు స్టే విధించిందని గుర్తు చేశారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మున్సిపాలిటీల్లో ఎలాంటి అలజడులు సృష్టించకుండా, స్థానిక అభివృద్ధి కోసం, పార్టీ పటిష్టత కోసం పాటుపడాలని, బీఆర్‌ఎస్ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ పార్టీ మూడోసారి అధికారం సాధించడంలో మున్సిపల్ కౌన్సిలర్లదే కీలకపాత్ర అన్నారు.

ప్రస్తుతానికి 'అడ్‌హాక్' కమిటీలే

- వివిధ రాష్ట్రాల నేతలకు పగ్గాలపై బీఆర్‌ఎస్ అధినేత యోచన
- చేరికలు పుంజుకున్నాకే కొత్త అధ్యక్షులను నియమించేలా కసరత్తు
- ఉత్తరాది రాష్ట్రాల నేతలతో కొనసాగుతున్న కేసీఆర్ భేటీలు



సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయిలో బీఆర్‌ఎస్ కార్యకలాపాల విస్తరణకు సర్వశక్తులూ ఒడ్డుతున్న ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ఇతర రాష్ట్రాల్లో కాలుమోపేందుకు అవసరమైన ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా వివిధ రాష్ట్రాల్లో నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆయన... వారికి ఆయా రాష్ట్రాల్లో పార్టీ పగ్గాలు అప్పగించడంపై భిన్న వ్యూహాన్ని అనుసరిస్తున్నారు. బీఆర్‌ఎస్ ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడిగా తోట చంద్రశేఖర్‌ను నియమించిన కేసీఆర్... ఇతర రాష్ట్రాల్లో మాత్రం ప్రస్తుతానికి అడ్‌హక్ కమిటీలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. గత నెలలో బీఆర్‌ఎస్‌లో చేరిన ఒడిశా మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గమాంగ్‌కు పార్టీ ఒడిశా పగ్గాలు అప్పగిస్తారన్న ప్రచారం జరిగినప్పటికీ కేసీఆర్ మాత్రం అటువంటి నిర్ణయమేదీ తీసుకోలేదు. పార్టీలోకి చేరికల వేగం పెరిగాక సమర్థులైన నేతలకు ఆయా రాష్ట్రాల బీఆర్‌ఎస్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలని ఆయన భావిస్తున్నారని తెలిసింది. ప్రస్తుతానికి ఒడిశా, మహారాష్ట్ర శాఖలకు అడ్‌హక్ కమిటీలను ఏర్పాటు చేసే దిశగా కేసీఆర్ కసరత్తు చేస్తున్నారని బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి.

ఈ నెలాఖరులో భువనేశ్వర్‌లో సభ...

బీఆర్‌ఎస్ ఆవిర్భావం తర్వాత ఖమ్మం, నాందేడ్ బహిరంగ సభలు విజయవంతం కావడంతో మరిన్ని సభల నిర్వహణకు కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు. ఈ నెల 17న తెలంగాణ సచివాలయం ప్రారంభోత్సవం అనంతరం పరేడ్ మైదానంలో భారీ బహిరంగ సభను నిర్వహించనుండగా ఈ నెల 25 తర్వాత ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో సభ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ముగిశాక ఒడిశాకు చెందిన బీఆర్‌ఎస్ నేతలతో భేటీకి కేసీఆర్ హామీ ఇచ్చారు. ఈ భేటీలో భువనేశ్వర్ సభ ఏర్పాట్ల గురించి దిశానిర్దేశనం చేయనున్నారు. ఇప్పటికే సభ నిర్వహణ ఏర్పాట్ల సమన్వయ బాధ్యతను ఒడిశాలోని బరంపురానికి చెందిన ఓ నేతకు అప్పగించినట్లు తెలిసింది. మరోవైపు మధ్యప్రదేశ్, గుజరాత్, యూపీ తదితర రాష్ట్రాలకు చెందిన వివిధ పార్టీల నేతలు, ప్రజాసంఘాలు, రైతు సంఘాల నేతలు కేసీఆర్‌తో వరుస భేటీలు జరుపుతున్నట్లు సమాచారం. అయితే హైదరాబాద్‌కు వారి రాక, బీఆర్‌ఎస్‌లో చేరికకు సంబంధించి గోప్యత పాటిస్తున్నారు. ప్రగతిభవన్ సమీపంలోని రెండు స్టార్ హోటళ్లలో ఆయా నేతలు, ఇతరులకు బీఆర్‌ఎస్ బస ఏర్పాట్లు చేస్తోంది. సమయానుకూలతను బట్టి వారు కేసీఆర్‌తో భేటీ కావడంతోపాటు హైదరాబాద్, ఇతర జిల్లాల్లో ప్రభుత్వ కార్యక్రమాలను పరిశీలిస్తున్నారు.

బీఆర్‌ఎస్‌తో పొత్తుపై ఇప్పుడే చెప్పలేం

త్వరలో సీపీఐతో పొత్తులపై చర్చిస్తాం: తమ్మినేని



సాక్షి, హైదరాబాద్: ఎన్నికలప్పుడే పొత్తులపై నిర్ణయం తీసుకుంటామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. కానీ బీఆర్‌ఎస్ నాయకులు సీపీఐ, సీపీఎం పార్టీలు తమతోనే ఉంటాయనీ, ఎమ్మెల్యే సీట్లు కాకుండా, ఒకటి లేదా రెండు ఎమ్మెల్సీలు కేటాయిస్తామంటూ ప్రకటిస్తున్నారని గుర్తు చేశారు. ఇది బీఆర్‌ఎస్ అధిష్టానానికి తెలిసే జరుగుతుందని తాము అనుకోవడం లేదన్నారు. గతంలో పొత్తులు ఖరారైనపుడు ఎమ్మెల్యే సీట్లు ఇవ్వని దాఖలాలు ఎప్పుడూ లేవని వివరించారు. త్వరలోనే సీపీఐతో పొత్తులపై చర్చిస్తామన్నారు. హైదరాబాద్‌లో రెండ్రోజులపాటు జరిగే సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు ఎ.విజయరాఘవన్, బీవీ రాఘవులుసహా తమ్మినేని వీరభద్రం విలేకరులతో మాట్లాడారు. తమ్మినేని మాట్లాడుతూ, బీజేపీకి వ్యతిరేకంగా బీఆర్‌ఎస్‌తో కలిసి పనిచేస్తామని చెప్పారు. మార్చిలో రాష్ట్ర స్థాయిలో ప్రతి మండలంలో ప్రజల్లోకి వెళ్లేందుకు కార్యాచరణను ప్రకటిస్తామని వివరించారు.

బట్టబయలు కావాల్సిందే: రాఘవులు

అదానీ పెట్టుబడులు, షేర్ల పతనానికి సంబంధించిన అక్రమాల గురించి ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాయనీ, చర్చ చేపట్టాల్సిందేనంటూ రెండురోజులుగా పార్లమెంటును స్తంభింపజేశాయని బీవీ రాఘవులు చెప్పారు. కానీ కేంద్రం మొండిగా వ్యవహరిస్తుందని విమర్శించారు. అదానీ వ్యవహారంపై ప్రతిపక్షాలు పట్టుబడుతున్నట్టుగా జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాల్సిందేనని కోరారు.

బీఆర్‌ఎస్‌కు మహిళల ఉసురు తగులుతుంది

- తెలంగాణ ప్రభుత్వం మహిళా సంఘాలకు రూ.4,500 కోట్లు బాకీ ఉంది
- రాష్ట్ర అభివృద్ధికి ప్రధాని మోదీ కట్టుబడి ఉన్నారు
- రాజ్యసభలో డా. కె.లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: వడ్డీ లేని రుణాల పేరుతో తెలంగాణలోని మహిళా సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.4,500 కోట్లు బాకీ ఉందని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, ఎంపీ డా.కె.లక్ష్మణ్ ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ మహిళల పేరుపై ఓట్లు పొంది.. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పేరుతో మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి ప్రభుత్వానికి మహిళల ఉసురు కచ్చితంగా తగులుతుందని మండిపడ్డారు. మంగళవారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ ఎంపీ లక్ష్మణ్ సుమారు 52 నిమిషాలపాటు మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ లక్ష్మణ్ కేంద్ర ప్రభుత్వ విజయాలను ప్రస్తావిస్తూ తెలంగాణ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. అయితే ఈ తీర్మానం సమయంలో బీఆర్‌ఎస్, ఆప్, శివసేన (బాల్‌థాక్రే) ఎంపీలు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు.

ఎన్నికల హామీ మరిచారు..

పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన తమ హామీని మరిచిపోయిందని లక్ష్మణ్ విమర్శించారు. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని మొదట తెలంగాణలో అమలు చేయడానికి ముందుకు రాని రాష్ట్ర ప్రభుత్వం, కోవిడ్ కారణంగా ప్రజలు ప్రాణాలు కోల్పోయిన తర్వాత నిద్ర మేల్కొందన్నారు. ఆ తర్వాతే ఆయుష్మాన్ భారత్ పథకాన్ని తెలంగాణలో అమలు చేయడం ప్రారంభించిందన్నారు. అంతేగాక గతంలో తెలంగాణలో జాతీయ రహదారులకు నిధుల కేటాయింపులు జరగకపోయేవని, మోదీ ప్రభుత్వం చొరవతో జాతీయ రహదారుల్లో ప్రస్తుతం తెలంగాణ దేశంలో రెండోస్థానంలో ఉందన్నారు. తెలంగాణలోని జాతీయ రహదారులకు కేంద్రం రూ.1.04 లక్షల కోట్లు కేటాయించిందన్నారు. తెలంగాణలో బీజేపీ గెలిచినా, ఓడినా రాష్ట్ర అభివృద్ధికి ప్రధాని మోదీ కట్టుబడి ఉన్నారని లక్ష్మణ్ తెలిపారు. తెలంగాణలో జిల్లాల సంఖ్య పెరిగినందున రాష్ట్రంలోని గ్రామీణ పేదలకు నాణ్యమైన విద్యను అందించేందుకు నవోదయ పాఠశాలల సంఖ్యను పెంచాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. తెలంగాణ నుంచి బిహార్, ఉత్తరప్రదేశ్‌లకు వెళ్లే వారి సంఖ్య పెరుగుతున్నందున హైదరాబాద్ – గోరఖ్‌పూర్, హైదరాబాద్ – వారణాసి మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని కోరారు.

బీఆర్‌ఎస్‌కు బీజేపీయే ప్రత్యామ్నాయం

కాంగ్రెస్‌కు ఓటేస్తే దండగే

- దమ్ముంటే ఎంఐఎం 119 నియోజకవర్గాల్లో పోటీ చేయాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



తుర్కయాంజాల్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు బీజేపీయే ప్రత్యామ్నాయమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మన్నెగూడలో జరిగిన స్పీకర్స్ వర్క్‌షాప్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోజురోజుకు బీజేపీ దూసుకెళ్తుండటంతో ఆత్మరక్షణలో పడిన ముఖ్యమంత్రి కేసీఆర్.. ఫామ్‌హౌస్ వదిలి దేశమంతా తిరుగుతున్నారని ఎద్దేవాచేశారు. ఏ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్‌కు డిపాజిట్లు రావడం లేదని, ఆ పార్టీకి ఓటేస్తే తిరిగి బీఆర్‌ఎస్ గూటికే చేరతారనే అభిప్రాయం ప్రజల్లో నెలకొందన్నారు. అందుకే ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని చెప్పారు. అసెంబ్లీలో బీఆర్‌ఎస్, ఎంఐఎం పరస్పరం సవాల్ చేసుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యత్నించాయని, నిజంగా ఎంఐఎంకు దమ్ముంటే 119 నియోజకవర్గాల్లో పోటీ చేయాలని సవాల్ విసిరారు. నాయకత్వ లక్షణాలు ఉన్న నాయకులను ప్రోత్సహించడం, కార్యకర్తలను నాయకులుగా తయారు చేయడమే కార్నర్ మీటింగ్‌ల ఉద్దేశమని, ఒక్కో స్పీకర్ మీకు కేటాయించిన 10 సభలకు హాజరై ప్రజలకు బీఆర్‌ఎస్ అక్రమాల గురించి వివరించాలని చెప్పారు. ఇలా 11వేల మీటింగ్‌లు విజయవంతం చేస్తే రాష్ట్రంలో బీజేపీ సునాయాసంగా అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు.

కృష్ణాజలాలపై మోసం చేశారు..

కృష్ణా జలాల్లో 68 శాతం వాటాతో 570 టీఎంసీలు తెలంగాణకు దక్కాల్సి ఉన్నా.. 299 టీఎంసీలకే సంతకం పెట్టి కేసీఆర్ ప్రజలను మోసం చేశారని బండి సంజయ్ ఆరోపించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుపై లిఫ్టులను ఏర్పాటు చేసి నీటిని వాడుకోవాలని మహారాష్ట్రకు హామీ ఇవ్వడం సిగ్గుచేటన్నారు. కాళేశ్వరం వల్ల ఒక్క ఎకరానికి కూడా అదనంగా నీరు అందలేదన్నారు. కేంద్రం 2.40 లక్షల ఇళ్ల నిర్మాణానికి నిధులను మంజూరు చేస్తే వాటిని దారి మళ్లించారని, వివరాలు ఇవ్వాలని కేంద్ర మంత్రి నాలుగు సార్లు లేఖలు రాసినా రాష్ట్ర ప్రభుత్వం సమాధానం ఇవ్వలేదని ధ్వజమెత్తారు. ఈ నెల 20 తర్వాత ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని, తర్వాత ఉమ్మడి జిల్లాల వారీగా భారీ బహిరంగ సభలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశానికి కాసం వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా.. మాజీ ఎంపీలు మర్రి శశిధర్‌రెడ్డి, బూర నర్సయ్య గౌడ్, రవీందర్ నాయక్, విజయరామారావు, మాజీ మంత్రి బాబూమోహన్ పాల్గొన్నారు.

కుర్రాళ్ల 'సెంచరీ'!

జేఈఈ మెయిన్‌లో 100 స్కోర్ పాయింట్లు సాధించిన 20 మందీ బాలురే

- వీరిలో సగం తెలుగు రాష్ట్రాల నుంచి పరీక్ష రాసినవారే
- తొలి సెషన్ ఫలితాలు విడుదల చేసిన ఎన్‌టీఏ
- ఏప్రిల్ 6 నుంచి 12 వరకు రెండో విడత పరీక్షలు

సాక్షి, అమరావతి/హైదరాబాద్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్‌ఐటీ)లు, ఇతర జాతీయ విద్యాసంస్థల్లో ప్రవేశానికి నిర్వహించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ తొలివిడత పరీక్షల ఫలితాల్లో బాలురు సత్తా చాటారు. దేశవ్యాప్తంగా 20 మంది 100 స్కోర్ పాయింట్లు (100% పర్సంటైల్) సాధించగా.. ఆ 20 మందీ బాలురే కావడం గమనార్హం. 100 స్కోర్ పాయింట్లతో పాటు ఆ తర్వాత అత్యధిక స్కోర్ పాయింట్లు సాధించిన విద్యార్థుల్లో సగం మంది వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి పరీక్షలకు హాజరైనవారేనని గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన జేఈఈ మెయిన్ తొలి విడత పరీక్షల ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) మంగళవారం విడుదల చేసింది. విద్యార్థుల మార్కుల ఆధారంగా స్కోర్ పాయింట్లతో ఈ ఫలితాలను ప్రకటించింది. తెలుగు రాష్ట్రాల నుంచి వావిలాల చిద్విలాస్‌రెడ్డి, దుగ్గినేని వెంకట యుగేష్, గుత్తికొండ అభిరామ్, బిక్కిన అభినవ్ చౌదరి, ఎన్‌కే విశ్వజిత్, అభినీత్ మాజేటిలు 100 స్కోర్ పాయింట్లు సాధించిన వారిలో ఉన్నారు. జనరల్‌లో 14 మంది, ఓబీసీల్లో నలుగురు, జనరల్ ఈడబ్ల్యూఎస్‌లో ఒకరు, ఎస్సీల్లో ఒకరు 100 స్కోర్ పాయింట్లు సాధించారు.

బాలికల్లో టాప్ తెలుగు అమ్మాయిలే..

బాలికల విభాగం.. టాప్ టెన్‌లో 99.99 నుంచి 99.97 స్కోర్ పాయింట్లు సాధించిన పది మంది పేర్లను ఎన్‌టీఏ ప్రకటించింది. వారిలో టాప్‌లో మీసాల ప్రణీతి శ్రీజ, రామిరెడ్డి మేఘన, మేధా భవానీ గిరీష్, సీమల వర్ష, అయ్యాలపు రితిక, పీలా తేజశ్రీ, వాకా శ్రీవర్షిత, గరిమా కల్రా, గునీన్ గిల్, వాణి గుప్తా ఉన్నారు. వీరిలో తెలుగు అమ్మాయిలే అధికం కావడం విశేషం. ఇక కేటగిరీల వారీగా మంచి పర్సంటైల్ సాధించిన వారిలో ఓబీసీల్లో బావురుపూడి రిత్విక్, ఈడబ్ల్యూఎస్‌లో మల్పాని తుషార్, దుంపల ఫణీంద్రనాథరెడ్డి, పెందుర్తి నిశ్చల్ సుభాష్, ఎస్సీల్లో కొమరావు వివేక్ వర్ధన్, ఎస్టీల్లో ధీరావత్ తనూజ్, ఉద్యావత్ సాయి లిఖిత్, దివ్యాంగుల్లో బి.శశాంక్, తుమ్మల తిలోక్ ఉన్నారు.

'సెంచరీ'విద్యార్థులు వీరే..

తొలివిడత జేఈఈ మెయిన్‌లో 100 స్కోర్ పాయింట్లు సాధించిన విద్యార్థులు.. గుల్షన్ కుమార్, ధ్యానేష్ హేమేంద్ర షిండే, దేషంక్ ప్రతాప్ సింగ్, సోహమ్‌దాస్, వావిలాల చిద్విలాస్ రెడ్డి, అపూర్వ సమోటా, దుగ్గినేని వెంకట యుగేష్, గుత్తికొండ అభిరామ్, ఎన్‌కే విశ్వజిత్, నిపుణ్ గోయల్, రిషి కల్రా, మయాంక్ సోనీ, క్రిష్ గుప్తా, సుతార్ హర్షుల్ సంజయ్ భాయ్, బిక్కిన అభినవ్ చౌదరి, అమోఘ్ జలాన్, అభినీత్ మాజేటి, ధ్రువ్ సంజయ్ జైన్, అషిక్ స్టెన్నీ, కౌషల్ విజయ్ వెర్గియా.

రెండో విడత దరఖాస్తులకు మార్చి 7 చివరి తేదీ

జేఈఈ మెయిన్ రెండో సెషన్ పరీక్షలు ఏప్రిల్ 6 నుంచి 12 వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలకు మంగళవారం (ఫిబ్రవరి 7) నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఆరంభమైంది. మార్చి 7 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. మార్చి నాలుగో వారంలో అభ్యర్థుల అడ్మిట్ కార్డులను విడుదల చేయనున్నారు.

10 మందికి నాన్ కేడర్ ఐఏఎస్ హోదా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న 10 మంది అధికారులకు 2021 సంవత్సరానికిగాను నాన్ కేడర్ ఐఏఎస్ హోదా లభించింది. ఐఏఎస్ హోదా పొందిన వారిలో జల్ద అరుణశ్రీ, ఎ.నిర్మలకాంతి వెస్లీ, కోటా శ్రీవాస్తవ, చెక్కా ప్రియాంక, బడుగు చంద్రశేఖర్, కోరం అశోక్ రెడ్డి, హరిత, వెంకట నర్సింహారెడ్డి, కాత్యాయని, నవీన్ నికోలస్ ఉన్నారు. నాన్–స్టేట్ సివిల్ సర్వీసెస్ (నాన్–ఎస్సీఎస్) కోటా కింద మొత్తం 25 మంది అధికారుల పేర్లను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)కు రాష్ట్ర ప్రభుత్వం పంపించింది. జనవరి 24, 27 తేదీల్లో 25 మందికి యూపీఎస్సీ ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేసిన 10 మంది జాబితాను తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి పంపించినట్టు తెలిసింది. కాగా, నాన్ ఎస్సీఎస్ కోటా నుంచి ఐదుగురు గ్రూప్–1 అధికారులు ఐఏఎస్ అధికారులుగా ఎంపిక కావడం పట్ల తెలంగాణ గ్రూప్ –1 ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి హన్మంతు నాయక్ హర్షం వ్యక్తం చేశారు.

16 మంది డీఎస్పీల బదిలీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 16 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ అంజనీకుమార్ ఉత్తర్వులు జారీచేశారు. పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు (పీఈబీ) సిఫార్సుల మేరకు నిర్ణయం తీసుకున్నట్లు మంగళవారం రాత్రి జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ పోస్టింగ్‌లు వెంటనే అమల్లోకి వస్తాయని డీజీపీ ఆదేశాలు జారీచేశారు.



చెమట చిందించని నేటితరం

ఇండియాలో 11–17 ఏళ్లలో **74% మందికి** శారీరక శ్రమ లేదు

దీనిపై పర్యవేక్షణ కరువు... ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడి



- బద్ధకం, సమయాభావంతో బలిపీఠంపైకి యువతరం
- యువజనం కంటే 70 ఏళ్లకి పైబడిన వృద్ధులే పక్కాగా వ్యాయామాలు చేస్తున్నారట
- నలుగురిలో ముగ్గురు యువకులు వ్యాయామానికి దూరం
- వ్యాయామం లేకుంటే షుగర్, బీపీ, ఏడు రకాల క్యాన్సర్లు
- ఆయా జబ్బులకు ఏడాదికి రూ. 25,760 కోట్ల ఖర్చు
- పిల్లలకు రోజుకు గంట వ్యాయామం తప్పనిసరని సూచన
- దేశంలో నేటికీ వాకింగ్, సైక్లింగ్‌పై జాతీయ విధానం లేదు

సాక్షి, హైదరాబాద్: 2022 లెక్కల ప్రకారం భారతదేశ జనాభా 141.7 కోట్లు. అందులో 20 ఏళ్ల కంటే తక్కువ వయస్సుగలవారు 34 శాతం మంది ఉన్నారు. ఆ వయస్సుగల పిల్లలు, టీనేజర్లు శారీరక శ్రమకు దూరంగా ఉంటున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆవేదన వ్యక్తం చేసింది. ముఖ్యంగా 11–17 ఏళ్ల మధ్య వయస్సుగల వారిలో 74 శాతం మంది శారీరక శ్రమ చేయడం లేదని తేల్చిచెప్పింది. ఈ మేరకు తాజాగా ఒక నివేదిక విడుదల చేసింది. 11–17 ఏళ్ల మధ్య వయస్సువారు రోజుకు కనీసం 60 నిముషాలు కఠిన లేదా మధ్యస్థ వ్యాయామం చేయాలని సూచించింది. ఇక 18 ఏళ్ల పైబడినవారిలో పురుషుల్లో 25 శాతం, మహిళల్లో 40 శాతం శారీరక శ్రమ చేయడంలేదు. అంటే సరాసరి 32.5 శాతం అన్నమాట. వీళ్లు వారానికి 150 నిమిషాలు మధ్యస్థాయి వ్యాయామం లేదా 75 నిమిషాలు కఠిన వ్యాయామం చేయాలి. 70 ఏళ్లు పైబడినవారిలో పురుషులు 38 శాతం, మహిళలు 50 శాతం మంది శారీరక శ్రమ చేయడంలేదు. విచిత్రమేంటంటే... 11–17 ఏళ్ల వయస్సువారికంటే 70 ఏళ్లు పైబడిన వృద్ధులే నిర్దిష్టంగా ఎక్కువగా వ్యాయామం చేస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది.

శారీరక శ్రమను ప్రోత్సహించాలి



డబ్ల్యూహెచ్‌వో నివేదికలోని అంశాలు ఆలోచించదగినవి.. శారీరక శ్రమ చేసేందుకు పిల్లలను, పెద్దలను ప్రోత్సహించాలి. తద్వారా వారిలో గుండె, ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది. ఎముకలు బలపడతాయి. మానసిక ఉల్లాసం లభిస్తుంది. దీర్ఘకాలిక వ్యాధులు దరిచేరవు.

–డాక్టర్ హరిత, వైద్యురాలు, నిజామాబాద్

దీర్ఘకాలిక జబ్బులు... ఏడాదికి రూ. 25,760 కోట్ల ఖర్చు

శారీరక శ్రమ చేయకపోవడం వల్ల దేశంలో దీర్ఘకాలిక జబ్బులు, మానసిక జబ్బులు పెరుగుతున్నాయి. ప్రధానంగా గుండెపోటు, పక్షవాతం, షుగర్, బీపీ, ఏడు రకాల క్యాన్సర్లు.. రొమ్ము, పెద్ద పేగు, గర్భసంచి, గ్యాస్ట్రిక్ క్యాన్సర్, అన్నవాహిక క్యాన్సర్, కిడ్నీ క్యాన్సర్, బ్లాడర్ క్యాన్సర్ వస్తాయి. అలాగే మతిమరుపు, కుంగుబాటు జబ్బులు వస్తాయని స్పష్టం చేసింది. దేశంలో జరిగే మరణాల్లో 66 శాతం దీర్ఘకాలిక జబ్బులే కారణమని పేర్కొంది. అందులో 25 శాతం గుండె, 10 శాతం క్యాన్సర్, 15 శాతం ఊపిరితిత్తులు, డయాబెటీస్ వల్ల 4 శాతం, ఇతరత్రా దీర్ఘకాలిక జబ్బులతో 11 శాతం మరణాలు సంభవిస్తున్నాయని పేర్కొంది. శారీరక శ్రమ చేయకపోవడం వచ్చే ఈ జబ్బులను నయం చేసేందుకు ఏడాదికి ప్రజలు రూ. 25,760 కోట్లు ఖర్చు చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే వచ్చే పదేళ్లలో వీటివల్ల ప్రజలపై పడే ప్రత్యక్ష భారం రూ. 2.83 లక్షల కోట్లు ఉంటుందని హెచ్చరించింది.

వాకింగ్, సైక్లింగ్‌పై జాతీయ విధానమేదీ?

దేశంలో పిల్లలు కేవలం చదువులకే అతుక్కుపోతున్నారు. స్కూలు, కాలేజీల సమయంలో కనీసం 4 అడుగులు వేసే పరిస్థితి కూడా లేదు. స్పోర్ట్స్ వ్యవస్థ కుంటుపడింది. పాఠశాలల్లో నాణ్యమైన శారీరక శ్రమ చేయించే వ్యవస్థ లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. అసలు జాతీయస్థాయిలో చిన్న పిల్లల్లో శారీరక శ్రమను పర్యవేక్షించే వ్యవస్థ లేదని ఎత్తిచూపింది. వాకింగ్, సైక్లింగ్‌పై జాతీయ విధానం లేదని తెలిపింది. శారీరక శ్రమను బహిరంగ ప్రదేశాల్లో చేసేలా ప్రోత్సహించాలని, వాకింగ్, సైక్లింగ్‌ను ప్రోత్సహించాలని పేర్కొంది. పనిచేసే చోట కూడా శారీరక శ్రమను ప్రోత్సహించాలని ఇండియాకు సిఫార్సు చేసింది. రోజుకు 10–12 గంటలు స్థిరంగా కూర్చునే వారిలో ముందస్తు మరణాలు సంభవించే అవకాశం మిగతావారి కంటే 1.5 రెట్లు ఎక్కువ. శారీరక శ్రమ ఎక్కువగా చేసే వారిలో కిడ్నీ సమస్యలు, కడుపులో మంట, కేన్సర్ వంటివి 10 నుంచి 20 శాతం వరకు తగ్గుతాయి. అధిక బరువు సమస్య తలెత్తదు. షుగర్ వ్యాధిగ్రస్తులకు గుండెజబ్బు మరణాలు 40 శాతం తగ్గుతాయి.



జేఈఈ మెయిన్‌లో శ్రీచైతన్య విజయదుందుభి

సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్ సెషన్–1 ఫలితాల్లో శ్రీచైతన్య చరిత్ర సృష్టించింది. తెలుగు రాష్ట్రాల్లో నాలుగు 100 పర్సంటైల్స్ సాధించిన ఒకే ఒక విద్యాసంస్థగా ఆధిపత్యాన్ని కొనసాగించినట్లు శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ ఒక ప్రకటనలో తెలిపారు. వావిలాల చిద్విలాస్ రెడ్డి, దుగ్గినేని వెంకట యుగేశ్, గుతికొండ అభిరామ్, బిక్కిన అభినవ్ చౌదరి 100 పర్సంటైల్ సాధించి సత్తాచాటారని ప్రశంసించారు. విజేతలైన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందిని శ్రీచైతన్య అధినేత బి.ఎస్.రావు అభినందించారు.

'నారాయణ' ప్రభంజనం

సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్ తొలివిడత ఫలితాల్లో నారాయణ ప్రభంజనం సృష్టించింది. 300 మార్కులకు 285 మార్కులతో తమ విద్యార్థి ఎస్.కె.విశ్వజిత్ 100 పర్సంటైల్ సాధించి విజయ ఢంకా మోగించాడని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. యు.హేమంత్‌రెడ్డి, బి.రుత్విక్, జాయిల్ టెన్ని, సాయిదుర్గారెడ్డి 285 ఆపైన మార్కులు సాధించి చరిత్ర సృష్టించారన్నారు. ఆలిండియా విభాగంలో రామిరెడ్డి మేఘన, పి.తేజశ్రీ టాప్–10లో స్థానం దక్కించుకున్నారని తెలిపారు.

'ఎస్ఆర్' విద్యార్థుల ప్రతిభ

హన్మకొండ చౌరస్తా: జేఈఈ మెయిన్ సెషన్–1 ప్రవేశ పరీక్షఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చారు. పి.నర్మద 99.96 శాతం, ఎ.మణిదీప్‌రెడ్డి 99.96, జి.సాత్విక 99.95 శాతం ఉత్తీర్ణత సాధించడం గర్వకారణమని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి తెలిపారు. జాతీయ స్థాయిలో వి.దీక్షిత్ రెడ్డి 99.87, కె.ఆశ్రిత్‌రెడ్డి 99.84, సి.సోనిక 99.84, బి.సహర్ష 99.79, కె.కృష్ణకస్తూరి 99.79, షేక్‌అబ్దుల్ సమీర్ 99.78, జి.శివరాజ్ మాలిక్ 99.72, కె.రంజిత్‌రెడ్డి 99.7, ఆర్.రాజేశ్వరి 99.66, డి.శ్రవణ్‌కుమార్ 99.65 శాతంతో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.



సత్యం కోసం పనిచేయడంలో విఫలమైనవాళ్లు జీవితపు పరమోద్దేశాన్ని వదులుకున్నట్టే.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, ఫిబ్రవరి, 8

భూప్రళయం... జన విలయం

పేకమేడల్లా కూలిన అపార్ట్‌మెంట్లు... నేలకొరిగిన ఎత్తైన స్తంభాలు... నిలువునా చీలిన విమానాశ్రయ రన్‌వేలు... ధ్వంసమైన ఆసుపత్రులు... వేలకొద్దీ మృతులు, క్షతగాత్రులు... లక్షల్లో నిరాశ్రయులు... ఇది కనివిని ఎరుగని భూప్రళయం. కన్నీరాగని జన విలయం. సిరియా సరిహద్దులకు సమీపంలో టర్కీ (నూతన నామం తుర్కియా) ఆగ్నేయ ప్రాంతంలో, ఆ పొరుగునే వాయవ్య సిరియాలో సోమవారం తెల్లవారుజామున తీవ్రస్థాయిలో వచ్చిన భూకంపం, ఆపైన ఆగని ప్రకంపనల దృశ్యాలు కదిలించేస్తాయి. 2021 ఆగస్టులో దక్షిణ అట్లాంటిక్‌లో వచ్చిన ప్రకంపన తర్వాత అమెరికా భూగర్భ సర్వేక్షణ సంస్థ రికార్డ్ చేసిన ప్రపంచంలోని అతి పెద్ద భూకంపం ఇదే. ఇప్పటికి కనీసం 5 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 6 వేల భవనాలు కుప్పకూలాయి. మరో 11 వేల భవనాల పరిస్థితీ అనధికారికంగా అలానే ఉంది. అంకెలు శరవేగంతో మారుతుండడంతో మృతుల సంఖ్య 10 వేలు దాటినా ఆశ్చర్యం లేదు. బాధితుల సంఖ్య 2.3 కోట్ల దాకా ఉండవచ్చని ప్రపంచ ఆరోగ్యసంస్థ లెక్క. ఇది 21వ శతాబ్దిలోకెల్లా అతి పెద్ద ప్రకృతి వైపరీత్యం అంటున్నది అందుకే.

భూఉపరితలానికి దిగువన భూఫలకాల మధ్య ఘర్షణతో భూకంపాలు వస్తాయని లెక్క. ప్రపంచంలో ప్రధానంగా అరేబియన్, యురేషియన్, ఇండియన్, ఆఫ్రికన్, మరో చిన్నదైన అనటోలియన్ భూఫలకాలున్నాయి. మధ్యప్రాచ్యంలో భూకంపాలకు ఇవే కారణం. తాజాగా అనటోలియన్, అరేబియన్ భూఫలకాల మధ్య 100 కిలోమీటర్ల పైగా దూరం పగులు, ఒరిపిడితో 7.8 రిక్టర్ స్కేల్ స్థాయి భూకంపం టర్కీ, సిరియాలను తాకింది. టర్కీలో చారిత్రక గాజియన్‌టెప్ సమీపంలో జన సమ్మర్ద ప్రాంతంలో భూకంప కేంద్రం నెలకొంది. సోమవారమే 12 గంటల్లో 3 సార్లు భూమి కంపించింది. రెండోరోజూ 2 తీవ్ర కంపనలొచ్చి, సిరియా, లెబనాన్, ఇజ్రాయెల్‌లలో ప్రభావం చూపాయి. భూకంప అనుబంధ అనంతర ప్రకంపనలైతే డజన్లలో వస్తున్నాయి. వారసత్వ కట్టడాలూ దెబ్బతిన్నాయి.

హృదయవిదారక జగత్ప్రళయ దృశ్యాలతో, వేలాది మరణాలు సంభవించిన భూకంప బాధిత ఆగ్నేయ ప్రావిన్సులు పదింటిలో మూడు నెలలు ఎమర్జెన్సీ విధించారు టర్కీ అధ్యక్షుడు ఎర్డొగాన్. ఒక పక్క వాన, మరోపక్క చలికాలపు మైనస్ డిగ్రీల అతి శీతల గాలుల్లో సహాయక చర్యలూ కష్టమే. శిథిలాల కింద నుంచి ఆర్తనాదాలు, మూలుగులు వినిపిస్తున్నా వారిని కాపాడే వ్యక్తులు, వసతులు కరవయ్యాయి. కొనవూపిరితో కొట్టుకుంటున్నవారూ చలిలో గడ్డకట్టుకు పోతున్న పరిస్థితుల్లో... వట్టి చేతులతోనైనా శిథిలాలను తవ్వి అయినవాళ్ళను కాపాడుకోవాలన్న విఫల ప్రయత్నాలు సాగుతున్న వేళ... భారత్ సహా 45 దేశాలు మానవతా దృక్పథంతో అత్యవసర సామగ్రితో సాయానికి దిగాయి.

అసలే యుద్ధంతో, భౌగోళిక రాజకీయాలతో, ఆపైన కరోనాతో, తర్వాత కలరాతో కన్నీట మునిగిన సిరియాకు తాజా భూకంపం దెబ్బ మీద దెబ్బ. యుద్ధంతో ఆ దేశం వదిలి దక్షిణ టర్కీలో క్రిక్కిరిసిన పరిస్థితుల్లో బతుకీడుస్తున్న వారికీ, సిరియాలోనే తిరుగుబాటుదారుల చేతిలోని ఇడ్లిబ్ నగరంలో చమురు కొరత, ఆకాశాన్నంటే ధరల మధ్య అంతర్జాతీయ మానవతా సాయంతో ప్రాణాలు నిలబెట్టుకుంటున్నవారికీ ఇప్పుడు కాలి కింద భూమినీ ప్రకృతి లాగేసింది. వైట్ హెల్మెట్స్ లాంటి సంస్థలు సేవలందించడానికి శతవిధాల ప్రయత్నిస్తున్నా, సామగ్రి కొరతతో కష్టమవుతోంది. ఈ అత్యవసర సమయంలోనూ శరణార్థుల సాయానికి దోవలన్నీ సిరియా మూతబెడితే, బాధితులకు కనీసం తిండి, మంచినీళ్ళు, మందులు అందేదెలా? దౌత్య, రవాణా వసతుల పరంగా పెను సవాలైన దీన్ని అంతర్జాతీయ సమాజం పరిష్కరించకుంటే ఇది మరో పెను మానవవిషాదం.

నిజానికి, భౌగోళికంగా భూకంప ప్రేరక ప్రాంతంలో టర్కీ ఉంది. టర్కీ, సిరియా, జోర్డాన్లున్న తూర్పు మధ్యధరా ప్రాంతాన ఆఫ్రికన్, అరేబియన్, యురేషియన్ భూఫలకాల మధ్య సంక్లిష్ట సంబంధాలున్నాయి. అనటోలియన్ బ్లాక్ సరేసరి. అందుకే, టర్కీలో శతాబ్దాలుగా భూవిలయాలు పరిపాటి. అక్కడ 1939 నాటి భూకంపంలో 33 వేల మంది చనిపోయారు. ఈసారి ఈ శతాబ్దిలోకెల్లా బలమైన భూకంప తాకిడితో ఆ దేశం చిగురుటాకులా వణికింది. లోతైన భూకంపాలు సంభవిస్తే వాటి తాకిడి భూ ఉపరితలానికి తాకేసరికి చాలావరకు శక్తి కోల్పోయి, కొంత తక్కువ నష్టం కలిగిస్తాయి. కానీ, లోతు లేని భూకంపాలు శక్తిమంతంగా పైకి తాకి, పెను విధ్వంసం రేపుతాయి. తాజా భూకంపం అలాంటిదే. అయితే ఈ ప్రకృతి వైపరీత్యాన్ని ముందే ఊహించి, హెచ్చరించే వ్యవస్థలు నేటికీ లేవు. కాంతి వేగం కన్నా చాలా నిదానంగా, సెకనుకు 5 నుంచి 13 కి.మీ.ల దూరం ప్రయాణించే భూకంప తరంగాలు ఉపరితలం చేరడానికి సెకన్ల ముందే తెలుసుకోగలుగుతున్నాం.

టర్కీతో పోలిస్తే హిమాలయ ప్రాంతానికి భూకంపాల ముప్పు ఎక్కువ. ఉపరితలం కింద ఒత్తిడి అనూహ్యంగా పేరుకున్న హిమాలయాల్లో ఏ క్షణంలో ఏం జరుగుతుందో చెప్పలేం. భారత్‌లో 59 శాతం ప్రాంతానికి అలా ప్రమాదం పొంచివుంది. టర్కీ ఘటన మనకు మేలుకొలుపు. దీన్నుంచి తక్షణం పాఠాలు నేర్చుకోవాలి. రెండు వారాల క్రితం నేపాల్‌లో భూకంపం తాలూకు ప్రకంపనాలు ఉత్తర భారతదేశంలో అనేక ప్రాంతాల్లో కనిపించాయని మర్చిపోరాదు. ఏటా జనవరి 16న జాతీయ భూకంప దినం జరుపుతూ నేపాల్ లాంటివి జనచైతన్యం పెంచుతుంటాయి. అలాంటి ఆలోచనల్ని మనమూ ఆచరణలో పెట్టాలి. చేతులు కాలాక ఆకులు పట్టుకొనే కన్నా తెలివిగా, ముందుజాగ్రత్తతో ఉండాలి. ముందస్తుగా కార్యాచరణకు సిద్ధమవ్వాలి. బాధిత దేశాల పునరుజ్జీవనానికి చేయూత నిస్తూనే ఈ పనిలోకీ దిగాలి. హృదయ విదారక ప్రళయసదృశ దృశ్యాలు గుర్తుచేస్తున్నదదే.

లయ తప్పిన రిట్రీట్ ధ్వని

కామెంట్



కరణ్ థాపర్

గణతంత్ర దినోత్సవ ముగింపులో చేసే 'బీటింగ్ రిట్రీట్ మార్చ్'లో సంగీతం మారి ఉండవచ్చు, కానీ బీటింగ్ రిట్రీట్ భావనను మనం పరిరక్షించుకుంటూ వచ్చాము. దాన్ని ఎన్నడూ విదేశీయమైనదిగా మనం భావించలేదు. అది భారతీయ సైన్యంలాగే భారతీయతతో కూడి ఉండేది. మనకు ఈరోజు ఉన్న సైన్యం కూడా బ్రిటిష్ వారు రూపొందించిందే. బీటింగ్ రిట్రీట్‌కి ఉన్న బ్రిటిష్ మూలం కారణంగా అది మనకు చీకాకు కలిగించలేదు. నిజానికది వారసత్వంగా వచ్చిన విలువలకు, సంప్రదాయాలకు ప్రతీకగా గౌరవం పొందుతోంది కూడా. అయితే ఎప్పటికీ ఈ ప్రాధాన్యం ఉంటుందా?

మీరు ఎంత ముసలివాళ్లయితే, అంత ఎక్కువగా గతాన్ని పట్టుకుని వేళ్లాడతారని చెబుతుంటారు. అది తప్పకుండా నిజమేనని నేను తలుస్తున్నాను. గత వారం గణతంత్ర దినోత్సవ ముగింపు వేళ జరిపే 'బీటింగ్ రిట్రీట్'పై నా చికాకుతో కూడిన స్పందనకు ఇది ఒక విశ్వసనీయ వివరణలా కనిపిస్తుంది. నేను దాన్ని ఇష్టపడలేదు. కానీ నేను ఈ విషయాన్ని తర్వాత పేర్కొంటాను. ఓ వారం క్రితం నేను చూసిన ఆ కార్యక్రమం నేపథ్యం గురించి మొదట నన్ను వివరించనీయండి. నేను దానిపై ఇలా అనుభూతి చెందుతున్నాను.

బీటింగ్ రిట్రీట్ ఒక మిలిటరీ వేడుక. బహుశా రెండవ జేమ్స్ ఇంగ్లండ్ రాజుగా ఉన్నప్పుడు 17వ శతాబ్దంలో ఇది ప్రారంభమైంది. ఒక రాత్రిపూట సైనిక దళాలు తిరోగమిస్తున్నప్పుడు యుద్ధ ముగింపునకు సంకేతంగా బీటింగ్ రిట్రీట్‌ని మొదలెట్టారు. 1950లలో భారత దేశం కూడా రిపబ్లిక్ డే ఉత్సవాలకు సంబంధించి మూడురోజుల ముగింపు సందర్భంగా ఈ భావనను బ్రిటిష్ సంప్రదాయం నుంచి అరువు తెచ్చుకుంది. సంవత్సరాలు గడిచే కొద్దీ ఇంగ్లిష్ కవాతుల నుంచి భారతీయులే స్వయంగా స్వరపర్చడం వరకు 'బీటింగ్ రిట్రీట్ మార్చ్'లో సంగీతం మారి ఉండవచ్చు, కానీ బీటింగ్ రిట్రీట్ భావనను మాత్రం మనం పరిరక్షించుకుంటూ వచ్చాము. నిజానికి దాన్ని మనం ఆదరిస్తూ వచ్చాము. దాన్ని ఎన్నడూ విదేశీయమైనదిగా మనం భావించలేదు. అది భారతీయ సైన్యంలాగే భారతీయతతో కూడి ఉండేది. పైగా గుర్తుంచుకోండి. మనకు ఈరోజు ఉన్న సైన్యం కూడా బ్రిటిష్ వారు రూపొందించిందే. బీటింగ్ రిట్రీట్‌కి ఉన్న బ్రిటిష్ మూలం కారణంగా అది మనకు చికాకు కలిగించలేదు. నిజానికది వారసత్వంగా వచ్చిన విలువలకు, సంప్రదాయాలకు ప్రతీకగా గౌరవం పొందుతోంది కూడా.

గణతంత్ర దినోత్సవ సందర్భంగా బీటింగ్ రిట్రీట్‌కే నేను ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తుంటాను. నిస్సందేహంగా, సైనికుల కవాతు కచ్చితత్వం చూసి ఆశ్చర్యపడుతుంటాను. భూమ్యాకర్షణ శక్తిని సైతం డేర్ డెవిల్స్ ధిక్కరించడాన్ని చూస్తూ ఆశ్చర్య చకితుడినవుతుంటాను. నేను దాన్ని తోసిపుచ్చలేను. కానీ రిట్రీట్ సంగీతం; నార్త్, సౌత్ బ్లాక్ వెనుక నిలిపి ఉంచిన బ్యాండ్‌ల వర్ణరంజితమైన యూనిఫాంలు, రక్షణ గోడ వద్ద ఉన్న ఒంటెలు, చివరగా దిగంతాల వద్ద సూర్యుడు అస్తమించే సమయం ఎల్లప్పుడూ నన్ను వెంటాడుతుంటుంది. నా జ్ఞాపకాల్లో ఎన్నటికీ నిలిచి ఉండిపోయింది ఏమిటంటే రైసినా హిల్స్‌ని అధిరోహిస్తూ, 'సారే జహాసే అచ్చా... హిందూ సితా హమారా హమారా' అని ఆలపిస్తూ ఉండే రిట్రీటింగ్ బ్యాండ్లు. వారు శిఖరాన్ని సమీపిస్తున్నప్పుడు సూర్యుడు అస్తమించడం ప్రారంభమవుతుంది. వెంటనే లెక్కలేనన్ని పసుపు పచ్చ దీపాలు మొత్తం విస్టాను ప్రకాశవంతం చేసేవి. ఇది ప్రతి ఒక్కరినీ ఆనందంలో ముంచెత్తేది. నేటి పదజాలాన్ని ఉపయోగించి చెప్పాలంటే... అదొక విస్మయం కలిగించే క్షణం.



అయ్యో... అది చాలావరకు ఇప్పుడు ఒక చరిత్రగా మిగిలిపోయింది. ఇక అది జరగని పని. ప్రారంభ ప్రయత్నంగా మార్పు చేసిన సంగీతం భయానకమైనది కాకున్నా, కఠోరంగా ఉంటోంది. భారతీయ లేదా బ్రిటిష్ మూలానికి చెందినవైనా సరే పాదతాడనంతో చేసే సైనిక కవాతుల సంగీతం ఇకపై వినిపించదు. దీని స్థానంలో రాగాలు వచ్చి చేరాయి. సైనిక వేడుకల్లో వాటికి తావులేదు. వీటిని ఇంట్లో లేదా కాన్సర్ట్ హాల్‌లో అయితే బాగా ఆస్వాదించవచ్చు. విజయ్ చౌక్‌లో సైనిక బ్యాండ్లు ఆలపించేవి కాదు. మరీ ఘోరమైన విషయం ఏమిటంటే, ఈ సంవత్సరం ఆలపించిన బీటింగ్ రిట్రీట్ రాగం (ఇది సరైన పదమే అయితే) ఏమాత్రం లయబద్ధంగా లేదు. మాధుర్యంతోనూ లేదు. దీంట్లో సంగీతం కంటే రొద మాత్రమే ఎక్కువగా ఉండింది. అది నరకద్వారంలో ఎవరైనా ఊహించే రొదలా ఉండింది కానీ స్వర్గలోకపు ద్వారాల వద్ద వినిపించే సంగీతంలా లేదు. ఈ ఒక్క మార్పు దాని అర్థాన్ని మాత్రమే కాదు, బీటింగ్ రిట్రీట్ తక్షణ సారాన్నే ధ్వంసం చేసిపడేసింది. అయినా సరే ఎవరైనా దీన్ని పరిగణిస్తారా? దీనిలోని ఇతర అంశాలు కూడా అదృశ్యమైపోయాయి. ఎత్తయిన ప్రాంతంలో ఉన్న గంటల నుంచి వినిపించే దాని శ్రావ్యమైన మాధుర్యం కూడా పరిత్యజించబడింది. భవనాలను వెలిగించే లక్షలాది పసుపుపచ్చ బల్బుల స్థానంలో బహుళరంగులు గోడలపై ప్రదర్శితమవుతున్నాయి. అంతకు ముందున్నవి ధ్వనింపజేసే ఆశ్చర్యం, ఆనందం స్థానంలో ఇప్పుడు ఒక యాంటీ క్లైమేట్‌ని తలపించే నీరసమైన అసంతృప్తి చోటు చేసుకుంది.

బీటింగ్ రిట్రీట్‌లోని ఆనాటి మ్యాజిక్ కనుమరుగైనట్లు కనిపిస్తోంది. ఒక సాధారణమైన, ఉత్తేజపూరితం కానిది మాత్రమే మనకు ఇప్పుడు మిగిలింది. ఒకప్పుడు బీటింగ్ రిట్రీట్‌కి చెందిన అద్భుతం కానీ, మనోహర దృశ్యం కానీ ఇప్పుడు లేవు. మనకు జ్ఞాపకాలు మాత్రమే మిగిలాయి. కాలంతోపాటు అవి కనుమరుగైపోతాయి. గత వారం రిట్రీట్ సందర్భంగా వర్షం కురిసినప్పుడు, దేవుళ్లు సైతం విలపిస్తున్నట్లుగా నేను అనుభూతి చెందాను. అది తగిన స్పందనలాగే కనిపించింది. ప్రపంచం మారుతోందనీ, ఆ మార్పు వెనకాలే నేను మిగిలిపోయాననీ గుర్తించాను. అందుకే నేను విషాదంతో ఉన్నాను. అందుకే నేను ఇంత ప్రతికూల దృక్పథంతో ఉంటుండవచ్చు. చివరగా, నేను ముందుకేసి చూస్తున్నప్పుడు, నా మనస్సును రెండు ప్రశ్నలు చుట్టుముట్టాయి. ఇక్కడ చుట్టుముట్టడం అనేది సరైన పదం. ఎందుకంటే వాటికి నేను సమాధానం చెప్పలేను మరి. సారే జహా సే అచ్చా పాట పాడి ఎంతకాలమైంది! కచ్చితంగా దాని మూలాలే ఆ పాటను అనుమానించేలా చేశాయా? అలాగయితే బీటింగ్ రిట్రీట్ ఎప్పుడు ముగిసిపోతుంది? ఏమైనా దాని వలసవాద చరిత్రను మీరు తోసిపుచ్చలేరు కదా. పైగా అది ఆత్మనిర్భర్ కాదు కూడా మరి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఆపన్నహస్తం



టర్కీలో వచ్చిన భయానక భూకంపం నేపథ్యంలో ఇజ్రాయిల్ అక్కడికి 150 మంది భద్రతా, వైద్య బలగాలను పంపింది. స్నేహహస్తం ఇవ్వడం (ఆపరేషన్ ఆలివ్ బ్రాంచ్) మొదలైంది.

– అవీవా క్లోంపాస్, ఇజ్రాయిల్ రచయిత్రి

ఇదా స్నేహం?



టర్కీకి పునరావాస సామగ్రిని మోసుకెళ్తున్న భారత విమానానికి పాకిస్తాన్ తన గగనతలాన్ని నిరాకరించింది. టర్కీకి పాకిస్తాన్ ఎలాంటి మిత్రదేశమో చూడండి.

– ఇంతియాజ్ మహమూద్, స్వేచ్ఛావాది

ఎలా తెలుసు?



వరల్డ్ ఎకనామిక్ ఫోరం వేదికగా జరిగిన ఒక ఇంటర్వ్యూలో మోడెర్నా కంపెనీ సీఈఓ తనకు మహమ్మారి రాబోతోందని తెలుసునని అన్నారు. అందుకే టీకాల ఉత్పత్తి పెంచామని చెప్పారు. ఆయనకు ఎవరు చెప్పారు?

– బెర్నీ స్పాఫోర్డ్, కామెంటేటర్

అదే ఉదారతా?



మన అల్ప ప్రమాణాల భారతీయ ఉదారవాదుల లెక్కల్లో చూసినా కూడా... ఉదారవాది అని నిరూపించుకోవడానికి మొన్న మరణించిన పాకిస్తాన్ మాజీ అధ్యక్షుడు ముషారఫ్‌ను కూడా పొగడటం మరీ అతిగా లేదూ!

– జె. రూప, వ్యాఖ్యాత

అర్థమౌతోందిగా!



మనకు రాజకీయ, మత విభేదాలు ఎన్ని ఉన్నప్పటికీ మనల్ని మనం గౌరవించుకోవచ్చు. మనం విదేశాల్లో ప్రయాణిస్తున్నప్పుడు అక్కడ కేవలం భారతీయులం అవుతాము.హిందూ ఇండియన్, ముస్లిం ఇండియన్ అని ఉండరు. నేనేం చెప్తున్నానో మీకు బాగా తెలుసు...

– ఉర్ఫి జావేద్, నటి

భావజాల సమస్య



తీవ్ర వామపక్షీయులలో నాకు నచ్చేది ఇదే. కోవిడ్ టీకాలు, ఆదేశాల మీద నా అభిప్రాయం ఎంత తప్పో అని వాళ్లు నాతో వాదించాలనుకుంటారు. నిజానికి వాళ్లకు నచ్చిన ఆ విధానాలను రూపొందించడంలో సాయపడిన లోపలి మనుషుల్లో నేనూ ఒకడినని వాళ్లు అంగీకరించరు. కొందరు ఎప్పటికీ మేలుకోరు.

– ర్యాన్ కన్నింగ్‌హామ్, అమెరికా పొలిటికల్ ఇన్‌ఫ్లుయెన్సర్

సగం పంజాబే చాలా?



ఈ అన్ని సోకాల్డ్ 'ఖాలిస్తానీ రిఫరెండాల్లో', వాళ్లు ఎప్పుడూ 'ఇండియా పాలనలో ఉన్న పంజాబ్' అనే ప్రస్తావిస్తారు– అంతేగానీ మిగతా పంజాబ్ ఊసెత్తరు. ఆఖరికి సిక్కు సామ్రాజ్యపు గొప్ప రాజధాని నగరం అయిన లాహోర్ సహా. ఖాలిస్తానీలు ఎప్పుడూ నాన్‌కానా సాహిబ్, ఖర్తార్‌పూర్ లాంటివాటి గురించి కూడా డిమాండ్ చేయరు. ఎందుకు?

– హిందోల్ సేన్‌గుప్తా, రచయిత

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

మల్లయుద్ధం సంస్కృతిలో భాగం

మల్లయుద్ధం... మన ఇతిహాస కాలం నుండి మనతోనే ఉన్న మన మట్టి ఆట. అయితే మల్లయుద్ధానికి ప్రోత్సాహం కరవైపోయింది. మన ప్రాచీన వారసత్వ సంపద అయిన ఈ క్రీడ భవిష్యత్ తరాలకు కచ్చితంగా అందించాలనే కృత నిశ్చయంతో మా తండ్రీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రీ అయిన దివంగత ముఖేష్ గౌడ్ స్మారకార్థం శ్రేష్ఠ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ముఖేష్ గౌడ్ మెమోరియల్ మల్లయుద్ధ ఛాంపియన్‌షిప్'ను ఫిబ్రవరి 9 నుండి 12 వరకు హైదరాబాద్‌లోని ఎల్బీ (ఇండోర్) స్టేడియంలో నిర్వహించడానికి నిర్ణయించాము.

నేడు భారత దేశం తన ప్రాచీన వైభవాన్నీ, సాంస్కృతిక కీర్తినీ విశ్వవ్యాప్తం చేస్తూ ఆధునికత వైపు పరుగెడుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ క్రీడల పట్ల చూపెడుతున్న ఆసక్తీ, క్రీడాకారులకు ఇస్తున్న ప్రోత్సాహం, క్రీడా రంగంలో మౌలిక సదుపాయాల కల్పన కోసం తీసుకొంటున్న చొరవ... నా లాంటి ఎంతో మంది యువకులకు స్ఫూర్తిగా నిలిచాయి. గ్రామీణ ప్రాంతం నుండి క్రీడా సంస్కృతిని ప్రోత్సహించడానికి వారు రచిస్తున్న ప్రణాళికలు నేడు దేశవ్యాప్తంగా సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఇదే మార్గంలో మేమూ నడుస్తూ భవిష్యత్‌లో యువ క్రీడాకారులకు ఉపకార వేతనాలు ఇవ్వాలని ఈ ఛాంపియన్‌షిప్ సందర్భంగా నిర్ణయించడం జరిగింది.



ఈ పోటీల్లో సుమారు 500 మంది మల్లయోధులు 17 విభాగాల్లో పాల్గొంటారు. 35 లక్షల విలువైన 57 బహుమతులను అందించబోతున్నాం. మహిళలు మొదలు చిన్నారుల వరకూ అందరికీ ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నాం. క్రీడలకు ప్రజలను సమైక్యం చేసే శక్తితో పాటు ప్రాంతీయ, విభజనవాదాన్ని చెరిపి వేసి జాతీయతను నింపే మహత్తర యుక్తి ఉంది. మన సంస్కృతినీ, వైభవాన్నీ నిజమైన మట్టి 'వైశిష్ట్య'న్ని పునరుద్ధరించే సామర్థ్యం మన మల్లయోధులకు ఉంది. క్రీడలనూ, క్రీడాకారులనూ ప్రోత్సహించడం అంటే దేశ సేవ చేయడమే. అందుకే ఈ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనడానికి వచ్చే మల్లయోధులకు ఎలాంటి ప్రవేశ రుసుము విధించకుండానే పోటీలో పాల్గొనే అవకాశం కల్పించాం. వీక్షకులను కూడా సాదరంగా ఆహ్వానిస్తున్నాం.

మల్లయోధులకు ప్రోత్సాహం అందించడంతో పాటు... రాబోయే రోజుల్లో అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో పాటు ధార్మిక వ్యవహారాల పట్లా ప్రత్యేక ప్రణాళికతో పనిచేయాలని నిర్ణయం జరిగింది. మహిళా సాధికారత, శిశు సంక్షేమం, ఆలయ పునరుద్ధరణ లాంటి ముఖ్యమైన అంశాలపై విస్తృత స్థాయిలో క్షేత్ర స్థాయి వరకు మా ఫౌండేషన్ పని చేయబోతోంది. రండి... మనం అందరం కలిసి మన మల్లయుద్ధ క్రీడకు ఊతమిద్దాం. చరిత్ర మరిచిన జాతికి భవిష్యత్ ఉండదు. మట్టి ఔన్నత్యం మరిచిన వారికి పురోగతి ఉండదు.

– విక్రమ్ గౌడ్, బీజేపీ నాయకులు, శ్రేష్ఠ ఫౌండేషన్ వ్యవస్థాపకులు

ఏపీ ప్రతిపాదిత పెన్షన్ విధానంపై కేంద్రం ఆసక్తి

విశ్లేషణ



పి. వైద్యనాథన్ అయ్యర్

కొత్తదా? లేక పాతదా? ఉద్యోగుల పింఛన్‌ల విషయంలో ఇప్పుడు దేశంలో చెలరేగుతున్న చర్చ ఇది. దాదాపు నాలుగు రాష్ట్రాలు మళ్లీ పాత పింఛన్ విధానం వైపు మళ్లాయి. అలాగే మహారాష్ట్రలోని శివసేన (షిండే)–బీజేపీ కూటమి ప్రభుత్వం కూడా పాత పింఛన్ విధానం పట్ల మొగ్గు చూపుతున్నదన్న వార్త నేపథ్యంలో మొదలైన చర్చకు ఇప్పుడు ఇంకో కొత్త, వినూత్నమైన కోణం వచ్చి చేరింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిపాదించిన సరికొత్త పింఛన్ విధానం కేంద్ర ప్రభుత్వాన్ని సైతం ఆకర్షించడమే ఆ కోణం. 2004 తరువాత ఉద్యోగాల్లో చేరినవారు తమ జీతాల్లోంచి కొంత భాగాన్ని పింఛన్ ఫండ్‌కు జమ చేయాల్సి ఉంటుంది. అయితే పాత పింఛన్ విధానంలో మాదిరిగా రిటైర్మెంట్ తరువాత కచ్చితంగా నిర్దిష్ట మొత్తం నెలవారీ అందుతుందన్న గ్యారెంటీ మాత్రం లేదు. ఎందుకంటే పాత పెన్షన్ విధానం స్థానంలో కొత్తగా ప్రవేశపెట్టిన నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) తాలూకూ ప్రయోజనాలు మార్కెట్ల వైఖరిపై ఆధారపడి ఉంటాయి కాబట్టి! ఈ కారణంగానే రాష్ట్రాల్లోనూ, అటు కేంద్రంలోనూ కొంతమంది ఉద్యోగులు తమకు పాత పింఛన్ విధానం కావాలని పట్టుబడుతున్నారు.

ఈ నేపథ్యంలో వైఎస్ జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం అటు పాత, ఇటు కొత్త పింఛన్ విధానాల మేలి మేళవింపుగా 'గ్యారెంటీడ్ పింఛన్ స్కీమ్' (జీపీఎస్) పేరుతో వేరొక కొత్త పద్ధతిని ప్రతిపాదిస్తోంది. ఇప్పటికైతే ఈ విషయమై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి వద్ద ఇలాంటి ప్రతిపాదన లేకపోయినా, కేంద్రంలోని అధికారులు మాత్రం ఈ సరికొత్త పద్ధతిపై ఆసక్తి చూపుతున్నారు. అంతర్గతంగానైనా జీపీఎస్ లాభ నష్టాలపై చర్చలు చేస్తున్నారు.

ఇంతకీ ఈ కొత్త జీపీఎస్ విధానం ఎలా పనిచేస్తుందని అనుకుంటున్నారా? ఆ విషయాన్నే పరిశీలిద్దాం. ఇందులో ఉద్యోగులకు రెండు ఆప్షన్స్ ఉంటాయి. మూల వేతనంలో పది శాతాన్ని పింఛన్ ఫండ్‌కు ఇవ్వడం ఒకటి. రాష్ట్ర ప్రభుత్వం అంతే మొత్తాన్ని తన వంతు వాటాగా అందిస్తుంది. రిటైర్మెంట్ తరువాత మీరు చివరగా అందుకున్న వేతనంలో 33 శాతం పింఛన్‌గా పక్కాగా లభిస్తుంది! ఒకవేళ మీరు మీ మూల వేతనంలో 14 శాతం లేదా అంతకంటే ఎక్కువ... పింఛన్ నిధికి చెల్లించారని అనుకుందాం. రాష్ట్ర ప్రభుత్వం కూడా అంతే మొత్తాన్ని జోడిస్తుంది. మీ పింఛన్ కూడా చివరి వేతనంలో 33 శాతం కాకుండా 40 శాతం అవుతుంది!!

జీపీఎస్ విధానం గురించి తామిప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు తెలియజేశామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర స్థాయిలో అమలు చేసేందుకు కేంద్రం అనుమతులేవీ కోరలేదనీ, ఆ అవసరం కూడా రాదనీ అధికారులు చెప్పారు. కానీ... కేంద్ర ప్రభుత్వ అధికారులు జీపీఎస్ మోడల్ ఆసక్తికరంగా ఉందనీ, మరింత వివరంగా పరిశీలన, అధ్యయనం చేయాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

పాత పింఛన్ విధానం ఆర్థికంగా ఏమంత ప్రయోజనకరమైంది కాదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పష్టమైన అభిప్రాయంతో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం లెక్కల ప్రకారం 2023లో వేతనాలు, పింఛన్‌ల కింద రూ. 76,590 కోట్లు ఖర్చు అవుతుంది. అయితే 2040 నాటికి ఇదే పద్దు అందుకు రెట్టింపు దాటి,



ఏకంగా రూ.1,85,172 కోట్లకు ఖర్చు చేరుకుంటుందనేది అంచనా. పాత విధానాన్ని పునరుద్ధరిస్తే దాని ప్రభావం భవి ష్యత్ తరాలపై తీవ్రంగా ఉంటుందని రాష్ట్రం అంచనా వేస్తోంది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)గానూ వ్యవహరించే కొత్త పింఛన్ విధానంలో ఉద్యోగులకు అందే మొత్తం చాలా తక్కువన్నది కూడా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. బ్యాంకుల్లో డిపాజిట్లపై వడ్డీలు క్రమేపీ తగ్గుతున్న సమయంలో ఉద్యోగులకు అందే మొత్తం వారి చివరి వేతనంలో 20 శాతం వరకు మాత్రమే ఉంటుందని అంచనా. ఉద్యోగులు జీపీఎస్‌కు అంగీకరిస్తే పింఛన్ మోతాదులో 70 శాతం వరకూ పెరుగుదల ఉంటుందని చెబుతోంది.

అయితే కేంద్ర ప్రభుత్వ అధికారులు ఎన్‌పీఎస్ విధానంలో దాదాపు 9.5 శాతం రాబడులు వస్తాయనీ, ఉద్యోగుల చివరి వేతనంలో 40 శాతం వరకూ పింఛన్ ఉంటుందనీ చెబుతున్నారు. ఎన్‌పీఎస్‌లో యాభై శాతం కచ్చితంగా వస్తుందని చెప్పలేకపోయినా, సృజనాత్మక ఆలోచనతో ఈ సమస్యను పరిష్కరించవచ్చని పేరు చెప్పేందుకు ఇష్టపడని కేంద్ర ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. పాత, కొత్త పింఛన్ విధానాల మధ్య ఉన్న పది శాతం అంతరాన్ని కేంద్రం భర్తీ చేయడం ఒక ఆలోచన అనీ, పింఛన్ నిధికి ప్రభుత్వాలు నెలవారీ అందించే మొత్తాన్ని పెంచడం రెండో ఆలోచన అనీ ఆ అధికారి వివరించారు.

కేంద్ర ప్రభుత్వం 2019 ఏప్రిల్ నెల నుంచి పింఛన్ నిధికి చెల్లించే మొత్తాన్ని ఉద్యోగి మూలవేతనంలో 14 శాతానికి పెంచింది. ఉద్యోగి చెల్లించేది పది శాతం మాత్రమే. అయితే దీనిపై కూడా 2004 జనవరి నుంచి 2019 మార్చి మధ్యలో ఉద్యోగాల్లో చేరిన వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎందుకంటే వీరు మూల వేతనంలో పది శాతం పింఛన్ నిధికి చెల్లిస్తే కేంద్రం కూడా పది శాతమే చెల్లించింది కాబట్టి. అంటే... 2019 ఏప్రిల్ నుంచి కొత్తగా చేరిన వారితో పోలిస్తే వీరి పింఛన్ నిధి పెద్దగా పెరగదు.

కేంద్రం అవసరమైతే కొత్త పింఛన్ విధానంలో ప్రభుత్వం చెల్లించే మొత్తాన్ని మరింత పెంచేందుకూ సిద్ధంగా ఉందని అధికారులు చెబుతున్నారు. అదే జరిగితే ఉద్యోగులకు అందే పింఛన్ వారి చివరి వేతనంలో సగం వరకూ ఉండే అవకాశం ఉందని అంటున్నారు. కొత్త ఎన్‌పీఎస్ విధానంలో వచ్చే రాబడులు 30 ఏళ్ల కాలంలో 9 – 10 శాతం ఉంటాయని లెక్కిస్తే ఇది సాధ్యమని వివరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న జీపీఎస్‌పైనా, అమల్లో ఉన్న కొత్త పింఛన్ విధానం ఎన్‌పీఎస్ సాధకబాధకాలపైనా... చర్చలు మరికొంత కాలం జరుగుతాయనీ, 2024 లోక్‌సభ ఎన్నికల సమయానికి ఇవి ఒక కొలిక్కి వచ్చి రాజకీయ ముఖచిత్రంపై కూడా కనిపించవచ్చుననీ అధికారులు అంటున్నారు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: బ.తదియ తె.4.28 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి చవితి, నక్షత్రం: పుబ్బ సా.6.56 వరకు, తదుపరి ఉత్తర, వర్జ్యం: రా.2.40 నుండి 4.22 వరకు, దుర్ముహూర్తం: ప.11.52 నుండి 12.36 వరకు, అమృతఘడియలు: ప.11.58 నుండి 1.44 వరకు; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 6.35, సూర్యాస్తమయం: 5.54.



చంద్రపట్నం వేస్తున్న దృశ్యం

విద్యుత్ కాంతుల వెలుగుల్లో పెద్దగట్టు జాతర ప్రాంతం. భారీగా జనసందోహం

కనులపండువగా లింగమంతుల స్వామి కల్యాణం

సూర్యాపేట: దురాజ్‌పల్లి శ్రీ లింగమంతుల స్వామి (పెద్ద గట్టు) జాతరకు మంగళవారం భక్తులు పోటెత్తారు. రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. మూడవ రోజు మంగళవారం యాదవ పూజారులు చంద్రపట్నం వేసి భక్తిశ్రద్ధలతో శ్రీ లింగమంతుల స్వామి, మాణిక్యమ్మల కల్యాణం జరిపించారు. చంద్రపట్నంపై లింగమంతుల స్వామి వారు ఉన్న పెట్టెను ఉంచి పూజలు చేశారు. చంద్రపట్నం ముందు మెంతబోయిన, మున్న, బైకాను వంశస్తులు బియ్యంతో పోలు పోసి తమలపాకులు, పోకలు, ఖర్జూరాలు ఉంచి స్వామివారి కథలతో కల్యాణ తంతు నిర్వహించారు. జాతరలో నాలుగో రోజు బుధవారం నెలవారం కార్యక్రమం నిర్వహించనున్నారు.

టీచర్లందరికీ బదిలీ చాన్స్

317 జీవో ఉపాధ్యాయులకు అవకాశం
- హైకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం
- 25 వేల మందికి ఊరట!



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయులందరికీ బదిలీ అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను అమలు చేస్తామని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కార్యాలయం మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొంది. ఇప్పటికే ప్రారంభమైన టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపింది. 317 జీవో ద్వారా కొంతకాలం క్రితం కొత్త జిల్లాలకు వెళ్లిన దాదాపు 25 వేల మంది టీచర్లు ఈ నెల 12 నుంచి 14 వరకూ బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. టీచర్ల బదిలీలకు సంబంధించిన షెడ్యూల్ గత నెల 27న విడుదలైంది. ఉపాధ్యాయులు తాము పనిచేస్తున్న స్కూల్‌లో కనీసం రెండేళ్ల సర్వీసు ఉంటేనే బదిలీకి అర్హులని ప్రభుత్వం పేర్కొంది. ఈ నేపథ్యంలో 59 వేల మంది బదిలీకి దరఖాస్తు చేసుకున్నారు. వీరి ధ్రువపత్రాలను డీఈవోలు పరిశీలించారు. సీనియారిటీ విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలోనే 317 జీవో ద్వారా బదిలీ అయిన టీచర్లు కోర్టును ఆశ్రయించారు. కోర్టు వారికి అనుకూలంగా తీర్పునివ్వడంతో బదిలీల ప్రక్రియ మళ్లీ మొదటికొచ్చింది. ఇప్పుడు 317 జీవో ద్వారా బదిలీ అయిన టీచర్లు ఉమ్మడి జిల్లాల్లో పనిచేసిన సర్వీసును కూడా పరిగణనలోనికి తీసుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది.

పైరవీ టీచర్లలో గుబులు

బదిలీల్లో ఉన్న కొన్ని ఆప్షన్లను ఉపయోగించుకుని అడ్డగోలుగా పైరవీ బేరాలు కుదుర్చుకున్న కొంత మంది టీచర్లలో తాజా పరిణామాలు గుబులు పుట్టిస్తున్నాయి. టీచర్లు లేదా వారి కుటుంబంలోని వారికి దీర్ఘకాలిక వ్యాధులుంటే వైద్య సేవల కోసం కోరుకున్న ప్రాంతానికి బదిలీ చేయించుకునే వెసులుబాటు మార్గదర్శకాల్లో పొందుపరిచారు. వాస్తవానికి అనేక మంది ఈ కోటాను దుర్వినియోగం చేసినట్టు ఫిర్యాదులు వస్తున్నాయి. అనారోగ్య కోటా కింద దరఖాస్తు చేసిన వారికి కూడా సీనియారిటీని బట్టి ప్రాధాన్యతనిస్తారు. ఈ ప్రక్రియలో కొంత మంది తప్పుడు సర్టిఫికెట్లతో పైరవీలు చేయించుకున్నట్టు, దీని కోసం మధ్యవర్తులకు రూ. లక్షల్లో ముట్టజెప్పినట్టు ఆరోపణలున్నాయి. తాజాగా 317 జీవో టీచర్లకు కూడా అనారోగ్య కోటా వర్తించనుంది. దీంతో ఈ కోటాలో తమ సీనియారిటీ మారుతుందేమోననే ఆందోళన పైరవీలు చేసుకున్న ఉపాధ్యాయుల్లో వ్యక్తమవుతోంది.

అలా చేస్తే క్రెడిట్ మనకే వచ్చేదిగా..

బదిలీల మార్గదర్శకాల్లో జీరో సర్వీసు నిబంధన ఉండాలని అన్ని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని కోరాయి. దీనిపై మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా సానుకూలంగా స్పందించారు. కానీ పాఠశాల విద్యా డైరెక్టర్ ఇందుకు అడ్డుపడ్డారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ అంశం మంత్రి వద్ద మంగళవారం చర్చకు వచ్చినట్టు తెలిసింది. మనమే జీరో సర్వీస్ ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు కదా అని మంత్రి వ్యాఖ్యానించినట్టు తెలిసింది. ఇప్పుడు కోర్టు ఆదేశాలతో అమలు చేస్తున్నారు తప్ప, ప్రభుత్వం ఔదార్యంతో వ్యవహరించిందనే క్రెడిట్ రాదు కదా అంటూ అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది.

మూల్యాంకనంపై అనుమానాలున్నాయి

ఇంటర్ విద్య జేఏసీ చైర్మన్ డాక్టర్ పి.మధుసూదన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ ప్రశ్నపత్రాల మూల్యాంకనంపై అనేక అనుమానాలున్నాయని, తక్షణమే ఈ టెండర్లను రద్దు చేయాలని ఇంటర్‌విద్య జేఏసీ చైర్మన్ డాక్టర్ పి.మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న గ్లోబరీనా సంస్థ మారుపేర్లతో కాంట్రాక్టు దక్కించుకునే ప్రయత్నం చేస్తోందని ఆయన అన్నారు. తన సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 1న జరిగిన ప్రీ బిడ్ మీటింగ్‌లో పాల్గొన్న 9 కంపెనీల్లో ఒక కంపెనీ సీఈవో, ఎండీ.. గ్లోబరీనా కంపెనీకి చెందినవారు ఒకరే కావడం అనుమానాలకు తావిస్తోందన్నారు.

అన్నీ తప్పుడు ఆరోపణలు: నవీన్ మిత్తల్

అవినీతి, ఇతర కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న మధుసూదన్ రెడ్డి ఇంటర్ బోర్డ్ ప్రతిష్టను దిగజార్చేలా నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఇంటర్ బోర్డ్ కార్యదర్శి నవీన్ మిత్తల్ స్పష్టం చేశారు. బోర్డ్‌లో అక్రమ చొరబాటుకు ప్రయత్నించిన నేరంపై చార్జిషీటు దాఖలవ్వడంతో తనపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఇదిలా ఉండగా, తమ సంస్థపై అసత్య ఆరోపణలు చేయడాన్ని తప్పుబడుతూ గ్లోబరీనా సంస్థ మధుసూదన్ రెడ్డికి లీగల్ నోటీసు ఇచ్చింది.

బీసీల సంక్షేమానికి పెద్దపీట: హరీశ్

ఆత్మగౌరవ భవనాల్లో సౌకర్యాల కల్పనపై మంత్రి సమీక్ష



శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస్ యాదవ్

మణికొండ: దేశంలోని ఏరాష్ట్రంలోనూ లేనివిధంగా తెలంగాణలో బీసీల సంక్షేమానికి ఇప్పటివరకు రూ.48 వేల కోట్లు ఖర్చుచేశామని, ఈ సంవత్సరం 6,229 కోట్లను బడ్జెట్‌లో కేటాయించామని రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖల మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. మంగళవారం ఆయన మంత్రులు గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి గండిపేట మండలం కోకాపేటలోని ఆరెకటిక, గాండ్ల, రంగ్రేజ్, భట్రాజ్ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు ఆయన యాదవ, కురుమ ఆత్మగౌరవ భవనాలను పరిశీలించారు. ఆయా భవనాలకు అవసరమైన విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సౌకర్యాల కల్పనపై అధికారులతో సమావేశం నిర్వహించారు. కోకాపేటలో బీసీల ఆత్మగౌరవ సముదాయాల నిర్మాణపనులను సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. తుది దశకు చేరుకున్న యాదవ, కురుమ సంఘాల భవనాలను మార్చి 10న ప్రారంభిస్తామన్నారు.

బీసీలకు ప్రభుత్వం అండ: రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీలకు అండగా నిలుస్తున్నారని మంత్రి కమలాకర్ అన్నారు. ఇప్పటివర కు 29 బీసీ సంఘాల ఆత్మగౌరవ భవనాలకు భూమిపూజ చేశామన్నారు. దేశవ్యాప్తంగా ఆయా ప్రభుత్వాలు బీసీల గురించి కేవలం మాటలే చెబుతాయని, తెలంగాణలో మాత్రం బీఆర్‌ఎస్ సర్కారు చేతల్లో చూపిస్తోందని మంత్రి తలసాని పేర్కొన్నారు. బీసీల అభ్యున్నతికి జరుగుతున్న కృషిని ఆయా కులసంఘాల నేతలు, ప్రజలు దేశవ్యాప్తంగా చాటిచెప్పాలని సూచించారు. గతంలో ప్రభుత్వాలు బీసీలను ఓటు బ్యాంకుగానే చూశాయని, కేంద్ర ప్రభుత్వం బీసీలకు 2 వేల కోట్లు కేటాయించగా, తెలంగాణలో 6,229 కోట్లు సీఎం కేసీఆర్ కేటాయించారని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మల్లేశం, బండ ప్రకాశ్, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, బీసీ కమిషన్ సభ్యుడు ఉపేంద్ర, జిల్లా కలెక్టర్ హరీశ్, రాజేంద్రనగర్ ఆర్డీవో చంద్రకళ, ఆయా కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

దమ్ముంటే రాజీనామా చేసి వెళ్లిపో

పొంగులేటికి మంత్రి పువ్వాడ సవాల్



వైరా: 'నీకు దమ్ముంటే బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చెయ్' అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సవాల్ విసిరారు. 'పార్టీ నిన్ను బహిష్కరిస్తే సానుభూతి పొందాలని చూస్తున్నావు.. చర్యలు తీసుకునే ఎజెండా మాది కాదు' అని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా వైరాలో మంగళవారం జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంత్రి పువ్వాడ మాట్లాడారు. పిల్లి ఊపులకు సీఎం కేసీఆర్ భయపడే రకం కాదన్నారు. కేసీఆర్ చేయి వదిలిన వారు కాలగర్భంలో కలిసిపోయారని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ జెండాను వదిలితే వారి బొంద వారే తవ్వుకున్నట్లు అవుతుందని మంత్రి వ్యాఖ్యానించారు. వైరా ఎమ్మెల్యేగా రాములునాయక్ ఉండగానే మరో వ్యక్తిని వైరా నియోజకవర్గ అభ్యర్థిగా ఎలా ప్రకటించారో చెప్పాలని ప్రశ్నించారు. వైరా నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించుకునే బాధ్యత తనదేనని, కేసీఆర్‌కు ద్రోహం తలపెట్టాలనుకునే వారు పార్టీ నుండి వెళ్లిపోవాలని హితవు పలికారు. సమావేశంలో ఎమ్మెల్యే రాములునాయక్, ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, జెడ్పీ చైర్మన్ పాల్గొన్నారు.

పొగమంచు.. అతి వేగం



ముగ్గురిని బలితీసుకున్న రోడ్డు ప్రమాదం ● మూడు వేర్వేరు కుటుంబాల్లో విషాదం

- టైర్ పంక్చర్ కావడంతో డీసీఎంను రోడ్డు పక్కన నిలిపిన ఇద్దరు వ్యక్తులు
- వేగంగా వచ్చి డీసీఎంను ఢీ కొట్టిన కారు
- డీసీఎం వద్దనున్న ఇద్దరూ మృతి..
- కారు ముందు అద్దం పగిలి.. అందులోనుంచి రోడ్డుపై ఎగిరిపడి ఏడేళ్ల పాప దుర్మరణం



జిల్లా ఆస్పత్రి పోస్టుమార్టం గది వద్ద రోదిస్తున్న శ్రీనిత తల్లిదండ్రులు, బంధువులు



రోదిస్తున్న అబ్దుల్ రహీంఖాన్, రాజశేఖర్ కుటుంబ సభ్యులు



రాజశేఖర్ (ఫైల్)



రహీంఖాన్ (ఫైల్)

జనగామ: పొగమంచు.. అతివేగంతో జరిగిన రోడ్డు ప్రమాదం మూడు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. జనగామ మండలం పెంబర్తి శివారు పెట్రోల్ బంకు ఏరియాలో హైవేపై మంగళవారం తెల్లవారుజామున 5.30 గంటలకు జరిగిన ప్రమాదంలో వేర్వేరు కుటుంబాలకు చెందిన ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఇనుప సామాను స్క్రాప్ వ్యాపారం చేసే సూర్యాపేట జిల్లా తిర్మలగిరికి చెందిన వాటం రాజశేఖర్(33), భువనగిరిలో ఉంటున్న డీసీఎం క్లీనర్ ఎండీ అబ్దుల్‌రహీంఖాన్(38) స్క్రాప్ లోడ్ తీసుకుని డీసీఎంలో సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్‌కు సోమవారం రాత్రి బయలుదేరారు. జనగామ మండలం పెంబర్తి శివారు పెట్రోలు బంకు ఏరియాకు చేరుకునే సమయంలో డీసీఎం టైరు పంక్చర్ అయింది. టైరు మార్చుకునే క్రమంలో డీసీఎంను రోడ్డు పక్కన నిలిపి... పార్కింగ్ లైట్లు వెలిగించి సెక్యూరిటీగా టైరును అడ్డంగా ఉంచారు. తిరుపతి నుంచి వరంగల్‌కి రైలులో వచ్చిన బేగంపేట బ్రాంచ్ హెచ్‌డీబీ బ్యాంకు మేనేజర్ మిర్యాల దేవేందర్‌రెడ్డి కారులో తాను నివాసం ఉంటున్న హైదరాబాద్ కేబీహెచ్‌కే కాలనీకి తన భార్య శ్రావణి, కూతురు శ్రీనిత (7)తో బయలుదేరారు. తెల్లవారుజామున 5.30గంటల సమయంలో పొగమంచు కారణంగా రోడ్డుపై ఆగి ఉన్న డీసీఎంను గమనించని దేవేందర్‌రెడ్డి.. సెక్యూరిటీగా ఉంచిన టైరును వేగంగా ఢీకొట్టాడు. దీంతో గాల్లో పల్టీలు కొట్టిన కారు... టైరు పంక్చర్ చేస్తున్న క్లీనర్ ఎండీ అబ్దుల్ రహీం ఖాన్, రాజశేఖర్‌పై పడి... మరో 200 మీటర్ల దూరం దూసుకుపోయింది. నుజ్జునుజ్జయిన ఆ ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందగా... కారులో కూర్చున్న శ్రీనిత.. ముందు అద్దం పగలడంతో రోడ్డుపై ఎగిరి పడింది. తలకు బలమైన గాయాలు కావడంతో...ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది.

సీటు బెల్ట్ ధరించడంతో తప్పిన ప్రాణాపాయం

దేవేందర్‌రెడ్డి, శ్రావణి సీటు బెల్ట్ ధరించడంతో స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ప్రమాద సమయంలో డీసీఎం డ్రైవర్ మహబూబ్ కాస్త దూరంగా ఉండడంతో.. త్రుటిలో ప్రాణాపాయంనుంచి తప్పించుకున్నాడు.

దేవేందర్‌రెడ్డిపై కేసు నమోదు...

మృతుడు రాజశేఖర్ భార్య ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కారు యజమాని(డ్రైవర్) దేవేందర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ప్రమాద సమయంలో డీసీఎం రోడ్డు పక్కగా ఉందని, అటుగావచ్చే వాహనాలు గమనించేలా పార్కింగ్ లైట్లు కూడా వేశారని చెప్పారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

● 'కవర్' చేస్తున్నారిలా...



బయో టాయ్‌లెట్ మరుగుదొడ్డికి తలుపు లేకపోవడంతో ఇలా కవర్‌ను కట్టి వినియోగిస్తున్న ఈ చిత్రం ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనిది. ఈ పాఠశాలలో మొత్తం 328 మంది విద్యార్థులుండగా అందులో 178 మంది బాలికలున్నారు. వీరందరికీ ఒకే టాయ్‌లెట్ ఉండటంతో విద్యార్థినులు క్యూకట్టి నిరీక్షించాల్సిన దుస్థితి. అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

కొత్త సీసాలో... పాత సారా

బడ్జెట్‌పై వైఎస్ షర్మిల విమర్శ



ఐనవోలు మండలంలో దివ్యాంగుడితో మాట్లాడుతున్న షర్మిల

చిల్పూరు/ఐనవోలు: ఆర్థికమంత్రి హరీశ్‌రావు కొత్త సంవత్సరం బడ్జెట్ కదా అని కొత్త సీసాను మామ కేసీఆర్ ఉంటున్న ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్తే.. అందులో పాత సారా పోసి పంపినట్లు ఉందని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఆమె చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్ర మంగళవారం జనగామ, హనుమకొండ జిల్లాలో సాగింది. ఐనవోలు మండలం గర్మిళ్లపల్లికి చేరుకోవడంతో షర్మిల యాత్ర 3,600 కిలోమీటర్ల మార్క్‌కు చేరుకుంది. అంతకుముందు జనగామ జిల్లా చిల్పూరు మండలం వంగాలపల్లి నైట్ పాయింట్ వద్ద ఉదయం విలేకరులతో, ఆయాచోట్ల పాదయాత్రలో ఆమె మాట్లాడారు. గత బడ్జెట్‌లో డబుల్ బెడ్రూం ఇళ్లకు రూ.12 వేల కోట్లు, దళితబంధుకు రూ.17 వేల కోట్లు కేటాయించారని, ఈసారి బడ్జెట్‌లో గత బడ్జెట్‌ను కాపీ పేస్ట్ చేశారన్నారు. హామీలు నెరవేర్చని కేసీఆర్ 420 అని విమర్శించారు. అంతకుముందు ధర్మసాగర్ మండలంలోని ధర్మపురం గ్రామంలో వైఎస్‌ఆర్ విగ్రహం ఆవిష్కరించారు.

క్లుప్తంగా...

ఒక్కరికే 36 యావజ్జీవాలు!

లండన్‌లో భారత సంతతి జడ్జి తీర్పు

లండన్: అత్యాచారం కేసుల్లో నిందితుడికి భారత సంతతి న్యాయమూర్తి పరమ్‌జిత్ కౌర్ బాబీ చీమా–గ్రేప్ ఏకంగా 36 యావజ్జీవ కారాగార శిక్షలు విధించడలో యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)లో సంచలనాత్మకంగా మారింది. మెట్రోపాలిటన్ పోలీసు మాజీ అధికారి అయిన డేవిడ్ కారిక్(48) 2003 నుంచి 2020 దాకా.. 17 ఏళ్ల వ్యవధిలో దాదాపు 12 మంది మహిళలపై అత్యాచారానికి పాల్పడ్డాడు. వారిని దారుణంగా హింసించాడు. అతడు 49 నేరాలకు పాల్పడినట్లు తేలింది. నేరాలన్నీ నిరూపితమయ్యాయి. లండన్‌లోని సౌత్‌వార్క్ క్రౌన్ కోర్టు న్యాయమూర్తి పరమ్‌జిత్ కౌర్ మంగళవారం తీర్పు ప్రకటించారు. దోషికి 36 యావజ్జీవ కారాగార శిక్షలు విధిస్తున్నట్లు స్పష్టం చేశారు. అన్ని శిక్షలు ఏకకాలంలో అనుభవించాలని, పెరోల్‌కు దరఖాస్తు చేసుకోవాలంటే కనీసం 30 ఏళ్ల జైల్లో ఉండాల్సిందేనని ఆమె తేల్చిచెప్పారు.

ప్రపంచంలోనే తెలివైన విద్యార్థి...

ఈ ఇండియన్ అమెరికన్



వాషింగ్టన్: ప్రపంచంలో అసాధారణ తెలివితేటలు కలిగిన విద్యార్థిగా 13 ఏళ్ల ఇండియన్ అమెరికన్ నటాషా పెరియనాయగం నిలిచింది. అమెరికాకు చెందిన జాన్ హాప్‌కిన్స్ సెంటర్ ఫర్ టాలెంటెడ్ యూత్ నిర్వహించిన పలు రకాల పరీక్షల్లో అగ్రస్థానంలో నిలిచి వరసగా రెండో సంవత్సరం ఈ ఘనత సాధించింది. మొత్తం 76 దేశాల నుంచి 15 వేల మంది విద్యార్థినీ విద్యార్థులు జాన్ హాప్‌కిన్స్ సెంటర్ పరీక్షల్లో పాల్గొంటే నటాషా అత్యంత తెలివైనదానిగా తన ప్రతిభ కనబరిచింది. న్యూజెర్సీ ఫ్లోరెన్స్ ఎం గాడినీర్ మిడిల్ స్కూల్లో చదువుతున్న నటాషా 2021లో జరిగిన పోటీల్లో కూడా పాల్గొని మొదటి స్థానంలో నిలవడం విశేషం. శాట్, యాక్ట్, స్కూల్, కాలేజీ ఎబిలిటీ టెస్టుల్లో నటాషా అసాధారణ ప్రతిభ కనబరిచినట్టుగా జాన్ హాప్‌కిన్స్ సెంటర్ ఒక ప్రకటనలో తెలిపింది. భారత్‌లో చెన్నైకి చెందిన నటాషా తల్లిదండ్రులు తమ కుమార్తె తెలివితేటలకి మురిసిపోతున్నారు. నటాషా ఖాళీగా ఉన్న సమయంలో జేఆర్ఆర్ టోల్కిన్ నవలలు చదువుతుందని, డూడ్లింగ్ చేస్తుందని తెలిపారు.

ఘోర విపత్తు!



టర్కీలోని హతే నగరంలో భూకంప విధ్వంసం

6,200 దాటిన తుర్కియే, సిరియా భూకంప మృతులు

ప్రపంచ దేశాల నుంచి వెల్లువెత్తుతున్న సాయం

అదానా: తుర్కియే (టర్కీ), సిరియాల్లో సంభవించిన ఘోర భూకంపంలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. నేటమట్టమైన వేలాది భవనాల శిథిలాల కింద భారీగా శవాలు బయటపడుతున్నాయి. ఇప్పటిదాకా మృతుల సంఖ్య 6,200 దాటింది. ఒక్క తుర్కియేలోనే దాదాపు 6,000 పైచిలుకు భవనాలు కూలిపోయినట్లు నిర్ధారించారు. విపరీతమైన చలి వణికిస్తుండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. శిథిలాలను తొలగించడం, వాటి కింద చిక్కుకున్న వారిని గుర్తించడం కష్టతరంగా మారింది. సోమవారం మూడు భారీ భూకంపాలు ఇరు దేశాలను కుదిపేయడం తెలిసిందే. అనంతరం ఇప్పటిదాకా కనీసం 200కు పైగా చిన్నా పెద్దా ప్రకంపనలు వణికించాయి. వాటి భయానికి భారీగా జనం ఇళ్లూ వాకిలీ వీడి వలస బాట పడుతున్నారు.

అంతటా ఆర్తనాదాలే

శిథిలాల కింది నుంచి బాధితుల ఆక్రందనలు హృదయవిదారకంగా వినిపిస్తున్నాయని భూకంపం నుంచి బయటపడ్డవారు చెప్తున్నారు. ''కానీ వారిని కాపాడుకొనే మార్గం కనిపించడం లేదు. కాంక్రీట్ స్లాబ్‌లను తొలగించే పరికరాలు మా దగ్గర లేవు. ప్రభుత్వం నుంచి ఏ సాయమూ అందడం లేదు'' అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా జాప్యం జరిగితే బాధితులు చనిపోయే ప్రమాదముందంటున్నారు. తుర్కియేలోని హతాయ్ ప్రావిన్స్‌లో వేలాది మంది క్రీడా ప్రాంగణాలు, ఫంక్షన్ హాళ్లలో తలదాచుకున్నారు. సైన్యం రంగంలోకి దిగి టెంట్లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తోంది. షాపింగ్ మాల్స్, స్టేడియాలు, మసీదులు, కమ్యూనిటీ సెంటర్లలోనూ నిరాశ్రయులకు వసతి కల్పిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు ఆహారం, నీరు అందజేస్తున్నాయి. భూకంప కేంద్రమైన గాజియాన్‌టెప్ నగరంలో పరిస్థితి భీతావహంగా మారింది. ఎటు చూసినా బాధితుల ఆక్రందనలే వినిపిస్తున్నాయి.

సహాయక చర్యలు పూర్తయితేనే స్పష్టత

తుర్కియేలో ఇప్పటిదాకా 3,400 మందికి పైగా మరణించారని, 21,000 మందికి పైగా గాయపడ్డారని ఉపాధ్యక్షుడు ఫౌత్ ఒక్తాయ్ ప్రకటించారు. 10 ప్రావిన్స్‌ల్లో 7,800 మందిని రక్షించారు. సిరియాలో ప్రభుత్వ ఆధీనంలోని ప్రాంతంలో 800 మంది మృతిచెందారని, 1,400 మంది క్షతగాత్రులయ్యారని ఆరోగ్య శాఖ వెల్లడించింది. తిరుగుబాటుదారుల ఆక్రమణలోని వాయవ్య ప్రాంతంలో 790 మంది మరణించారని, 2,200 మందికి పైగా గాయాల పాలయ్యారని సహాయక చర్యల్లో నిమగ్నమైన వైట్ హెల్మెట్స్ అనే వైద్య సంస్థ తెలిపింది. రెండు దేశాల్లోనూ మృతుల సంఖ్య భారీగా పెరగనుందని, సహాయక చర్యలు పూర్తయ్యాకే దీనిపై స్పష్టత వస్తుందని తెలుస్తోంది.



హతే పట్టణంలో శిథిలాల్లో ఇరుక్కుని నిస్సహాయంగా చూస్తున్న ఓ అభాగ్యుడు

దేశాల ఆపన్న హస్తం

తుర్కియే, సిరియాకు అండగా నిలిచేందుకు ఐక్యరాజ్యసమితితోపాటు పలు దేశాలు ముందుకొచ్చాయి. సహాయక సిబ్బంది, నిత్యావసరాలు, వైద్య సామగ్రి పంపుతున్నాయి. భారత్ ఎక్స్‌–రే యంత్రాలు, వెంటిలేటర్లు, ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసే ప్లాంట్లు, కార్డియాక్ మానిటర్లను అందజేసింది. నిత్యావసరాలు, వైద్య పరికరాలతో రెండు విమానాలను పంపనుంది. ఇప్పటికే రెండు సైనిక రవాణా విమానాల్లో రెస్క్యూ టీమ్‌లను తుర్కియేకు పంపినట్లు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ట్వీట్ చేశారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తుర్కియే అధ్యక్షుడు తయ్యాప్ ఎర్డోగాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. భూకంప మృతులకు సంతాపం ప్రకటించారు. అవసరమైన సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. పాకిస్తాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్ బుధవారం తుర్కియేలో పర్యటించనున్నారు. పలు దేశాల అంతరిక్ష సంస్థలు అందించిన భూకంపం, అనంతర పరిణామాల శాటిలైట్లు చిత్రాలు సహాయక చర్యల్లో ఉపయోగపడుతున్నాయి.



సహాయ సామగ్రి, సిబ్బందితో తుర్కియేకు బయల్దేరిన భారత విమానం

సిరియా జైలు నుంచి 20 మంది ఉగ్రవాదుల పరారీ

సిరియాలో భూకంపంలో ధ్వంసమైన జైలు నుంచి 20 మంది ఉగ్రవాదులు పరారయ్యారు. వీరిలో చాలామంది అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఐసిస్‌కు చెందినవారేనని అధికారులు తెలిపారు. తుర్కియే సరిహద్దులో రాజో పట్టణంలోని ఈ మిలటరీ పోలీసు జైలులో 2,000 మంది ఖైదీలున్నారు. వీరిలో 1,300 మంది ఐసిస్ ఉగ్రవాదులే. భూకంపంతో జైలు గోడలు, ద్వారాలు ధ్వంసమయ్యాయి. దాంతో 20 మంది సులభంగా తప్పించుకున్నట్లు భావిస్తున్నారు.



టర్కీలోని హతే పట్టణంలో అయినవాళ్లతో పాటు సర్వం కోల్పోయి రోదిస్తున్న స్థానికులు

అమ్మ ఎక్కడ..?



ప్రకృతి ఉగ్రరూపానికి తల్లిడిల్లుతున్న తుర్కియే (టర్కీ) సిరియాల్లో తల్లీ బిడ్డల్ని వేరు చేసిన ఘటనలు హృదయాన్ని కదిలిస్తున్నాయి. కుటుంబం మొత్తాన్ని పోగొట్టుకొని అనాథగా మారిన ఏడాదిన్నర బిడ్డ మా అమ్మ ఏది, ఎక్కడుంది ? అని అడుగుతూ ఉండడం అందరి హృదయాలన్ని పిండేస్తోంది. సిరియాలోని అజాజ్‌లో ఏడాదిన్నద వయసున్న ఒక పాప శిథిలాల కింద నుంచి మృత్యుంజయురాలై బయటకు వచ్చింది. గర్భిణీగా ఉన్న ఆమె తల్లి, సోదరుడు, సోదరి ఇలా కుటుంబమంతా శిథిలాల కింద పడి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోతే, వెన్ను విరిగిపోయిన తండ్రి చావు బతుకుల మధ్య ఉన్నాడు. ఇలా కుటుంబాన్ని కోల్పోయి బిక్కుబిక్కుమంటున్న చిన్నారుల్ని చూస్తుంటే అందరి గుండెలు పగిలిపోతున్నాయి.

ఆస్పత్రుల్లో జీవచ్ఛవాలు

తుర్కియే, సిరియాల్లోని ఆస్పత్రుల్లో ఒక వైపు శవాల గుట్టలు, మరోవైపు చావు బతుకుల మధ్య జీవచ్ఛవాలుగా మారిన వారితో నిండిపోయాయి. భూకంపం ధాటికి సర్వస్వం కోల్పోయిన వారు, కుటుంబాల్ని కోల్పోయి అనాథలుగా మిగిలిన పసివారి రోదనలతో హృదయవిదారకంగా మారింది. ఒక స్వచ్ఛంద సంస్థ తరఫున వైద్యం అందించడానికి బ్రిటన్ వైద్యుడు పరిస్థితుల్ని చూసి తల్లడిల్లిపోతున్నారు. వెంటిలేటర్లు సరిపడా లేకపోవడంతో ఒక రోగి నుంచి వెంటిలేటర్ తీసేసి మరో రోగికి అమరుస్తున్నారు. మరోవైపు, బతికే అవకాశాలు ఎవరికి ఎక్కువ ఉన్నాయో వారికే వైద్యం చేస్తున్నామని, ఇలా చేయడం చాలా దుర్భరంగా అనిపిస్తోందని ఆ డాక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు!



సిరియాలో సామూహిక ఖననాలు

గూడు వీడిన పక్షులు

తుర్కియేలో భూకంపం సంభవించడానికి ముందే పక్షులు గుంపులు గుంపులుగా తమ గూళ్లని వదిలి వెళ్లిపోయిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. పక్షులన్నీ రొద చేసుకుంటూ గుంపులుగా హడావుడిగా గూడి వదిలి ఆకాశంలో ఎగురుకుంటూ వెళ్లిపోయిన దృశ్యాలు అందులో ఉన్నాయి. సాధారణంగా భూకంపాన్ని పక్షులు, జంతువులు ముందే పసిగడతాయని అంటారు. ఈ వీడియోని పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్ర కూడా షేర్ చేశారు. ''ప్రకృతి మనకు ఇచ్చిన హెచ్చరికల వ్యవస్థ. కానీ మనకే వాటిని అర్థం చేసుకోవడం తెలీడం లేదు' అని కామెంట్ చేశారు. 2004లో సునామీకి ముందు కూడా ఇలాగే జరిగిందని ఆయన గుర్తు చేసుకున్నారు. క్రీస్తుపూర్వం 373లో గ్రీస్‌లో భూకంపం సంభవించడానికి చాలా రోజుల ముందే ఎలుకలు, పాములు సురక్షిత ప్రాంతాలకు వెళ్లిన పోయిన విషయాన్ని ఈ సందర్భంగా అమెరికా జియోలాజికల్ సర్వే ఒక నివేదికలో గుర్తు చేసింది.

చాట్‌జీపీటీకి పోటీగా...

గూగుల్ బార్డ్ వచ్చేస్తోంది



న్యూయార్క్: తిరుగులేని ఆదరణతో దూసుకుపోతున్న చాట్‌జీపీటీ (చాట్ జెనరేటివ్ ప్రీ ట్రెయిన్డ్ ట్రాన్స్‌ఫార్మర్)కి పోటీగా గూగుల్ కూడా కృత్రిమ మేధ ఆధారిత చాట్‌బోట్ 'బార్డ్'ను తీసుకొస్తోంది. ఆల్ఫాబెట్, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ తన బ్లాగ్‌స్పాట్‌లో ఈ మేరకు ప్రకటించారు. విడుదలకు ముందు ఈ చాట్‌బోట్‌ను 'నమ్మకస్తులైన టెస్టర్ల'తో కొద్ది వారాలపాటు మదింపు చేస్తామని తెలిపారు. ''బార్డ్ మీ సృజనాత్మకతకు చక్కని తోడవుతుంది. మీ ఉత్సుకతకు రెక్కలు తొడుగుతుంది. నాసా జేమ్స్ వెబ్ టెలిస్కోప్ కొత్త ఆవిష్కరణలు మొదలుకుని ఎలాంటి సంక్లిష్టమైన విషయాలనైనా తొమ్మిదేళ్ల పిల్లలకు కూడా సులువుగా అర్థమయ్యేలా వివరించగలగడం దీని ప్రత్యేకత'' అని చెప్పుకొచ్చారు. చాట్‌జీపీటీని మైక్రోసాఫ్ట్ తన సెర్చ్ ఇంజన్ బింగ్‌కు అనుసంధానం చేయనుందన్న వార్తల నేపథ్యంలో గూగుల్ ప్రకటన ఆసక్తికరంగా మారింది. గూగుల్ ప్రధాన ఆదాయ వనరు కూడా సెర్చ్ ఇంజనే అన్నది తెలిసిందే. చాట్‌జీపీటీ రూపంలో కంపెనీకిప్పుడు పెను సవాలు ఎదురైంది.

లాఎండీఏ మోడల్‌పైనే...

బార్డ్‌ను గూగుల్ తన ప్రస్తుత ఏఐ లాంగ్వేజ్ మోడల్ లాఎండీఏపైనే అభివృద్ధి చేసింది. ఇది బోల్డ్‌గా, సృజనాత్మకంగా ఉంటూనే బాధ్యతాయుతంగా పని చేస్తుందని పిచాయ్ చెప్పారు. ''బార్డ్‌ను తొలుత తక్కువ కంప్యూటింగ్ పవర్‌తో కూడా నడిచే లైట్‌వెయిట్ మోడల్‌లో విడుదల చేస్తాం. ఫీడ్‌బ్యాక్, యూజర్ల సంఖ్య ఆధారంగా ముందుకెళ్తాం'' అని వివరించారు. 2022 నవంబర్లో విడుదలైన చాట్‌జీపీటీ సూపర్‌హిట్‌గా నిలిచింది. ఓపెన్ ఏఐ కంపెనీకి చెందిన ఈ ప్రాజెక్టులో మైక్రోసాఫ్ట్ బిలియన్ల కొద్దీ పెట్టుబడులు పెట్టింది.

2014 తర్వాతే 'అదానీ మ్యాజిక్'

మోదీ హయాంలోనే ఆయన సంపద ఇంతింతలైంది

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో రాహుల్



న్యూఢిల్లీ: అదానీ–హిండెన్‌బర్గ్ వ్యవహారంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. 2014లో ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టాక మ్యాజిక్ జరిగి ప్రపంచంలో 609వ స్థానంలో ఉన్న వ్యాపారవేత్త అదానీ కాస్తా ఏకంగా రెండో స్థానానికి ఎగబాకారని ఎద్దేవా చేశారు. లోక్‌సభలో మంగళవారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో పాల్గొని, మొదటి ప్రతిపక్ష నేతగా రాహుల్ ప్రసంగించారు. విదేశాల్లో చేపట్టిన వివిధ ప్రాజెక్టుల కాంట్రాక్టులు అదానీకే దక్కేందుకు ప్రధాని మోదీ సాయపడ్డారని ఆరోపించారు. అదానీతో కలిసి ఎన్ని విదేశీ పర్యటనలు చేశారు? మీరు వెళ్లొచ్చాక ఆ దేశాలకు అదానీ ఎన్ని సార్లు వెళ్లారు? మీతో పాటు వచ్చినప్పుడు ఎన్ని కాంట్రాక్టులు అదానీ పొందారు? అని అంటూ అదానీ, మోదీ ఉన్న ఫొటోలను ఆయన ప్రదర్శించారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా గత 20 ఏళ్లలో బీజేపీకి ఎంత విరాళమిచ్చారో తెలపాలన్నారు. ''భారత్ జోడో యాత్రలో ప్రతి చోటా అదానీ పేరే వినిపించింది. 2014–22 మధ్యలో అదానీ ఆస్తులు 8 బిలియన్ డాలర్ల నుంచి 140 మిలియన్ డాలర్లకు ఎలా పెరిగాయని యువత నన్ను ప్రశ్నించారు. అదానీకి విదేశాల్లో నకిలీ కంపెనీలున్నాయని హిండెన్‌బర్గ్ పరిశోధనలో తేలింది. సీబీఐ, ఈడీ సాయంతో ముంబై ఎయిర్‌పోర్టును జీవీకే నుంచి లాగేసుకుని అనుభవం లేని అదానీ సంస్థకు కట్టబెట్టారు'' అన్నారు. వీటిపై అధికార బీజేపీ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధారాలు చూపాలన్నారు. మోదీ, అదానీ ఫొటోలను ప్రదర్శించినందుకు స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం తెలిపారు. కాంగ్రెస్, గాంధీ కుటుంబం భారీ కుంభకోణాలతో దేశ ప్రతిష్ట దెబ్బతిందని బీజేపీ నేత రవి శంకర్ ప్రసాద్ మీడియాతో అన్నారు.

రాజస్తాన్ సంగతి చూసుకో: బీజేపీ

బీజేపీ సభ్యుడు సీపీ జోషి మంగళవారం ఉదయం లోక్‌సభ సమావేశం కాగానే రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెట్టి చర్చ ప్రారంభించారు. ప్రధాని మోదీ దేశాన్ని ఆధ్యాత్మికంగా, డిజిటల్‌గా ఐక్యంగా ముందుకు నడిపిస్తున్నారని కొనియాడారు. రాముడికి, మోదీకి సారూప్యతలున్నాయన్నారు. రాహుల్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. రాహుల్ ముందుగా రాజస్తాన్‌లో కాంగ్రెస్ కుమ్ములాటలను చక్కదిద్ది తర్వాత దేశం విషయం ఆలోచించాలన్నారు. ప్రధాని పదవి కాపాడుకునేందుకే కాంగ్రెస్ దేశాన్ని విభజించిందని ఆరోపించారు. అల్లావుద్దీన్ ఖిల్జీ బారి నుంచి తన పాతివ్రత్యాన్ని కాపాడుకునేందుకు మేవాడ్ రాణి పద్మావతి ఆత్మత్యాగం చేసుకున్నారన్న జోషి వ్యాఖ్యలపై దుమారం రేగింది. సతీసహగమన దురాచారాన్ని ప్రోత్సహిస్తున్నారంటూ ప్రతిపక్షాలు మండిపడ్డాయి. వెల్‌లోకి వెళ్లి నినాదాలకు దిగడంతో స్పీకర్ సభను 20 నిమిషాల సేపు వాయిదా వేశారు. తిరిగి సమావేశమయ్యాక, అభ్యంతరకర వ్యాఖ్యలుంటే తొలగిస్తామని స్పీకర్ హామీ ఇవ్వడంతో కార్యకలాపాలు కొనసాగాయి.

జడ్జిగా గౌరి నియామకం సరైందే

- ఆమెకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను కొట్టేసిన సుప్రీం
- మద్రాస్ హైకోర్టు అడిషనల్ జడ్జిగా గౌరి ప్రమాణం



న్యూఢిల్లీ/చెన్నై: మద్రాస్ హైకోర్టులో అడిషనల్ జడ్జిగా లాయర్ లెక్ష్మణ చంద్ర విక్టోరియా గౌరి ప్రమాణ స్వీకారాన్ని ఆపాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. కొలీజియంలో చర్చ జరిగాకే ఆమె పేరు ప్రతిపాదించినట్టు పేర్కొంది. సంబంధిత హైకోర్టు జడ్జిల అభిప్రాయాన్ని కూడా తెలుసుకున్నట్టు తెలిపింది. ఈ పిటిషన్లపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్‌ల ప్రత్యేక ధర్మాసనం విచారణ జరిపింది. ప్రమాణాన్ని ఉల్లంఘించినట్లు తేలినా లేదా ప్రమాణానికి లోబడి విధులను నిర్వర్తించకున్నా రెండేళ్ల తర్వాత ఆమె పనితీరు సంతృప్తికరమని భావిస్తేనే శాశ్వత జడ్జిగా ప్రతిపాదించే అవకాశం కొలీజియంకు ఉందని గుర్తు చేసింది. గతంలో అడిషనల్ జడ్జిలుగా పనిచేసిన వారు శాశ్వత జడ్జీలు కాలేకపోయిన ఘటనలు అనేకం ఉన్నాయంది. ఒక వ్యక్తి రాజకీయ, వ్యక్తిగత అభిప్రాయాలు ఆ వ్యక్తి పేరును జడ్జిగా సిఫారసు చేయకపోవడానికి కారణం కాదని కొలీజియం భావించిందని పేర్కొంది. గౌరి మైనారిటీలకు వ్యతిరేకంగా విద్వేష వ్యాఖ్యలు చేశారంటూ కొందరు లాయర్లు కేసు వేయడం తెలిసిందే.

సుప్రీంకోర్టు తీర్పు కంటే ముందే...

మరోవైపు, సుప్రీంకోర్టు తీర్పుకు ముందే మద్రాస్ హైకోర్టు అదనపు జడ్జిగా గౌరి ప్రమాణం చేశారు! తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టి.రాజా మంగళవారం ఉదయం 10.45 గంటల సమయంలో ఆమెతో ప్రమాణం చేయించారు. తనకు గొప్ప అవకాశమిచ్చిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సహా ఇతర న్యాయమూర్తులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. 1973లో జన్మించిన గౌరి, 1995లో లాయర్‌గా పేరు నమోదు చేయించుకున్నారు. మదురై బెంచ్ అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్‌గా 2022 నుంచి పనిచేస్తున్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం జనవరి 17వ తేదీన గౌరితో కలిపి మొత్తం ఐదు పేర్లను హైకోర్టు జడ్జీలుగా నియమించేందుకు కేంద్రానికి సిఫారసు చేసింది.

వాట్సాప్‌లో ఇకపై ఒకేసారి 100 ఫైళ్లు

న్యూఢిల్లీ: వాట్సాప్‌లో త్వరలో ఒకేసారి 100 మీడియా ఫైళ్లను షేర్ చేయవచ్చు. ఎంపిక చేసిన బెటా టెస్టర్లకు ఇదిప్పటికే అందుబాటులోకి వచ్చిందని వాట్సాప్ న్యూస్ ట్రాకర్ వెబ్‌సైట్ డబ్ల్యూఏ బెటా ఇన్ఫో తెలిపింది. ప్రస్తుతం వాట్సాప్ నుంచి ఒకేసారి 30 ఫైళ్లకు మించి షేర్ చేయడం కుదరదు. కొత్త ఫీచర్ త్వరలో అందుబాటులోకి వస్తుందని బెటా చెబుతోంది.

ముగిసిన ముషారఫ్ అంత్యక్రియలు

కరాచీ: పాకిస్తాన్ మాజీ సైనిక పాలకుడు జనరల్ పర్వేజ్ ముషారఫ్ (79) అంత్యక్రియలు మంగళవారం ముగిశాయి. కరాచీలోని సైనిక శ్మశానవాటికలో పూర్తి సైనిక లాంఛనాలతో భార్య, కుమారుడు, కుమార్తె, సన్నిహిత బంధువుల సమక్షంలో కార్యక్రమం జరిగింది. ప్రస్తుత, మాజీ సైనిక ఉన్నతాధికారులు, ఐఎస్ఐ చీఫ్‌లు, రాజకీయ నాయకులు హాజరయ్యారు. దేశాధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ, ప్రధాని షహబాజ్ షరీఫ్ దూరంగా ఉన్నారు. ముషారఫ్ ఆదివారం దుబాయ్‌లో కన్నుమూయడం తెలిసిందే. ఆయన భౌతిక కాయాన్ని సోమవారం ప్రత్యేక విమానంలో పాకిస్తాన్‌కు తరలించారు.

సీఏపీఎఫ్‌లో 83 వేలకు పైగా ఖాళీలు

న్యూఢిల్లీ: సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు ఫోర్సెస్ (సీఏపీపీఎఫ్)లో 83 వేలకి పైగా పదవులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం మంగళవారం పార్లమెంటులో వెల్లడించింది. మొత్తం పదవులు 10,15,237 కాగా ప్రస్తుతం 83 వేలకు పైగా ఖాళీలున్నాయని తెలిపింది. సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్), బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్), సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్), ఇండో టిబెటన్ బోర్డర్ పోలీసు (ఐటీబీపీ), సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ), అస్సాం రైఫిల్స్‌లో 83,127 పదవులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు.

బాల్య వివాహాలపై కొరడా

- ఒక్కసారిగా చర్యలకు దిగిన అస్సాం
- 4 రోజుల్లోనే వేలాది కేసులు, అరెస్టులు
- ఎన్నికల ఎత్తుగడేనంటున్న విశ్లేషకులు
- రాష్ట్రంలో బాల్య వివాహాలు లక్షకు పైనే!

బాల్య వివాహాల వ్యవహారం ఈశాన్య రాష్ట్రం అస్సాంను కుదిపేస్తోంది. చట్టవిరుద్ధమైన ఈ పెళ్లిళ్లను ఇన్నాళ్లూ చూసీచూడనట్లు వ్యవహరించిన ప్రభుత్వం ఉన్నట్టుండి ఉక్కుపాదం మోపుతుండడం సంచలనం సృష్టిస్తోంది. దశాబ్దాల క్రితం చిన్న వయసులో పెళ్లి చేసుకున్నవారు ఇప్పుడు కేసులు, అరెస్టుల భయంతో వణికిపోతున్నారు. కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు వార్తలొస్తున్నాయి! అస్సాం పోలీసులు 4,074 కేసులు నమోదు చేశారు. 8,000 మందికిపైగా నిందితులను గుర్తించారు, వారిలో 2,500 మందికి పైగా అదుపులోకి తీసుకున్నారు. వీరిలో 60 మంది ఖాజీలూ ఉన్నారు.



ప్రభుత్వ చర్యలకు జడిసి రాష్ట్రవ్యాప్తంగా 100కు పైగా బాల్య వివాహాలు రద్దవడమో, వాయిదా పడడమో జరిగిందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

రెండు చట్టాల కింద అరెస్టులు

భారత్‌లో యువతుల చట్టబద్ధమైన వివాహ వయసు 18 ఏళ్లు. అంతకంటే తక్కువ వయసున్న అమ్మాయిలను పెళ్లాడిన పురుషులను అరెస్టు చేసి శిక్షించాలని జనవరి 23న అస్సాం మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. ఈ మేరకు 14 ఏళ్ల కంటే తక్కువ వయసు బాలికలను పెళ్లాడితే 'పోక్సో' చట్టం కింద, 14–18 ఏళ్ల లోపు బాలికలను పెళ్లాడిన వారిపై బాల్య వివాహాల నిషేధ చట్టం (2006) కింద అరెస్టు చేసి జైల్లకు తరలిస్తున్నారు. బాలికలను తాత్కాలిక వసతి గృహాలకు తరలిస్తున్నారు. రాష్ట్రంలో గత కొన్నేళ్లలో లక్షకు పైగా బాల్య వివాహాలు జరిగాయని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ అన్నారు. దాంతో చాలామంది చిన్న వయసులోనే తల్లులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా చట్టవిరుద్ధమైన పెళ్లిళ్లకు పాల్పడే తల్లిదండ్రులు, మత పెద్దలు, ఖాజీలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

31 శాతం బాల్య వివాహాలు..

17 శాతం టీనేజీ గర్భాలు

అస్సాంలో టీనేజీ ప్రెగ్నెన్సీ నిష్పత్తి ఆందోళనకర స్థాయిలో పెరిగిపోతోంది. గతేడాది రాష్ట్రంలో గర్భం దాల్చిన 6,20,867 మందిలో 16.79 శాతం, అంటే 1,04,264 మంది 19 ఏళ్ల లోపువారే! జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం మాతా శిశు మరణాల్లో అస్సాం అగ్రస్థానంలో ఉంది. ఇందుకు బాల్య వివాహాలే ప్రధాన కారణమని తేల్చారు. నమోదవుతున్న వివాహాల్లో ఏకంగా 31 శాతం ఇవే! దక్షిణ, దిగువ జిల్లాల్లో ఈ ధోరణి మరీ ఎక్కువగా ఉంది. బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన మైనార్టీలు అక్కడ గణనీయంగా ఉన్నారు.

వ్యతిరేకత.. ఆందోళనలు



ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా పలు జిల్లాల్లో నిరసనలు, ఆందోళలు తీవ్ర రూపు దాలుస్తున్నాయి. పార్టీలూ వాటికి మద్దతిస్తున్నారు. 'మాకు ప్రభుత్వ పథకాలు అక్కర్లేదు. మా భర్త మాతో ఉంటే చాలు. వారిని అరెస్టు చేయొద్దు' అని బాల్య వివాహం చేసుకున్న అమ్మాయిలు డిమాండ్ చేస్తున్నారు! బాల్య వివాహాలు నిషిద్ధమని వీరిలో చాలామందికి తెలియదు. ముందు నుంచే చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేస్తే పరిస్థితి ఇక్కడిదాకా వచ్చేది కాదని బాధితులు వాపోతున్నారు. ప్రజల్లో అవగాహన కోసం స్వచ్ఛంద సంస్థలు ప్రయత్నిస్తున్నా పెద్దగా ఫలితాలివ్వడం లేదు. మరికొందరు అమ్మాయిలేమో తాము 18 ఏళ్ల దాటాక పెళ్లాడినా పోలీసులు ఆరోగ్య కార్యకర్తల వద్ద ఉన్న లోపభూయిష్ట సమాచారం ఆధారంగా తప్పుడు కేసులు పెట్టి తమ భర్తలను జైలుపాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

ఎన్నికల్లో లబ్ధి కోసమేనా?

బాల్య వివాహాలపై చర్యల వెనక ఉద్దేశం 2024 లోక్‌సభ, 2026లో అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధేనని భావిస్తున్నారు. ప్రజారోగ్యం, సంక్షేమం కోసం ఈ చర్యలు 2026 అసెంబ్లీ ఎన్నికల దాకా కొనసాగుతాయన్న ప్రకటన దీన్నే ధ్రువీకరిస్తోందని అంటున్నారు. అస్సాంలో బీజేపీ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిపోయిందని, ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవని, భద్రత కూడా కొరవడిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో బాల్య వివాహాలపై చర్యల పేరిట మెజార్టీ వర్గాన్ని ఆకట్టుకోవడం, సమస్యల నుంచి జనం దృష్టిని మళ్లించడం బీజేపీ లక్ష్యాలని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. లవ్ జిహాద్, మత మార్పిడులనూ సహించేది లేదన్న సీఎం వ్యాఖ్యలనూ ఇదే కోణంలో చూడాలంటున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి హైదరాబాద్

బుధవారం । 8 । ఫిబ్రవరి । 2023



దాగుడు మూతలతో మాస్ కాపీయింగ్

టోఫెల్, జీఆర్ఈ ఆన్‌లైన్ టెస్టుల్లో 'దాగుడు మూతల' పంథాలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న ముఠాను సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకుని వివరాలు వెల్లడించారు. -8లో



అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

మూడుచింతలపల్లి మండలం ఉద్దమర్రిలో గత నెలలో వైన్స్ షాప్ వద్ద కాల్పులు జరిపి దోపిడీకి పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. -8లో

సైక్లింగ్ ట్రాక్ ట్రెండ్ సెట్టర్‌గా నగరం : చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి

మణికొండ: అభివృద్ధి చెందిన దేశాల్లో ఉన్నట్టుగా హైదరాబాద్‌లో నిర్మితమవుతున్న సైక్లింగ్ ట్రాక్ దేశంలోనే ట్రెండ్ సెట్టర్ అవుతుందని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం కోకాపేటలో ఓఆర్ఆర్ పక్కన నిర్మితమవుతున్న సైక్లింగ్ ట్రాక్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. మన దేశంలో ఇలాంటి ప్రాజెక్ట్ ఇప్పటి వరకు లేదన్నారు.



వాహనదారుల నరకయాతన

హుస్సేన్ సాగర్ తీరంలో ఫార్ములా ఈ– రేసింగ్ జరగనున్న నేపథ్యంలో పోలీసులు అమలు చేస్తున్న ట్రాఫిక్ ఆంక్షలతో నగరవాసులు నరకయాతన పడుతున్నారు. లక్డీకాపూల్, ఎక్బాల్ మినార్, ఖైరతాబాద్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. మంగళవారం నెక్లెస్ రోడ్డులో వాహనదారుల కష్టాలకు ఈ చిత్రాలు దర్పణం పట్టాయి.

– ఖైరతాబాద్







జెండా ఊపి డబుల్ డెక్కర్ బస్సులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, చిత్రంలో మంత్రి కేటీఆర్, ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, హెచ్ఎండీఏ కమిషనర్ అర్వింద్ కుమార్ తదితరులు

న్యూస్‌రీల్

ఫాజిల్ హుస్సేన్‌కు ప్రెస్‌కౌన్సిల్ అవార్డు



సాక్షి, సిటీబ్యూరో: గవా ఉర్దూ పత్రిక ఎడిటర్ ఫాజిల్ హుస్సేన్ పర్వేజ్‌కు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఢిల్లీ)– 2020 ఏడాదికిగాను ఎక్సలెన్స్ ఇన్ జర్నలిజం అవార్డును ప్రకటించింది. 'ఉర్దూ జర్నలిజంలో సేవలందించిన పలువురు పాత్రికేయులపై రాసిన వ్యాసానికిగాను ఆయనను ఈ పురస్కారం వరించింది. ఫిబ్రవరి 28న ఢిల్లీలోని డిప్యూటీ స్పీకర్ హాల్‌లో కానిస్టిట్యూషన్ క్లబ్‌లో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ చేతులమీదుగా ఈ అవార్డును అందుకోనున్నారు.

ఫ్యాషన్ రంగంలో హైదరాబాద్ ఫేవరెట్ సిటీ

- మిసెస్ ఇండియా మొదటి రన్నరప్ కిరణ్మయి



సాక్షి, సిటీబ్యూరో: రాజస్థాన్ వేదికగా నిర్వహించిన మిసెస్ ఇండియా పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన కిరణ్మయి మొదటి రన్నరప్‌గా నిలిచిన సందర్భంగా మంగళవారం నగరంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆమె పాల్గొని తన అనుభవాలను పంచుకున్నారు. ఫ్యాషన్ రంగంలో హైదరాబాద్ ఫేవరెట్ సిటీగా అవతరించిందని, దేశవ్యాప్తంగా ఇక్కడి ఫ్యాషన్ ఔత్సాహికులు అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తున్నారని ఆమె చెప్పారు. పెళ్లితోనే మహిళల జీవితం ఆగిపోకుండా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని కిరణ్మయి పేర్కొన్నారు. మిసెస్ ప్లానెట్, మిసెస్ ఆసియా పోటీలకు సన్నద్ధమవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మిసెస్ ఇండియా తెలంగాణ రీజినల్ డైరెక్టర్ మమతా త్రివేది, ప్రముఖ డిజైనర్లు వీణా పూజారి, పూజా తోష్నివాల్ తదితరులు పాల్గొన్నారు.

పైసా పరేషాన్

బకాయిలు కొండంత..చెల్లింపులు గోరంత

- జీహెచ్ఎంసీకి రావాల్సింది రూ.6000 కోట్లు
- బడ్జెట్‌లో ఇచ్చింది రూ.10 కోట్లే
- మహానగర పాలక సంస్థకు తప్పని తిప్పలు



పేరుకుపోయిన సర్కారు భవనాల ఆస్తిపన్నులు

GHMC

జీహెచ్ఎంసీకి రావాల్సిన మొత్తం

సచివాలయ పాతభవనం :	రూ.400 కోట్లు
వైద్యారోగ్యశాఖ భవనాలు :	రూ.1190 కోట్లు
ఎక్సైజ్ శాఖ భవనాలు:	రూ. 900 కోట్లు
విద్యాశాఖ భవనాలు:	రూ.400 కోట్లు
జలమండలి భవనాలు :	రూ.70 కోట్లు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీకి వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన భవనాల నుంచి రావాల్సిన ఆస్తి పన్ను బకాయిలు కొండల్లా పేరుకుపోతున్నప్పటికీ, చెల్లింపులు మాత్రం గోరంతలు కూడా ఉండటం లేదు. ఏడాది కాదు.. రెండేళ్లు కాదు.. తెలంగాణ ఏర్పాటు కాకముందు నుంచీ వివిధ ప్రభుత్వ భవనాల ద్వారా జీహెచ్ఎంసీకి రావాల్సిన ఆస్తి పన్ను, వాటిపై బకాయిలు దాదాపు రూ.6000 కోట్లు పేరుకుపోయాయి. వీటిల్లో పాత సచివాలయ భవనాలకు సంబంధించి దాదాపు రూ. 400 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. ఆ సచివాలయం అంతర్ధానమై, కొత్త సచివాలయం త్వరలో ప్రారంభం కానున్నప్పటికీ జీహెచ్ఎంసీ బకాయిల చిట్టాలో మాత్రం అలాగే ఉంది. దాంతోపాటు వైద్యారోగ్య, విద్యాశాఖ, ఎక్సైజ్, ట్రాన్స్‌కో, జలమండలి తదితర ప్రభుత్వ విభాగాలకు చెందిన భవనాల నుంచి దశాబ్దానికిపైగా ఆస్తిపన్ను బకాయిలు పెనాల్టీలతో కలిపి కొండల్లా పేరుకుపోయాయి.

ఎన్నెన్నో భవనాలు..

ఆస్తిపన్ను బకాయిలు భారీగా ఉన్న భవనాల్లో అసెంబ్లీ, రవీంద్రభారతి, హెచ్ఎండీఏ, ఆస్పత్రులు, విద్యాలయాలకు చెందినవే కాకుండా పెట్రోలు బంకులు, క్యాంటీన్ల వంటివి సైతం ఉన్నట్లు సమాచారం.

బడ్జెట్‌లో పద్దు ఉన్నా..

ఆస్తిపన్ను బకాయిలు ఏటికేడు పెరిగిపోతున్నా, జీహెచ్ఎంసీ ఆయా ప్రభుత్వ విభాగాలకు చెల్లించాల్సిందిగా లేఖలు రాస్తున్నా నయాపైసా కూడా విదిల్చడం లేదు. వీటి చెల్లింపుల కోసం రాష్ట్ర బడ్జెట్‌లో ఓ పద్దు కూడా ఉంది. కానీ.. చెల్లింపులే ఉండటం లేదు. ఆరేడేళ్ల క్రితం ఏటా కనీసం రూ. 50 కోట్లయినా బడ్జెట్‌లో కేటాయించి విడుదల చేసేవారు. గత నాలుగైదు సంవత్సరాలుగా ఇది కేవలం రూ.10 కోట్లు మించడం లేదు. తాజా రాష్ట్ర బడ్జెట్‌లోనూ రూ. 10 కోట్లే విదిల్చారు.

జీహెచ్ఎంసీకి తప్పని తిప్పలు..

ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ చేపట్టిన, పురోగతిలో ఉన్న వివిధ ప్రాజెక్టులు కుంటుపడే ప్రమాదం పొంచి ఉంది. ఓవైపు సదరు ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు తగిన నిధులు కేటాయించకపోవడం, మరోవైపు జీహెచ్ఎంసీకి రావాల్సిన ఆస్తిపన్ను బకాయిలు ఇవ్వకపోవడంతో జీహెచ్ఎంసీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సంబంధిత ఉన్నతాధికారులు నిధుల లేమి అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారా.. లేదా..? అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. జీహెచ్ఎంసీ ఇప్పటికే శక్తికి మించిన అప్పులు చేయడంతో వాటి వడ్డీలు, ఇతరత్రా ఖర్చులు భరించలేక సిబ్బంది జీతాలకే పలు అగచాట్లు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం ఏదో ఒక విధంగా ఆదుకోకపోతే జీహెచ్ఎంసీ గడ్డు పరిస్థితులు మరింత తీవ్రం కానున్నాయి.

ఓటీఎస్‌ను వినియోగించుకోని వైనం..

ఆస్తిపన్ను బకాయిలు భారీగా పేరుకుపోయినవారు పెనాల్టీల భారాన్ని మోయలేకే చెల్లించడం లేదనే అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం వన్‌టైమ్ సెటిల్మెంట్ (ఓటీఎస్) కింద ఆస్తిపన్ను పెనాల్టీలపై 90 శాతం రాయితీనిచ్చింది. ప్రభుత్వ భవనాలకు ఆ స్కీమ్‌ను సైతం వినియోగించుకోలేదు. దాన్ని వినియోగించుకొని చెల్లించినా, జీహెచ్ఎంసీకి భారీ ఆదాయం సమకూరేదని పరిశీలకులు చెబుతున్నారు. ఎప్పటికప్పుడు చెల్లించకపోవడంతో పెనాల్టీలే అసలును మించి భారీ బకాయిల గుట్టలుగా మారాయి.

- ఫార్ములా– ఈ ప్రిక్స్ సందర్భంగా ప్రారంభం
- దశలవారీగా 20 ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులు
- పర్యాటక ప్రాంతాలు, చారిత్రక ప్రదేశాలకు అందుబాటులో

డబుల్ డెక్కర్ ఆగయా

నిజాం నాటి బస్సులకు పూర్వ వైభవం

సాక్షి, సిటీబ్యూరో: 'అలనాటి చారిత్రక డబుల్ డెక్కర్ పూర్వవైభవాన్ని సంతరించుకుంది. హైదరాబాద్ అందాలను ఆస్వాదిస్తూ రెండంతస్తుల బస్సుల్లో ప్రయాణం చేయడం ఒక గొప్ప అనుభూతి' అంటూ ఓ నెటిజన్ చేసిన ట్వీట్‌పై స్పందించిన మంత్రి కేటీఆర్ ఆ అందమైన అనుభవాన్ని నగరవాసులకు తిరిగి అందుబాటులోకి తెచ్చారు. త్వరలోనే డబుల్ డెక్కర్ బస్సులను రోడ్డెక్కించనున్నట్లు ఆయన అప్పుడే చెప్పారు. ట్విట్టర్ వేదికగా స్పందించినట్లుగానే పర్యావరణ ప్రియమైన ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులను మంగళవారం ప్రారంభించారు. నగరవాసులతో పాటు జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను, సందర్శకులను సైతం విశేషంగా ఆకట్టుకొనే విధంగా ఉన్న మూడు డబుల్ డెక్కర్ బస్సులను నానక్‌రాంగూడలోని హెచ్ఎండీఏ అనుబంధ హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ కార్యాలయం వద్ద జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఫార్ములా– ఈ ప్రిక్స్‌లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్‌తో పాటు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. చేవెళ్ల ఎంపీ జి.రంజిత్ రెడ్డి, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, హెచ్ఎండీఏ కమిషనర్ అర్వింద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదభరితంగా పర్యాటక విహారం..

ఫార్ములా– ఈ ప్రిక్స్ సందర్భంగా ప్రారంభించిన డబుల్ డెక్కర్ బస్సులు ప్రస్తుతం రేసింగ్ ట్రాక్ పరిధిలోని ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్డు, పారడైజ్ ,నిజాం కాలేజీ రూట్‌లలో తిరుగుతాయి. మొదటి విడతగా హెచ్ఎండీఏ 6 బస్సులను కొనుగోలు చేయగా ప్రస్తుతం మూడింటిని ప్రవేశపెట్టారు. త్వరలో మరో మూడు బస్సులు రానున్నాయి. దశలవారీగా మొత్తం 20 బస్సులను ప్రవేశపెట్టేందుకు హెచ్ఎండీఏ ప్రణాళికలను సిద్ధం చేసింది. ఫార్ములా– ఈ ప్రిక్స్ అనంతరం డబుల్ డెక్కర్ బస్సులను చారిత్రక, వారసత్వ కట్టడాల సర్క్యూట్‌లలో నడుపుతారు. హైదరాబాద్ పర్యాటక స్థలాలను ఈ బస్సుల్లో సందర్శించవచ్చు. పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వీటిని నిర్వహించనున్నారు. ఈ నెల 11న ఫార్ములా– ఈ పోటీల సందర్భంగా డబుల్ డెక్కర్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించనున్నారు.

ప్రత్యేకతలివీ..

- డబుల్ డెక్కర్ బస్సులో 65 మంది ప్రయాణికులకు అనువైన సీట్లు.
- ఇవి పూర్తిగా విద్యుత్‌తో నడుస్తాయి. ఒకసారి చార్జింగ్ చేస్తే 150 కి.మీ వరకు ప్రయాణం చేయవచ్చు.
- 2 నుంచి రెండున్నర గంటల్లో పూర్తిగా చార్జింగ్ చేయవచ్చు.
- 9.8 మీటర్ల పొడవు, 4.7 మీటర్ల ఎత్తు ఉన్న ఈ ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ ఖరీదు రూ.2.16 కోట్లు.

ఇదీ నేపథ్యం...

నిజాం కాలంలోనే ప్రవేశపెట్టిన డబుల్ డెక్కర్ బస్సులను ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ 2003 వరకు నడిపింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి జూపార్కు వరకు, అఫ్జల్‌గంజ్ వరకు ఇవి నడిచేవి. సికింద్రాబాద్ నుంచి మెహిదీపట్నం వరకు డబుల్ డెక్కర్‌లు ఉండేవి. నగరవాసులతో పాటు ఇక్కడికి వచ్చే ప్రతి ఒక్కరూ ఆ బస్సులో పయనించేందుకు ఎంతో మక్కువ చూపేవారు. ట్యాంక్‌బండ్ మీదుగా ఇందులో ప్రయాణం చేయడం ఒక గొప్ప అనుభూతి. కాలక్రమంలో బస్సుల నిర్వహణ భారంగా మారడంతో వీటికి కాలం చెల్లింది. ఫ్లైఓవర్‌ల కారణంగా కూడా బస్సులు నడపడం కష్టంగా మారింది. మంత్రి కేటీఆర్ చొరవ మేరకు ప్రస్తుతం అత్యాధునిక సాంకేతిక సామర్థ్యంతో రూపొందించిన ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్‌లు అందుబాటులోకి వచ్చాయి.

విన్నపాలు వినే వారేరీ?



- కలెక్టర్‌తో పాటు పలు కీలక పోస్టుల్లో ఇన్‌చార్జీలే
- ఎక్కడికక్కడే పేరుకుపోతున్న దరఖాస్తులు
- గాడి తప్పుతున్న రెవెన్యూ పాలనా వ్యవస్థ
- రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఇదీ దుస్థితి

సాక్షి, సిటీబ్యూరో: సాక్షాత్తూ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ జిల్లాలో ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది. కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అధికారి, భూసేకరణ విభాగాల పలు డిప్యూటీ కలెక్టర్ పోస్టులు కూడా ఇన్‌చార్జీలతోనే కొనసాగిస్తున్నారు. గత ఏడాది అప్పటి కలెక్టర్ శర్మన్ పదవీ విరమణ చేయడంతో శివారు జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. తాజాగా ఆయన మరో శివారు జిల్లాకు బదిలీ అయినప్పటికీ హైదరాబాద్ జిల్లాకు మాత్రం ఇన్‌చార్జి బాధ్యతల్లోనే కొనసాగుతున్నారు. రెండు జిల్లాల బాధ్యతలు కావడంతో గ్రీవెన్స్ కోసం కలెక్టరేట్‌కు వచ్చే నగరవాసులకు అందుబాటులో ఉండలేకపోతున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి (మీ కోసం) సైతం లేకపోవడంతో సమస్యలు ఎవరికి విన్నవించాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి వినతులు స్వీకరిస్తున్నా.. వాటిపై స్పందన మాత్రం లేకుండా పోయింది.

ఇన్‌చార్జీలు ఇలా.

కలెక్టరేట్‌లో ఎస్‌పీఎంగా కొనసాగుతున్న అధికారి జిల్లా రెవెన్యూ అధికారి కూడా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలో కొనసాగుతున్నారు. భూ పరిరక్షణ విభాగం డిప్యూటీ కలెక్టర్ పోస్టు ఖాళీగా ఉండగా, మరో విభాగానికి యూఎల్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇన్‌చార్జీగా కొనసాగుతున్నారు. ఇన్‌చార్జీల పాలనతో రెవెన్యూ యంత్రాంగం పనితీరు కొంత గాడితప్పుతోంది. సిబ్బంది సైతం ఇష్టానుసారం విధులకు రావడం, మధ్యలోనే బయటకి వెళ్లిపోవడం సర్వసాధారణంగా తయారైంది.

నలుదిక్కులా ప్రగతి వీచికలు



పాతబస్తీ అభివృద్ధిపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

పాత బస్తీలో రహదారుల విస్తరణకు పెద్ద పీట

- ట్రాఫిక్ జంక్షన్లతో పాటు ఇతర మౌలిక వసతులు
- పాతబస్తీ అభివృద్ధిపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి కేటీఆర్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని నలు దిక్కులను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ కార్యాలయంలో మంత్రి కేటీఆర్ పాతబస్తీ అభివృద్ధిపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాంతాలకు, పార్టీలకతీతంగా పౌరుల అవసరాలే కేంద్రంగా అభివృద్ధి ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. హైదరాబాద్‌తో పాటు పాతబస్తీ సైతం గత ఎనిమిదేళ్లలో అద్భుతమైన అభివృద్ధిని సాధించిందని వెల్లడించారు.

రోడ్ల విస్తరణ..

జనావాసాలు అధికంగా ఉన్న పాతబస్తీలాంటి ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ కొంత సవాల్‌తో కూడుకున్నదైనా.. పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. పాతబస్తీలో అభివృద్ధి కార్యక్రమాల కోసం అవసరమైన భూసేకరణ నిధులను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. ట్రాఫిక్ జంక్షన్లతో పాటు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం, అవసరమైన చోట మూసీపై బ్రిడ్జిల నిర్మాణాలు వేగంగా కొనసాగుతోందని తెలిపారు. చార్మినార్ పెడెస్ట్రియన్ ప్రాజెక్టు పనులు సైతం పూర్తి కావచ్చాయని చెప్పారు.

మెరుగుపడిన తాగునీటి సరఫరా

నగరంలోని తాగునీటి సరఫరా సంతృప్తికర స్థాయిలో ఉందని, గత ఎనిమిదేళ్లలో పాతబస్తీ పరిధిలోనూ తాగునీటి సరఫరా మెరుగుపడిందని మంత్రి కేటీఆర్ అన్నారు. వివిధ తాగునీటి సౌకర్యాల అభివృద్ధి కోసం రూ.1200 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు తెలిపారు. పాతబస్తీలో రెండున్నర లక్షలకుపైగా నల్లా కనెక్షన్ల ద్వారా ఉచిత తాగునీరు అందుతోందని గుర్తు చేశారు. పాత బస్తీ పరిధిలో వివిధ ప్రాంతాల్లో సీవర్ ట్రీట్మెంట్ ప్లాంట్ల నిర్మాణంతో పాటు ఇతర కార్యక్రమాలను చేపట్టినట్లు ప్రస్తావించారు.

అద్భుతంగా విద్యుత్ సరఫరా

హైదరాబాద్‌తో పాటు పాత బస్తీలోనూ విద్యుత్ సరఫరా వ్యవస్థ అద్భుతంగా మెరుగైందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా చార్మినార్, చౌమహల్లా ప్యాలెస్, మదీనా, మక్కా మసీద్, సాలార్జంగ్ మ్యూజియం వంటి పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. 84 బస్తీ దవాఖానాలను పాతబస్తీలో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మీర్ ఆలం మండి మార్కెట్ రిస్టోరేషన్ కోసం ప్రణాళికలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మీర్ ఆలం ట్యాంక్ పైనుంచి ఆరు లైన్ల కేబుల్ బ్రిడ్జ్ నిర్మాణ ప్రతిపాదనలు సైతం డీపీఆర్ దశలో ఉన్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో ఉన్న అనేక వారసత్వ కట్టడాలు, వారసత్వ సంపద ప్రధానంగా పాతబస్తీలో ఉన్న నేపథ్యంలో, వాటిని రక్షించడంతోపాటు పునరుజ్జీవన కార్యక్రమాలను సైతం పెద్ద ఎత్తున చేపట్టినట్లు తెలిపారు.

అక్బరుద్దీన్ కృతజ్ఞతలు

పాతబస్తీ ప్రగతికి ప్రాధాన్యమివ్వడం పట్ల మజ్లిస్ శాసన సభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, మంత్రి కేటీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మంత్రి మహమూద్ అలీ, చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్వింద్ కుమార్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎగిరొచ్చిన మృత్యుపాశం

మీదపడిన ఆక్సిజన్ సిలిండర్

- వాహనంపై వెళ్తున్న వ్యక్తి మృతి
- చర్లపల్లి పారిశ్రామికవాడలో ఘటన



ప్రకాశ్ (ఫైల్)



ఘటన స్థలంలో మృతదేహం

కుషాయిగూడ: ఏ నిమిషానికి ఏమి జరుగునో ఎవరూ ఊహించలేరు. ప్రమాదాన్ని పసిగట్టనూ లేరు. మృత్యువు ఏ రూపంలో వచ్చి కబళిస్తుందో తెలియదు. ఇందుకు మంగళవారం నగర పరిధిలో జరిగిన విషాద ఘటనే ఉదాహరణ. ఆక్సిజన్ సిలిండర్ గాలిలోకి ఎగిరిపడి వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తిపై పడటంతో అతను అక్కడికక్కడే మృతి చెందిన ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చర్లపల్లి పారిశ్రామికవాడలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. చర్లపల్లి పారిశ్రామికవాడ బీఎన్‌రెడ్డి నగర్‌లోని సూర్య ఏజెన్సీస్ వద్ద ఆక్సిజన్ సిలిండర్లను ఆటోలోంచి అన్‌లోడ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ సిలిండర్ నాజిల్ ఊడిపోయి గాలిలోకి ఎగిరింది. అలా గాలిలోకి ఎగిరిన సిలిండర్.. ఆ మార్గంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇందిరా గృహకల్ప కాలనీకి చెందిన ఎం.ప్రకాశ్ (49) తలపై పడింది. తీవ్రంగా గాయపడటంతో అతడు అక్కడిక్కడే మృతి చెందాడు. ఇతడు చర్లపల్లిలోని సాఫ్ట్‌వైర్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. ఈ ప్రమాదం రెప్పపాటులో జరిగిపోయిందని స్థానికులు చెబుతున్నారు. నాజిల్ ఊడిపోవడంతో ఆక్సిజన్ ఒత్తిడికి సిలిండర్ రాకెట్ మాదిరి గాలిలోకి ఎగిరిపడటం ఆశ్చర్యానికి గురి చేసిందంటున్నారు. మృతుడు ప్రకాశ్‌కు భార్య అరుణ జ్యోతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రకాశ్ మృతితో ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఫీజు చెల్లింపుల పేరుతో మోసం

- 32 మంది నుంచి రూ.2.06 కోట్లు వసూలు
- తండ్రీ కొడుకులతో పాటు మధ్యవర్తి అరెస్టు

హిమాయత్‌నగర్: క్రెడిట్ కార్డుల ద్వారా విదేశాల్లో చదువుకుంటున్న విద్యార్థుల ఫీజులు చెల్లిస్తామని మోసాలకు పాల్పడిన తండ్రి, కుమారుడితో పాటు మధ్యవర్తిని హైదరాబాద్ సైబర్‌క్రైం పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం సైబర్‌క్రైం డీసీపీ స్నేహమెహ్రా, ఏసీపీ కేవీఎం ప్రసాద్‌లతో కలిసి సీసీఎస్ అడిషనల్ సీపీ గజరావు భూపాల్ వివరాలు వెల్లడించారు. సరూర్‌నగర్‌కు చెందిన దేవరశెట్టి పెద్ద వెంకటేశ్వర్లు కుమారుడు దేవరశెట్టి గౌతమ్ కెనడాలో బీటెక్ చదువుతున్నాడు. అతనికి నితేష్ అనే వ్యక్తి ద్వారా దుబాయ్‌లో ఉంటున్న జిబ్రాన్‌తో పరిచయం ఏర్పడింది. జిబ్రాన్ గత కొన్నాళ్లుగా నకిలీ క్రెడిట్‌కార్డులు సేకరించి కొంతకాలంగా పలు యూనివర్సిటీలకు ఫీజు చెల్లింపులు చేస్తున్నాడు. ఇదే విషయాన్ని గత ఏడాది జిబ్రాన్ నితేష్‌కు చెప్పాడు. అదే సమయంలో విద్యాభ్యాసం కోసం కెనడా వెళ్లిన గౌతమ్‌కు నితీష్ ఈ ఫీజు చెల్లింపుల వ్యవహారాన్ని చెప్పాడు. దీని ద్వారా భారీ మొత్తంలో డబ్బు వస్తుందని చెప్పడంతో ఆశపడ్డ గౌతమ్ ఈ వ్యవహారంలో తన తండ్రి పెద్ద వెంకటేశ్వర్లును కూడా భాగస్వామిని చేశాడు. విద్యార్థుల వివరాలను దుబాయ్‌లో ఉండే జిబ్రాన్‌కు చేరవేసినందుకు గాను 35శాతం కమీషన్ గౌతమ్‌కు, 5శాతం కమీషన్ నితేష్, మిగతా 60శాతం కమీషన్ జిబ్రాన్‌కు వచ్చేలా ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. యూఎస్ కేంద్రంగా చెల్లింపులు జరిపిన విద్యార్థుల తల్లిదండ్రుల వివరాలను గౌతమ్ తన తండ్రికి చెప్పడంతో అతను నగరంలోని వారి కుటుంబసభ్యుల నుంచి రూ.2.06 కోట్లు ఆన్‌లైన్ ద్వారా సేకరించాడు.


నిందితులు పెద్ద వెంకటేశ్వర్లు, గౌతమ్

యూఎస్‌లో కేసు నమోదు

ఇదిలా ఉండగా మోసపూరితమైన క్రెడిట్ కార్డుల ద్వారా యూనివర్సిటీలకు డబ్బు వచ్చిందని యూఎస్ పోలీసులు పలు యూనివర్సిటీలకు నోటీసులు ఇవ్వడమేగాక సంబంధిత క్రెడిట్‌కార్డు హోల్డర్‌లపై కేసులు నమోదు చేశారు. దీంతో క్రెడిట్‌కార్డుల ద్వారా చెల్లించిన ఆ డబ్బంతా బ్యాంకుల్లో ఫ్రీజ్ అయ్యింది. దీంతో ఫీజు చెల్లించలేదని యూనివర్సిటీలు విద్యార్థులకు నోటీసులు జారీ చేశాయి. అడ్మిషన్ క్యాన్సిల్ అవుతుందనే భయంతో వారు నేరుగా యూనివర్సిటీలకు ఫీజు చెల్లింపులు చేశారు. 32మంది బాధితుల్లో కొందరు సిటీసైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు కెనడా నుంచి నగరానికి వచ్చిన గౌతమ్‌తో పాటు అతడి తండ్రి, మధ్యవర్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అడిషనల్ సీపీ వివరించారు.


మొఫకంజా కాలేజ్ జట్టు


సిద్దార్థ కాలేజ్ జట్టు ఇబ్రహీంపట్నం

జోరుగా 'సాక్షి' ప్రీమియర్ లీగ్


శ్రేయాస్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు

SPL SAKSHI PREMIER LEAGUE
SAKSHI
SAKSHI DIGITAL MEDIA GROUP

ఘట్‌కేసర్: మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, ప్రతాపసింగారంలోని బాబురావు సాగర్ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్-4 (ఎస్‌పీఎల్) మంగళవారం జోరుగా సాగాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 65 జట్లు పోటీ పడుతున్నాయి.

విజేతల వివరాలివీ...

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం-1

మొదటి మ్యాచ్‌లో మొఫకంజా కాలేజ్ జట్టు 8 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 103 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన వెస్లీ-ఏ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 80 పరుగులు చేసి ఓటమి పాలైంది. మొఫకంజా క్రీడాకారుడు అఫాన్ 19 బంతుల్లో 64 పరుగులు చేశాడు.

- రెండో మ్యాచ్‌లో ఎస్వీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 2 వికెకేట్లు కోల్పోయి 178 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన అశోకా ఇంజినీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 32 పరుగులు చేసి పరాజయం పాలైంది. ఎస్వీ కళాశాల క్రీడాకారుడు ఎడ్నాన్ 29 బంతుల్లో 100 పరుగులు చేశాడు.
- మూడవ మ్యాచ్‌లో హోలి మేరీ-ఏ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన లయోలా డిగ్రీ కాలేజ్ జట్టు 9.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 83 పరుగులు చేసి విజయం సాధించింది.
- నాలుగో మ్యాచ్‌లో ఎంఎల్‌ఆర్‌ఐటీ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 104 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన మల్లారెడ్డి ఇంజినీరింగ్-ఏ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 74 పరుగులు చేసి ఓడిపోయింది.

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం-2

- మొదటి మ్యాచ్‌లో వేదా డిగ్రీ-ఏ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 133 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన మాతృశ్రీ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 86 పరుగులు చేసి ఓడిపోయింది. వేదా జట్టు క్రీడాకారుడు పవన్ 27 బంతుల్లో 56 పరుగులు, గణేశ్ 17 బంతుల్లో 47 పరుగులు చేశాడు.
- రెండో మ్యాచ్‌లో శ్రేయాస్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 67 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన ప్రగతి డిగ్రీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 60 పరుగులు చేసి పరాజయం పాలైంది.
- మూడవ మ్యాచ్‌లో సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో ఆలౌట్‌తో 82 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన అవినాష్ డిగ్రీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 75 పరుగులు చేసి ఓడిపోయింది.
- నాలుగో మ్యాచ్‌లో ఎంఆర్‌ఈసీ-ఎ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 94 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన శ్రీ ఇందు కాలేజ్-బి జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 64 పరుగులు చేసి ఓటమి పాలైంది.

గిఫ్ట్ పేరుతో రూ.1.22 కోట్లు టోకరా

ఇద్దరు నైజీరియన్ల అరెస్టు

హిమాయత్‌నగర్: గిఫ్ట్ పేరుతో మోసానికి పాల్పడ్డ నైజీరియన్ జంటను అరెస్టు చేసినట్లు సీసీఎస్ జాయింట్ సీపీ గజరావు భూపాల్ తెలిపారు. వారి నుంచి 20 పాస్‌బుక్‌లు, 8 చెక్కు బుక్‌లు, 9 డెబిట్ కార్డులు, 12 మొబైల్ ఫోన్లు, 4 సిమ్‌కార్డులు, ల్యాప్‌టాప్, మూడు ఐడీకార్డులను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ సీపీ కార్యాలయంలో సైబర్‌క్రైం డీసీపీ స్నేహ మెహ్రా, ఏసీపీ కేవీఎం ప్రసాద్‌లతో కలిసి వివరాలు వెల్లడించారు. నైజీరియాకు చెందిన బకయోకో లస్సినా, షోమా పుర్కయస్తా ప్రేమికులు. బకయోకో లస్సినా డాక్టర్ లియనార్డో మ్యాటియో అనే పేరుతో ఫేస్‌బుక్ అకౌంట్‌ను తెరచి కొందరికి ఫ్రెండ్ రిక్వెస్టులు పంపాడు. నగరానికి చెందిన ఓ యువతి అతడి రిక్వెస్ట్ యాక్సెప్ట్ చేయగా కొంతకాలం ఇద్దరూ చాటింగ్ చేసుకున్నారు. తనను లండన్‌లో డాక్టర్‌గా పరిచయం చేసుకున్న ఇతగాడు యువతి కోసం సిటీకి వస్తున్నట్లు తెలిపాడు. ఆ తర్వాత కొన్నాళ్లకు ఢిల్లీ కస్టమ్స్‌లో మీ కోసం వస్తున్న డాక్టర్ లియనార్డో మ్యాటియోను అరెస్టు చేశామని, అతడి వద్ద వజ్రాలు, విలువైన బహుమతులు, డబ్బును స్వాధీనం చేసుకున్నామంటూ సదరు యువతికి కస్టమ్స్ ఆఫీసర్‌గా పరిచయం చేసుకున్న షోమా పుర్కయస్తా ఫోన్ చేసి చెప్పింది. ఆమెను భయపెట్టి పలు దఫాలుగా రూ.1.22 కోట్లు పలు బ్యాంకు అకౌంట్‌లకు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. అయినా పదే పదే డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో బాధితురాలు సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఢిల్లీ వెళ్లి నిందితులను అరెస్టు చేశారు. ఇదే తరహాలో వీరు పలువురిని మోసం చేసినట్లు గజరావు భూపాల్ తెలిపారు.

సైబర్ నేరగాడికి అరదండాలు



సాక్షి, సిటీబ్యూరో: నగర వాసికి ఫోన్ చేసి బ్యాంక్ ఖాతాకు పాన్ నెంబర్ జత చేయాలంటూ చెప్పి ప్రత్యేక లింకు ద్వారా రూ.8.23 లక్షలు కాజేసిన సైబర్ నేరగాడిని రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఇతడికి సహకరించిన మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు సోమవారం ప్రకటించారు. ఢిల్లీకి చెందిన పీటర్, బీహార్‌లో నివసించే నితేష్ కుమార్ స్నేహితులు. వీరిద్దరూ పథకం ప్రకారం దేశ వ్యాప్తంగా అనేక మందికి ఫోన్లు చేసి బ్యాంకు ఖాతాలకు పాన్ నెంబర్లు లింక్ చేయాలని చెప్తున్నారు. అంగీకరించిన వారికి ఫిషింగ్ లింకులు పంపి అందినకాడికి దండుకుంటున్నారు. వీరి వల్లోపడిన ఓ వ్యక్తి రాచకొండ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఏసీపీ ఎస్వీ హరికృష్ణ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ ఎం.సురేందర్ దర్యాప్తు చేశారు. సాంకేతిక ఆధారాలతో నిందితుడు పీటర్ ఢిల్లీలో ఉన్నట్లు గుర్తించారు. అక్కడికి వెళ్లిన ప్రత్యేక బృందం ఇతడిని అరెస్టు చేసి తీసుకువచ్చింది. విచారణలో నితేష్ పేరు వెలుగులోకి రావడంతో పరారీలో ఉన్న అతడి కోసం గాలిస్తోంది.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సందీప్


స్వాధీనం చేసుకున్న తుపాకీ, బుల్లెట్లు, నగదు

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం, ఉద్దమర్రి గ్రామంలో గత నెలలో వైన్స్ షాప్ వద్ద కాల్పులు జరిపి దోపిడికి పాల్పడిన కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం మేడ్చల్ డీసీపీ సందీప్‌కుమార్ శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. రాజస్థాన్ రాష్ట్రం, భరత్‌పూర్ జిల్లాకు చెందిన మహమ్మద్ నసీర్, ఆరిఫ్ ఖాన్ గతంలో మూడుచింతలపల్లి మండలంలో జేసీబీ ఆపరేటర్లుగా పని చేశారు. ప్రస్తుతం అదే రాష్ట్రానికి చెందిన సమూన్ సిద్దిపేట జిల్లా, కర్కపట్లలో జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తుండగా, తారిఫ్ అల్వాల్ ప్రాంతంలో జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. స్వగ్రామానికి తిరిగి వెళ్లిన నసీర్,ఆరీఫ్ అక్కడ పని లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో సులువుగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్న వారు కర్కపట్లలో ఉంటున్న సమూన్‌తో కలిసి దోపిడీలకు పాల్పడాలని పథకం రూపొందించారు. ఇందులో భాగంగా రాజస్థాన్‌లో రూ.6 వేలకు తుపాకీ కొనుగోలు చేసిన నసీర్, ఆరీఫ్ గత నెల సమూన్ వద్దకు వచ్చి అతడి ఇంట్లో ఆశ్రయం పొందారు. గత నెల 19న శామీర్‌పేట్ మండలం, తుర్కపల్లి గ్రామంలో బైక్‌ను దొంగిలించారు. అయితే ఆ వాహనం సరిగ్గా పనిచేయకపోవడంతో మర్నాడు యాదాద్రి భువనగిరి జిల్లా, తుర్కపల్లిలో పల్సర్ బైక్‌ను దొంగిలించారు. గత నెల 23న రాత్రి ఉద్దమర్రి వినాయక వైన్స్ సిబ్బంది దుకాణం మూసి వేసి ఇంటికి వెళుతుండగా బైక్‌పై వచ్చిన ముగ్గురు నిందితులు నాటు తుపాకీతో కాల్పులు జరిపి వారి నుంచి రూ.2,08500 నగదు దోచుకెళ్లారు.

కాల్పుల ఘటనను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు మేడ్చల్ డీసీపీ సందీప్ నేతృత్వంలో 8 బృందాలను ఏర్పాటు చేశారు. సీసీఎస్ డీసీపీ శశాంకొరెడ్డి పర్యవేక్షణలో పలు ఆధారాలు సేకరించిన పోలీసులు నిందితులు రాజస్థాన్‌లో ఉంటున్నట్లు గుర్తించి ప్రత్యేక బృందాలను అక్కడికి పంపారు. అప్పటికే పలు కేసులో నిందితుడిగా ఉన్న నాసిర్ ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా సమూన్‌ఖాన్, తారీఫ్ దోపిడీలో పాల్గొన్నట్లు వెలుగులోకి వచ్చింది. వారిని తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని దొంగలమైసమ్మ వద్ద అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి పల్సర్ బైక్, రూ.80,150 నగదు, రెండు సెల్‌ఫోన్లు, నాటు తుపాకీ, బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు ఆరీఫ్‌ఖాన్ పరారీలో ఉన్నట్లు డీసీపీ వెల్లడించారు. నిందితులపై పలు కేసులు ఉండడంతో వారిపై పీడీ యాక్ట్ నమోదు చేశామన్నారు. సమావేశంలో ఏసీపీ రామలింగరాజు, శశాంక్‌రెడ్డి, సీఐలు జేమ్స్‌బాబు, బాలరాజ్,లక్ష్మి నారాయణ, శామీర్‌పేట్ సీఐ సుధీర్‌బాబు, ఎస్‌ఐలు రవికుమార్, వీరశేఖర్ పాల్గొన్నారు.

దాగుడు మూతలతో మాస్ కాపీయింగ్

- 'టోఫెల్, జీఆర్‌ఈ' ముఠాకు అరదండాలు
- ఒక్కో విద్యార్థి నుంచి రూ.20 వేలు వసూలు
- యూఎస్ నుంచి వాట్సాప్ ద్వారా మానిటరింగ్
- అక్కడి నుంచి కీలక పాత్ర పోషించిన గుణశేఖర్
- నగర వాసి శ్రావణ్, రాయ్‌పూర్ ఎన్‌ఐటీ విద్యార్థి పాత్ర
- మొత్తం నలుగురిని అరెస్టు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీసీఎస్ జాయింట్ సీపీ గజరావు భుపాల్, డీసీపీ స్నేహ మెహ్రా

హిమాయత్‌నగర్: అంతర్జాతీయ విద్యాసంస్థల్లో సీటు పొందేందుకు ఉద్దేశించిన టోఫెల్, జీఆర్‌ఈ ఆన్‌లైన్ టెస్టుల్లో 'దాగుడు మూతల' పంథాలో మాస్ కాపీయింగ్ చేస్తున్న ముఠా గుట్టును హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రట్టు చేశారు. దాదాపు రెండేళ్లుగా ఈ దందా చేస్తున్న చేస్తున్న నిందితులను డెకాయ్ ఆపరేషన్ ద్వారా పట్టుకున్నట్లు జాయింట్ సీపీ డాక్టర్ గజరావ్ భూపాల్ మంగళవారం తెలిపారు. మండల శ్రావణ్ కుమార్, మండల సాయి సంతోష్, పి.కిశోర్, ఎ.కిరణ్‌కుమార్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సూత్రధారి, ప్రధాన నిందితుడు గుణశేఖర్ ప్రస్తుతం అమెరికాలో ఉంటున్నట్లు తెలిపారు. డీసీపీ స్నేహ మెహ్రా, ఏసీపీ కేవీఎం ప్రసాద్, ఇన్‌స్పెక్టర్లు నవీన్, హరి భూషణ్ రావులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

హస్తినాపురం కేంద్రంగా వ్యవహారం...

టోఫెల్, జీఆర్‌ఈ టెస్టుల్లో అధిక స్కోరు వచ్చేలా తాము సహాయ సహకారాలు అందిస్తామంటూ నగరానికి చెందిన గుణశేఖర్ సోషల్ మీడియా ద్వారా కోవిడ్ సీజన్ నుంచి ప్రచారం చేస్తున్నాడు. దీనికి సంబంధించి కొందరు విద్యార్థులు గుణశేఖర్‌ను సంప్రదించగా.. ఒక్కో విద్యార్థి నుంచి రూ.20 వేలు చొప్పున తీసుకున్నాడు. ఇలా దాదాపు ఇతనొక్కడే వంద మంది విద్యార్థులకు మాస్ కాపీయింగ్‌కు సహకరించినట్లు విచారణలో వెల్లడైంది. తమతో ఒప్పందం చేసుకున్న వారికి టెస్టు మరో గంటలో ఉందనగా హస్తినాపురంలోని ఎగ్జామ్ రూమ్ అడ్రస్ చెప్పేవాడు. అక్కడికి వచ్చిన స్టూడెంట్‌తో పాటు తాను ఏర్పాటు చేసిన టెస్టు టేకర్‌ను లోపలికి పంపేవాడు. కెమెరా 360 డిగ్రీస్ తిప్పుతున్న సమయంలో టెస్టు టేకర్ స్టూడెంట్ వెనుక దాక్కునేవాడు. టెస్టు ప్రారంభం అయ్యాక సుమారు 20 నిమిషాల వరకు ప్రశ్నలను టెస్ట్ టేకర్ వాట్సాప్ ద్వారా పంపేవాడు. ఆన్సర్స్‌ను తిరిగి అదే వాట్సాప్ నంబర్‌కు వచ్చిన తర్వాత కనుసైగలు, చేతి వేళ్లతో సమాధానాలు స్టూడెంట్‌కు చెప్పి రాయించే వాడు.

రాయ్‌పూర్ ఎన్‌ఐటీ స్టూడెంట్స్‌తో జవాబులు..

గుణశేఖర్‌కు పరిచయం ఉన్న వైజాగ్‌కు చెందిన ఆదిత్య, నగరానికి చెందిన శ్రావణ్ రాయ్‌పూర్‌లోని ఎన్‌ఐటీలో చదువుతున్నారు. వీరికి టోఫెల్, జీఆర్‌ఈలకు సంబంధించిన ఆన్సర్స్ చెప్పడంలో మంచి ప్రతిభ ఉంది. తొలి రోజుల్లో బంధువులకు, స్నేహితులకు సాయం చేయాలని చెప్పి వారి నుంచి ఆన్సర్స్ రాబట్టేవాడు. కొన్నాళ్లకు ఇదో దందాగా తెలుసుకున్న వారిద్దరూ గుణశేఖర్‌కు వస్తున్న రూ.20 వేలలో నుంచి కొంత డబ్బును కమీషన్‌గా తీసుకుంటూ ఈ మాస్ కాపీయింగ్‌లో భాగస్వాములయ్యారు. గత ఏడాది డిసెంబర్‌లో గుణశేఖర్ అమెరికా వెళ్లాడు. అతను వాడే సిమ్‌కార్డును ఇక్కడే ఉంటున్న శ్రావణ్‌కు ఇచ్చాడు. దానికి సంబంధించిన వాట్సాప్‌ను మాత్రం అతడు అక్కడ తన ఫోన్ ద్వారా వాడుతున్నాడు.

అక్కడి నుంచే కథ నడుపుతూ...

సోషల్ మీడియాలో యాడ్స్ చూసి రెగ్యులర్ కాల్స్ చేసిన వారితో మాట్లాడే శ్రావణ్ అర్ధగంట తర్వాత వాట్సాప్ కాల్ చేయమనే వాడు. ఈ కాల్స్‌ను అమెరికాలో ఉన్న గుణశేఖర్ ఆన్సర్ చేసే వాడు. విద్యార్థి వివరాలు, ఏ దేశానికి వెళ్లేది, టెస్టుకు సంబంధించిన వివరాలు తీసుకునేవాడు. గుణశేఖర్ చెప్పిన వాటికి ఒప్పుకున్న స్టూడెంట్‌కు టెస్టు రోజున గంట ముందు హస్తినాపురంలోని ఎగ్జామ్ రూమ్ అడ్రస్ చెప్పేవారు. గుణశేఖర్ అమెరికా నుంచి వాట్సప్ ద్వారా మానిటరింగ్ చేస్తుండగా, ఆదిత్య రాయ్‌పూర్ నుంచి ఆన్సర్స్‌ను ఇక్కడ టెస్టు కండక్ట్ చేయించే శ్రావణ్‌కు వాట్సప్ ద్వారా పంపేవాడు. ఇలా 2020 ఏప్రిల్ నుంచి ఈ దందా చేస్తున్నట్లు, వందల మందిని మాస్ కాపీయింగ్ ద్వారా స్కోర్ సాధించి విదేశాలకు పంపినట్లు తేలింది. ఈ కేసులో శ్రావణ్‌తో పాటు టెస్ట్ టేకర్స్‌గా వ్యవహరించి ఇతడికి సహకరించిన కిరణ్, సాయి సంతోష్, కిషోర్‌లను అరెస్టు చేశామని, పరారీలో ఉన్న ఆదిత్య, గుణశేఖర్ కోసం గాలిస్తున్నామని గజరావ్ భూపాల్ తెలిపారు.

సమాచారం

తెలంగాణ గౌడ సంఘం కార్యదర్శిగా దీపాగౌడ్



నియామక పత్రం అందజేస్తున్న లక్ష్మణ్‌రావు గౌడ్

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని ఇందిరానగర్ బస్తీకి చెందిన చింతలూరి దీపాగౌడ్ తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర కమిటీలో కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావు గౌడ్ ఆమెకు నియామక పత్రం అందజేశారు. రాష్ట్రంలోని గౌడ కులస్తుల సంక్షేమం కోసం తన శాయశక్తులా పని చేస్తానని దీపాగౌడ్ తెలిపారు.

'జోడో' యాత్రలో పాల్గొన్న రోహిణ్‌రెడ్డి



బంజారాహిల్స్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రలో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి పాల్గొన్నారు. రేవంత్‌రెడ్డితో కలిసి పాదయాత్ర చేశారు. కాంగ్రెస్ శ్రేణులు ఇక్కడి నుంచి పెద్ద సంఖ్యతో తరలి వెళ్లి రేవంత్‌రెడ్డికి మద్దతుగా నిలబడ్డారు. కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ఇటీవల ముగించిన భారత్ జోడో యాత్ర సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రేవంత్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

'డ్రంకన్ డ్రైవ్'లో పట్టుబడ్డ వారికి జరిమానా

ఫిలింనగర్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ డ్రంకన్ డ్రైవ్‌లో జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులకు 15 మంది పట్టుబడ్డారు. మంగళవారం వీరిని నాంపల్లిలోని నాల్గవ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. వీరందరికీ ఒక్కొక్కరికి రూ. 2100 చొప్పున న్యాయమూర్తి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. జరిమానా రూపంలో రూ. 31500 వసూలైంది.

బంజారాహిల్స్‌లో...

బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డ్రంకన్ డ్రైవ్‌లో మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ 11 మందిని మంగళవారం నాల్గవ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎదుట ప్రవేశ పెట్టారు. వీరి నుంచి రూ. 2100 చొప్పున మొత్తం 23,100 జరిమానా వసూలు చేసినట్లు ట్రాఫిక్ సీఐ టి.నరసింహరాజు తెలిపారు.

ట్రాఫిక్ అంబ్రెల్లాల 'క్లీన్ అండ్ గ్రీన్'



కూడళ్లలోని అంబ్రెల్లాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేబీఆర్ పార్కు జంక్షన్, తాజ్‌కృష్ణా, జహీరానగర్ జంక్షన్లలోని ట్రాఫిక్ ఐలాండ్లలో ఏర్పాటు చేసిన అంబ్రెల్లాలను సిబ్బంది క్లీన్ అండ్ గ్రీన్ చేశారు. కొంత కాలంగా అంబ్రెల్లాలు పరిశుభ్రతకు నోచుకోకపోగా రంగులు కూడా వెలిసిపోయి కళావిహీనంగా ఉన్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం అంబ్రెల్లాలతో పాటు బొల్లార్డ్స్, కోన్స్, సైనేజ్ బోర్డులను శుభ్రం చేశారు. ఆపరేషన్ రోప్‌లో భాగంగా ఈ పనులు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

తాగునీటి కనెక్షన్లకు ఛాంబర్లు

- ఫైలట్ ప్రాజెక్ట్‌గా తట్టికాన సెక్షన్ ఎంపిక
- ఎన్బీటీ నగర్, జవహర్ కాలనీల్లో ఛాంబర్ల నిర్మాణం
- కలుషిత నీరు, అక్రమాలకు చెక్



జవహర్ కాలనీలో నిర్మిస్తున్న తాగునీటి కనెక్షన్ల చాంబర్లు

బంజారాహిల్స్: గతంలో ఒక వీధిలో 30 నివాసాలు ఉంటే.. ప్రతి ఇంటి తాగునీటి నల్లా కనెక్షన్‌ను ఆ వీధిలో ఎదురుగా ఉన్న జలమండలి పైప్‌లైన్‌కు ఇచ్చేవారు. కానీ ఇప్పుడు అలా కాకుండా ప్రతి పది నివాసాలకు ఒక ఛాంబర్‌ను నిర్మించి అక్కడే ఆ పది ఇళ్ల కనెక్షన్లు ఇస్తారు. ఈ సరికొత్త ప్రయోగానికి జలమండలి డివిజన్–6 పరిధిలోని తట్టికాన సెక్షన్‌ను ఫైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశారు.

- జూబ్లీహిల్స్ డివిజన్ జవహర్ కాలనీలోని మూడు వీధులు, బంజారాహిల్స్ డివిజన్‌లోని ఎన్బీటీ నగర్‌లోని ఓ వీధిలో ఈ తాగునీటి లైన్ల ఛాంబర్లను నిర్మిస్తున్నారు.
- ఈ చాంబర్లలో ఇచ్చే నల్లా కనెక్షన్ల పైప్‌లైన్ల మీద ఏ ఇంటికి కనెక్షన్ వెళ్తుందో ఆ ఇంటి యొక్క నంబర్‌ను, క్యాన్ నంబర్‌ను రాస్తామని అధికారులు చెబుతున్నారు.
- ఇప్పటికే ఉచిత మంచినీటి పథకానికి మీటర్లు బిగించిన అధికారులు ఈ సరికొత్త ప్రయోగంతో పారదర్శకంగా నీళ్లు అందించేందుకు సిద్ధమవుతున్నారు.

నీటి కాలుష్యానికి అడ్డుకట్ట...

తాగునీటి సరఫరాలో కలుషిత నీరు వస్తే ఎక్కడ సమస్య ఉందో తెలుసుకోవడం గతంలో చాలా కష్టంగా ఉండేది. ఈ ప్రయోగం వల్ల ఏ ఇంట్లోకి కలుషిత నీరు వస్తుందో గుర్తించి ఆ కనెక్షన్‌ను పట్టుకొని జాగ్రత్తగా సమస్యను పరిష్కరించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

- ప్రధానంగా కలుషిత నీరు సరఫరా కాకుండా వినియోగదారులకు సరిపడా మంచినీటిని అందించేందుకు ఈ పథకం బాగా తోడ్పడుతుందని అధికారులు చెబుతున్నారు.
- అంతే కాకుండా సరిపడా ప్రెషర్‌తో తాగునీరు సరఫరా అవుతుంది. అయితే ఒక చాంబర్‌లో 15కి మించి కనెక్షన్లు ఇవ్వబోమని అధికారులు తెలిపారు.
- ప్రతి పదిహేను నివాసాలకు ఒక చాంబర్‌ను నిర్మించి వాటిపై మ్యాన్‌హోల్ నిర్మిస్తున్నారు.
- ఈ ప్రయోగం విజయవంతమైతే నగరంలోని అన్ని బస్తీల్లోని చాలా వీధుల్లో ఈ విధమైన ఛాంబర్లు నిర్మిస్తామని అధికారులు తెలిపారు.

అక్రమాలకు తెరపడేలా...

ప్రతి చోటా పాత లైన్‌ను మార్చేటప్పుడు కొంత మంది స్థానిక లీడర్లు ఇష్టారాజ్యంగా అక్రమంగా కనెక్షన్లు తీసుకుంటారు. క్షేత్ర స్థాయి సిబ్బందితో చేతులు కలిపి కనెక్షన్ పొందుతుంటారు.

- ఈ తరహా ఛాంబర్ల విధానంతో అక్రమ కనెక్షన్లకు తెరపడినట్టేనని భావించవచ్చు.
- పారదర్శకతతో పాటు నాణ్యమైన మంచి నీటిని అందించేందుకు ఈ ఛాంబర్ల నిర్మాణం ఎంతగానో ఉపయోగపడుతుందని జలమండలి జీఎం హరి శంకర్ తెలిపారు.

నగరంలో 'సామ్రాట్ విక్రమాదిత్య ఉత్సవ్'

10 నుంచి 12 తేదీ వరకు నిర్వహణ



విక్రమాదిత్య ఉత్సవ్ -2023 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాహుల్ కొఠారీ తదితరులు

పంజగుట్ట: ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్, ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా విక్రమాదిత్య శోధ్ పీఠ్, మధ్యప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలో ఈ నెల 10, 11, 12వ తేదీల్లో సామ్రాట్ విక్రమాదిత్య ఉత్సవ్–2023 నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ పోస్టర్‌ను ఇంటర్‌నేషనల్ వైశ్య ఫెడరేషన్ చైర్మన్ రాహుల్ కొఠారీ, గాయత్రీ పరివార్ దక్షిణ భారత ప్రతినిధి ఉత్తమ్ గైక్వాడ్, తెలంగాణ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడు కప్పర ప్రసాద్ రావు, బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న హెచ్ఎంటీ మైదానంలో ఈ నెల 10వ తేదీ నుంచి మూడు రోజుల పాటు రాత్రి 7 గంటల నుంచి విక్రమాదిత్య నాటికను ప్రదర్శిస్తారన్నారు. మధ్యప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జ్ మురళీధర్ రావు నేతృత్వంలో జరిగే ఈ కార్యక్రమానికి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఆ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఉషా ఠాకూర్, ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ మోహన్ యాదవ్, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొంటారన్నారు. విక్రమాదిత్య పరిపాలన ఎలా ఉండేది అనే అంశాలను నాటికలో ప్రదర్శించి ఆయన ఆదర్శాలను దేశవ్యాప్తంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు.

'అదానీని అరెస్టు చేయాలి'

లిబర్టీ: దేశ ఆర్థిక వ్యవస్థ అతలా కుతలం కావడానికి గౌతమ్ అదానినే కారణమని లోక్‌దళ్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి పీవీ రాజేశ్వరరావు అన్నారు. ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసిన అదానీని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈడెన్‌బర్గ్ నివేదికలో అదాని అక్రమాలు వెలుగు చూశాయన్నారు. అతని వల్ల ఎస్‌బీఐ, ఎల్ఐసీ, పంజాబ్ నేషనల్ బ్యాంక్ తీవ్రంగా ఆర్థికంగా నష్టపోయాయని తెలిపారు. అదాని గ్రూప్‌లో ఎల్ఐసీ 77వేల కోట్లు పెట్టుబడి పెట్టగా, అందులో 18 వేల కోట్ల రూపాయలు నష్టపోయిందని, ఎస్‌బీఐ 54 వేల కోట్లు కోల్పోయిందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ దానిని పెంచి పోషించడం వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఇబ్బందుల్లో పడిందన్నారు.

బీసీల ఆర్థిక ప్రగతికి బడ్జెట్‌తో చేయూత

లిబర్టీ: బీసీల ఆర్థిక ప్రగతి, సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేసిందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుంప్ర కుమారస్వామి అన్నారు. 2023–24 వార్షిక బడ్జెట్‌లో ప్రభుత్వం నిధులు కేటాయించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకుందని అన్నారు. బీసీ దళ్ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీల ఆర్థిక ప్రగతి, సంక్షేమానికి చేయూతనివ్వటానికి బడ్జెట్ 6,229 కోట్లు కేటాయించడం చారిత్రాత్మకమన్నారు. గత బడ్జెట్ కంటే ఈ బడ్జెట్‌లో బీసీలకు అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి సమాజంలో సమున్నత స్థానం కల్పించేందుకు ముఖ్యమంత్రి సారథ్యంలో ఆర్థిక మంత్రి హరీశ్‌రావు బడ్జెట్‌లో నిధులు కేటాయించారన్నారు.

మహిళపై దాడి చేసిన వ్యక్తికి ఏడాది జైలు

బంజారాహిల్స్: తన ఇంటికి తగిలిస్తూ ఏర్పాటు చేసిన షెడ్డును తొలగించాలని చెప్పిన మహిళపై దాడి చేసిన నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ నాంపల్లిలోని 17వ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ మంగళవారం తీర్పునిచ్చారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2015 సెప్టెంబర్ 6న జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్పీఆర్ హిల్స్ సుభాష్ చంద్రబోస్ నగర్‌లో నివసించే ఆర్.సుగుణమ్మ(55) ఇంటిని ఆనుకుని పక్కనే ఉండే బి. వెంకటకృష్ణ షెడ్ నిర్మించగా సుగుణమ్మ నిలదీసింది. ఆగ్రహంతో ఊగిపోయిన వెంకటకృష్ణ ఆయన భార్య సుజాత కర్రతో సుగుణమ్మతో పాటు ఆమె కొడుకును తీవ్రంగా కొట్టారు. దీంతో ఆమె గాయపడింది. అదేరోజు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్ఐ శ్రీను వెంకటకృష్ణ, సుజాతలపై ఐపీసీ సెక్షన్ 326, 506 కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఛార్జ్ షీట్‌లో పక్కా ఆధారాలు పొందుపర్చారు. మంగళవారం న్యాయమూర్తి నిందితుడికి జైలుశిక్ష, సుజాతకు రూ. 500 జరిమానా విధించారు.

విలేకరినంటూ బెదిరింపులు

- పోలీస్ స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు

సనత్‌నగర్: విలేకరి పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నాడంటూ రామకృష్ణగౌడ్ అనే వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు అభినవ్‌రెడ్డి వివరాల ప్రకారం.. సనత్‌నగర్ సుభాష్‌నగర్, లింగయ్యనగర్‌లో నిర్మాణమవుతున్న భవనం వద్ద తాను సైట్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నానని నిర్మాణ సామగ్రి వాహనాలు రాకుండా రామకృష్ణగౌడ్ రోడ్డుపై ఓ పక్క కారు, మరో వైపు ద్విచక్ర వాహనాలు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించాడు. తాను విలేకరినని నిర్మాణ సామగ్రి వాహనాలు వెళ్లాలంటే రూ.10 వేలు ఇవ్వాలని బెదిరిస్తున్నాడని ఫిర్యాదు చేశాడు. రామకృష్ణపై బాలానగర్ పోలీస్‌స్టేషన్‌లో బెదిరింపుల కేసులు ఉన్నాయన్నారు. అభినవ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు.

రౌండ్‌టేబుల్ స్కూల్‌ను షిఫ్ట్ పద్ధతిలో కొనసాగించాలి



టీచర్లకు వినతి పత్రం అందజేస్తున్న టీజేఎస్ నేత హన్మంతుగౌడ్

ఫిలింనగర్: ఫిలింనగర్ రౌండ్‌టేబుల్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో షిఫ్ట్ పద్ధతులను తొలగించడం వల్ల విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు స్కూల్లోనే ఉండాల్సి రావడంతో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు నీరసించి పోతున్నారని జూబ్లీహిల్స్ డివిజన్ తెలంగాణ జనసమితి పార్టీ నేత జి. హన్మంతుగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని గతంలో మాదిరిగానే ఉదయం, మధ్యాహ్నం షిఫ్టులు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం ఓ విద్యార్థిని అస్వస్థతకు గురి కాగా సమాచారం అందుకున్న పార్టీ నేతలు స్కూల్‌కు వెళ్లి ఆరా తీశారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు కూడా స్కూల్లోనే ఉండాల్సి వస్తున్నదని, గతంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాత్రమే ఒక షిఫ్ట్‌లో ఈ స్కూల్ నడిచేదన్నారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా స్కూల్‌లో ఉండటం వల్ల చిన్నారులు ఇబ్బందులకు గురవుతున్నారని టీచర్ల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు తాము డీఈఓకు కూడా వినతి పత్రం అందజేస్తామన్నారు.

ఘనంగా రమాబాయి అంబేడ్కర్ జయంతి



ఆనంద్‌నగర్ చౌరస్తాలో రమాబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గంట మల్లేష్, సంజీవ

ఫిలింనగర్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి అంబేడ్కర్ 125వ జయంతి వేడుకలను ఫిలింనగర్‌లో మాల వెలుగు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ ప్రసన్నా రామ్మూర్తి పాల్గొని రమాబాయి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెలుగు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దండు లక్ష్మణ్, తులసి రాజలింగం, బన్నప్ప పాల్గొన్నారు .



రమాబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ చైర్‌పర్సన్ ప్రసన్నా రామ్మూర్తి

ఆనంద్‌నగర్‌లో...

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ డివిజన్ ఆనంద్‌నగర్ చౌరస్తాలో రమాబాయి అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి తెలంగాణ రాష్ట్ర దళితసేన అధ్యక్షుడు గంట మల్లేష్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు డి.సంజీవ పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతలు రొంపి బాలకృష్ణ, కతలయ్య, రఘు, ప్రభాకర్, గంట శ్రీనివాస్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా



ఎన్బీటీ నగర్‌లో దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

బంజారాహిల్స్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం వల్ల నిత్యం పారిశుద్ధ్య సమస్యలు తలెత్తడమే కాకుండా వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ నేపథ్యంలో బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని ఎన్బీటీ నగర్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జీహెచ్ఎంసీ సర్కిల్ –18 ఏఎంహెచ్ఓ డాక్టర్ ప్రవీణ ఆధ్వర్యంలో అధికారులు, సంబంధిత సిబ్బంది చెత్తను సేకరించారు. స్వచ్ఛ ఆటో రిక్షాల పారిశుద్ధ్య కార్మికులతో బస్తీలో తిరుగుతూ అవగాహన కల్పించారు. బస్తీలోని సాయిరాం స్కూల్‌తో పాటు ఎన్బీటీ నగర్ బస్తీ దవాఖానా వద్ద పెద్ద ఎత్తున వ్యర్థాలు పేరుకుపోతుండటంతో అధికారులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇకపై ఎవరైనా స్థానికులు ఓపెన్ గార్బేజ్ పాయింట్ల వద్ద చెత్తను వేస్తే రూ. 500 జరిమానా విధిస్తామని హెచ్చరించారు. చెత్తను రిక్షా కార్మికులకు మాత్రమే అందజేయాలని బహిరంగ ప్రదేశాల్లో వేయొద్దని సూచించారు. శానిటేషన్ సూపర్‌వైజర్ ఖయ్యూం, ఎస్ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఎస్సీలకు పెద్దపీట



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ దళిత నేతలు

బంజారాహిల్స్: బడ్జెట్‌లో ఎస్సీలకు పెద్దపీట వేస్తూ భారీగా నిధులు కేటాయించినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి జూబ్లీహిల్స్ డివిజన్ బీఆర్ఎస్ నేతలు అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ విగ్రహాల వద్ద పాలాభిషేకం చేశారు. దళిత బంధు పథకానికి ఈ ఏడాది రూ.17700 కోట్లు కేటాయించడమే కాకుండా దళితుల అభివృద్ధికి రూ. 36,760 కోట్లు కేటాయించినందుకు ఆయనకు దళితుల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఈ సందర్భంగా నేతలు వెల్లడించారు. కేసీఆర్ జిందాబాద్ నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. దళితులు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని వారి కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారని నేతలు మామిడి నర్సింగ్‌రావు, దయ్యాల దాసు పేర్కొన్నారు.

జర్నలిస్ట్ కాలనీలో కార్పొరేటర్ పర్యటన



కాలనీలోని సమస్యలపై చర్చిస్తున్న కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నం. 3లోని జర్నలిస్టు కాలనీలో మంగళవారం స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి ఎల్లారెడ్డిగూడ జలమండలి సెక్షన్ మేనేజర్ శ్యాంతో కలిసి పర్యటించారు. రూ. 20 లక్షల వ్యయంతో తాగునీటి పైప్‌లైన్ పనులు మొదలు పెట్టాల్సి ఉందని, ఈ విషయంపై సంబంధిత అధికారులతో చర్చించారు. కొత్త పైప్‌లైన్ వేయడం ద్వారా స్థానికంగా మంచినీటి సమస్య చాలా వరకు పరిష్కారం అవుతుందన్నారు. అసోసియేషన్ సభ్యులు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు.

'మత్తు'కు బానిసైతే జీవితం చిత్తు



మాట్లాడుతున్న డీసీపీ జోయల్ డేవిస్

బంజారాహిల్స్: మత్తు పదార్థాలకు బానిసలైతే మనిషిని బలి తీసుకోవడమే కాకుండా భవిష్యత్ కూడా అంధకారం అవుతుందని వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్ అన్నారు. యూసుఫ్‌గూడలోని సెయింట్ మేరీస్ డిగ్రీ కాలేజీలో మంగళవారం జూబ్లీహిల్స్ పోలీసులు డ్రగ్స్ అవేర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జోయల్ డేవిస్ మాట్లాడుతూ, తల్లిదండ్రులు కూడా తమ పిల్లల కదలికలపై దృష్టి సారించాలని సూచించారు. ఒక్కసారి డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితాంతం దానికి బానిస కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. యువత పెడదోవ పట్టడానికి ప్రధాన కారణం మత్తు పదార్థాలేనని ఆయన అన్నారు.

దళితుల అభ్యున్నతికే దళితబంధు



కారు తాళాలు అందజేస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: దళితుల అభ్యున్నతి కోసమే ముఖ్యమంత్రి కేసీఆర్ దళితబంధు పథకాన్ని అమలు చేస్తున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. రాంగోపాల్‌పేట డివిజన్ నల్లగుట్టకు చెందిన పద్మకిషోర్‌కి దళితబంధు ద్వారా మంజూరైన కారును మంగళవారం మంత్రి అందజేసి మాట్లాడారు. దళితులు ఆర్థిక, సామాజికంగా అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో దేశంలో ఎక్కడాలేని విధంగా దళితబంధు ద్వారా రూ.10 లక్షలను అందిస్తున్న ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అర్హులంతా దళితబంధును సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. అరుణగౌడ్ పాల్గొన్నారు.

చదువుతో పాటు నైపుణ్యం అవసరం

'ఎస్కీ'లో అట్టహాసంగా 'యత్నిక్ డే'



విద్యార్థులతో డైరెక్టర్ రామేశ్వరరావు, సిబ్బంది

రాయదుర్గం: ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో అట్టహాసంగా 'యత్నిక్ డే' కార్యక్రమాన్ని నిర్వహించారు. గచ్చిబౌలిలోని ఎస్కీ ప్రాంగణంలోని చాణక్య భవనంలో ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలోని స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ వారు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీఎస్ కృష్ణప్రసాద్‌రావు మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా వ్యాపార ప్రపంచంలో విజయం సాధించడానికి కమ్యూనికేషన్, కాంప్రహెన్షన్ చాలా అవసరమని ఆయన నొక్కి చెప్పారు. చదువుతోపాటు నైపుణ్యాలను నేర్చుకోవడంపై విద్యార్థులు దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ, నైపుణ్యం ఉంటే రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వెంకట్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం సీనియర్, జూనియర్ విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు, సోలో డ్యాన్స్, ర్యాంప్‌వాక్ అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏ అండ్ పీ చీఫ్ లక్ష్మీ కాంతరావు, విద్యార్థులు, అధ్యాపకులు, అధికారులు పాల్గొన్నారు.

ఐఎస్‌బీలో 'ఫ్యూచర్ ఆఫ్ ఫ్యామిలీ బిజినెస్' సదస్సు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)లోని థామస్ ష్మిదేని సెంటర్ ఫర్ ఫ్యామిలీ ఎంటర్‌ప్రైజ్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ బిజినెస్‌పై 8వ ఆసియా ఇన్విటేషనల్ సదస్సును 'ఫ్యూచర్ ఆఫ్ ఫ్యామిలీ బిజినెస్' అనే అంశంపై నిర్వ హించారు. 28 మంది ప్రముఖ కుటుంబ వ్యాపార నాయకులు, నిపుణులు తమ అనుభవాలను, సలహాలను సదస్సులో ప్రతినిధులతో పంచుకున్నారు. ప్రధానంగా భారతదేశంతో పాటు శ్రీలంక, నేపాల్ నుంచి వచ్చిన కుటుంబ వ్యాపార సంఘం సభ్యులు సదస్సులో వివిధ అంశాలపై తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. కుటుంబ వ్యాపారంలో తదుపరి తరం, నాయకత్వం, పాలనలో మహిళలు, కుటుంబ సంపదను రక్షించడం, వృద్ధి చేయడం,సంక్షోభంలో వ్యాపారాన్ని నిర్వహించడం వంటి అంశాలు పరిగణనలోకి వచ్చాయి. దివంగత రాహుల్‌బజాజ్ అసాధారణ జీవితాన్ని సెలబ్రేట్ చేసేందుకు ఆయన కుమారుడు,బజాజ్ ఫిన్ సర్వ్ లిమిటెడ్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ అధ్యక్షులు సంజీవ్ బజాజ్ , ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ బోర్డు సభ్యులు ,రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ డైరెక్టర్ జనరల్ అజిత్‌రంగ్నేకర్ తో సంభాషించారు. కార్యక్రమంలో పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కక్ష పూరితంగానే కేజ్రీవాల్‌పై కేసులు



నిరసన వ్యక్తం చేస్తున్న ఆప్ నాయకులు

లిబర్టీ: ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించిన చార్జ్‌షీట్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పేరును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పేర్కొనడంపై ఆప్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం వారు అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈడీ పత్రాలను దహనం చేసి తీవ్ర నిరసన తెలిపారు. ఆప్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్టీ కోర్ కమిటీ సభ్యుడు డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బ్లాక్ మెయిల్ రాజకీయాలకు, బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. కుట్రతోనే ఈడీ చార్జ్‌షీట్‌లో కేజ్రీవాల్ పేరు పెట్టారన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీలను ఐక్యం చేస్తూ పోరాడుతుండటం వల్లే కక్ష పూరితంగా కేంద్ర ప్రభుత్వం కేజ్రీవాల్‌పై కేసులు పెడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో రాముగౌడ్, రాకేష్ సింగ్, జావిద్, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల ఆన్‌లైన్ కోటా విడుదల

తిరుమల: వివిధ రకాల ఆర్జిత సేవా టికెట్ల ఆన్‌లైన్ కోటాను ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు టీటీడీ విడుదల చేయనుంది. తిరుమల శ్రీవారి ఆలయంలో ఆన్‌లైన్ ఆర్జిత సేవలైన (వర్చువల్ పార్టిసిపేషన్) కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవ టికెట్ల కోటాతోపాటు, ఈ సేవల ద్వారా లభించే దర్శన కోటాను ఫిబ్రవరి 9న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు. ఎలక్ట్రానిక్ డిప్ పద్ధతిలో ఆర్జిత సేవా టికెట్ల నమోదు కోసం 8న ఉదయం 10 గంటల నుంచి ఫిబ్రవరి 10న ఉదయం 10 గంటల వరకు అవకాశం ఉంటుంది. ఇతర ఆర్జిత సేవా టికెట్లను 8న మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు. https://tirupatibalaji.ap.gov.in ద్వారా వీటిని బుక్ చేసుకోవచ్చు.

ఏపీలో ప్రకృతి వ్యవసాయ విధానాలు భేష్

మెకెయిన్ ఫుడ్స్ గ్లోబల్ డైరెక్టర్ వైప్స్ నోయెల్ లెక్లెర్క్ కితాబు



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆదర్శంగా ఉన్నాయని, ఈ విధానంలో పండించే ఆహార ఉత్పత్తులు రుచి, నాణ్యతతో పాటు సురక్షితమైనవిగా గుర్తించామని అంతర్జాతీయ ఆహార ఉత్పత్తుల తయారీ సంస్థ మెకెయిన్ ఫుడ్స్ గ్లోబల్ డైరెక్టర్ వైప్స్ నోయెల్ లెక్లెర్క్ చెప్పారు. 160 దేశాల్లో బంగాళదుంప ఆధారిత ఆహార ఉత్పత్తులను విక్రయిస్తూ అంతర్జాతీయంగా గుర్తింపుపొందిన ఈ సంస్థ బృందం మంగళవారం రాష్ట్రంలో పర్యటించింది. 'ఫ్రెంచ్ ఫ్రైస్'వంటి బహుళజాతి సంస్థతో అంతర్జాతీయంగా 27 శాతం మార్కెట్‌ను సొంతం చేసుకున్న ఈ సంస్థ ఏపీతో కలిసి పనిచేసేందుకు ముందుకొచ్చింది. ఇండియాలో ఈ సంస్థతో కలిసి పనిచేస్తున్న బావిక్ కుమార్ బ్రహంభట్‌తో కలిసి నోయల్ లెక్లెర్క్ బృందం గుంటూరు జిల్లాలో నూతక్కి, కొత్తపాలెం, రేవేంద్రపాడు గ్రామాల్లో పర్యటించింది. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో బంగాళదుంప సాగు చేస్తున్న రైతుక్షేత్రాలతో పాటు ఇతర పంటలను బృందం సభ్యులు పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో అనుసరిస్తున్న విధానాలు, పాటిస్తున్న యాజమాన్య పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ఏపీలో అనుసరిస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆయా దేశాల్లో అమలుచేసేలా కృషిచేస్తామని చెప్పారు.

లక్షన్నర కోట్లు.. లక్షకుపైగా జాబ్స్

ఏపీలో రూ.1,44,185.07 కోట్ల పెట్టుబడులకు 'ఎస్ఐపీబీ'గ్రీన్ సిగ్నల్

- ప్రత్యక్షంగా 1,03,075 మందికి ఉపాధి.. పరోక్షంగా మరిన్ని
- పలు భారీ పరిశ్రమల ఏర్పాటు ప్రతిపాదనలకు ఆమోదం



సాక్షి, అమరావతి: ఏపీలో రూ.1,44,185.07 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ లభించింది. తద్వారా కొత్తగా 1,03,075 మంది ప్రత్యక్షంగా ఉపాధి పొందనుండగా పరోక్షంగా మరింత మందికి ఉపాధి లభ్యం కానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశం జరిగింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్టీపీసీ అనకాపల్లి జిల్లాలో రూ.1.10 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో నెలకొల్పే న్యూ ఎనర్జీ పార్కుతోపాటు కడియం వద్ద ఆంధ్రా పేపర్ మిల్స్ విస్తరణ ప్రాజెక్టు, పలు రంగాల్లో పరిశ్రమల ఏర్పాటు ప్రతిపాదనలకు సమావేశంలో ఆమోదం తెలిపారు. పరిశ్రమలు స్థాపించే వారికి చేదోడుగా నిలవాలని ఈ సందర్భంగా అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారు. నిర్దేశిత సమయంలోగా పనులు పూర్తై కార్యకలాపాలు మొదలయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రానున్న ప్రతి పరిశ్రమలో ప్రభుత్వం రూపొందించిన చట్టం ప్రకారం 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే దక్కాలని మరోసారి స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం వచ్చాక విద్యుత్ ప్రాజెక్టుల విధానంలో కీలక మార్పులు తెచ్చామని ముఖ్యమంత్రి తెలిపారు. విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికే ఆదాయం వచ్చే పరిస్థితులు తీసుకొచ్చామన్నారు. విద్యుత్ ప్రాజెక్టుల కోసం తీసుకుంటున్న భూమికి ఎకరాకు ఏడాదికి రూ.31 వేలు లీజు కింద చెల్లింపులు చేస్తారని, దీనివల్ల కరువు ప్రాంతాల్లో రైతులకు మేలు జరుగుతుందని ముఖ్యమంత్రి జగన్ పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రతి మెగావాట్‌కు లక్ష రూపాయల చొప్పున రాష్ట్రానికి కంపెనీలు చెల్లిస్తున్నాయని తెలిపారు. ఎస్‌జీఎస్టీ రూపంలో కూడా రాష్ట్రానికి రెవెన్యూ వస్తుందన్నారు. గ్రిడ్ బాధ్యతలు కూడా రాష్ట్రానికి లేవన్నారు. దీంతో పాటు పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు వస్తున్నాయని చెప్పారు. భోగాపురంలో అత్యంత అధునాతన సదుపాయాలతో ఐటీ పార్కు ఏర్పాటు కావాలని సీఎం జగన్ ఆదేశించారు.

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రతిపాదనలు ఇవీ

- ఎన్టీపీసీ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా పూడిమడక వద్ద న్యూ ఎనర్జీ పార్కు ఏర్పాటు కానుంది. మొదటి విడతలో రూ.55 వేల కోట్లు, రెండో విడతలో మరో రూ.55 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయి. మొత్తంగా రూ.1,10,000 కోట్ల పెట్టుబడులతో తొలిదశలో 30 వేల మందికి, రెండో దశలో 31 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. మొత్తంగా 61 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తారు.
- కడియం వద్ద ఆంధ్రా పేపర్ మిల్స్ విస్తరణ ప్రాజెక్టు ద్వారా మొత్తంగా రూ.3,400 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. ప్రత్యక్షంగా 2,100 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. 2025 నాటికి దీన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.
- శ్రీకాళహస్తి, పుంగనూరులో ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ ఫ్యాక్టరీల స్థాపన ద్వారా డీఐ పైపులు, ఫెర్రో అల్లాయిస్ తయారీ. శ్రీకాళహస్తిలో రూ.915.43 కోట్లు, పుంగనూరులో రూ.171.96 కోట్లు పెట్టుబడి పెట్టనున్నారు. మొత్తంగా రూ.1,087 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. ప్రత్యక్షంగా 2,350 మందికి ఉద్యోగాలు లభిస్తాయి.
- కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో విండ్, సోలార్ పవర్ ప్రాజెక్టులు. ఒక్కొక్కటి వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో ఎకోరెన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వీటిని ఏర్పాటు చేస్తుంది. నాలుగు విడతల్లో మొత్తం రూ.10,500 కోట్ల పెట్టుబడుల ద్వారా 2 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి.
- రామాయపట్నంలో అకార్డ్ గ్రూప్ రూ.10 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. కాపర్ కాథోడ్, కాపర్ రాడ్, సల్ఫూరిక్ యాసిడ్, సెలీనియం, ప్రత్యేక ఖనిజాల తయారీ ద్వారా ప్రత్యక్షంగా 2,500 మందికి ఉద్యోగాలు లభిస్తాయి.
- వింగ్‌టెక్ మొబైల్ కమ్యూనికేషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ.1489.23 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తిరుపతిలో నెలకొల్పే పరిశ్రమ ద్వారా 15 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి.
- కృష్ణా జిల్లా మల్లవల్లి పార్కులో ఇథనాల్ ఇంధన తయారీకి అవిశా, ఫ్యూయెల్స్ కంపెనీ ముందుకొచ్చాయి. మొత్తంగా రూ.498.84 కోట్ల పెట్టుబడి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 3,300 మందికి ఉపాధి లభిస్తుంది.
- విశాఖపట్నంలోని కాపులుప్పాడలో మరో 100 మెగావాట్ల డేటా సెంటర్‌ను వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్ ఏర్పాటు చేస్తోంది. మొత్తం రూ.7,210 కోట్ల పెట్టుబడుల ద్వారా ప్రత్యక్షంగా 14,825 మందికి, పరోక్షంగా 5,625 మందికి.. మొత్తంగా 20,450 మందికి ఉపాధి లభిస్తుంది. ఇప్పటికే ఏర్పాటు చేస్తున్న 200 మెగావాట్ల డేటా పార్కుకి ఇది అదనం.
- భోగాపురంలో 90 ఎకరాల విస్తీర్ణంలో ఐటీ పార్కు ఏర్పాటుకు ఎస్ఐపీబీ ఆమోదం లభించింది.
- రాష్ట్రంలో బాక్సైట్ తవ్వకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిషేధించిన నేపథ్యంలో జేఎస్‌డబ్ల్యూ అల్యూమినియం లిమిటెడ్ తమ ప్రణాళికలను మార్చుకుంది. ఫ్యాక్టరీ కోసం ప్రైవేట్ వ్యక్తుల నుంచి సేకరించిన 985 ఎకరాల భూమిలో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు ప్రతిపాదనను ఎస్ఐపీబీ ఆమోదించింది.

సీబీఐ దర్యాప్తుపై స్టే ఇవ్వండి

- హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ వేసిన రాష్ట్ర ప్రభుత్వం
- సీబీఐ అత్యుత్సాహాన్ని పరిగణనలోకి తీసుకోండి అని వినతి
- డివిజన్ బెంచ్ ఆదేశాలపై సింగిల్ జడ్జి స్టే ఇవ్వలేరన్న పిటిషనర్ న్యాయవాదులు
- సీజే నుంచి స్పష్టత తీసుకోవాలని ఏజీని ఆదేశించిన జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశిస్తూ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసే వరకు ఆ తీర్పు అమలును నిలిపివేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో అత్యవసర లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. సీబీఐ దర్యాప్తు చేయాలంటూ ఇచ్చిన తీర్పును మూడు వారాలపాటు నిలిపివేస్తూ స్టే ఇవ్వాలని రాజేంద్రనగర్ ఏసీపీ బి.గంగాధర్ మంగళవారం ఈ పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. అడ్వొకేట్ జనరల్(ఏజీ) బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ, సీబీఐ దర్యాప్తు తీర్పును వారం రోజులైనా నిలిపివేయాలని కోరారు. సుప్రీంకోర్టును ఆశ్రయించే వరకు (పిటిషన్‌ను విచారణకు స్వీకరించే వరకు) స్టే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సింగిల్ జడ్జి తీర్పుపై ద్విసభ్య ధర్మాసనం మెరిట్స్‌లోకి వెళ్లలేదు కాబట్టి తమ లంచ్‌మోషన్ పిటిషన్‌లో సింగిల్ జడ్జి జోక్యం చేసుకోవచ్చని జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ప్రశ్నకు ఏజీ సమాధానమిచ్చారు. సీబీఐ దర్యాప్తును నిలుపుదల చేస్తూ స్టే ఇవ్వొచ్చని చెప్పారు. ప్రస్తుతం సిట్ విచారణ నిలిచిపోయిందని, ఈ పరిస్థితుల్లో సీబీఐ దర్యాప్తు చేసేందుకు అత్యుత్సాహం చూపడం సరికాదన్నారు. ఇప్పటికే సీబీఐ జేడీ ఫైళ్లు అప్పగించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారని, సీబీఐ అత్యుత్సాహాన్ని పరిగణనలోకి తీసుకుని స్టే ఇవ్వాలని కోరారు.

నేటి మధ్యాహ్నానికి వాయిదా..

ఈ కేసులో డివిజన్ బెంచ్ స్టే ఇచ్చిందా అని న్యాయమూర్తి ప్రశ్నించగా, సింగిల్ జడ్జి తీర్పు తర్వాత దర్యాప్తు కోసం సీబీఐ ప్రభుత్వంపై ఒత్తిడి చేయొద్దని ఉత్తర్వుల్లో స్పష్టంచేసిందని ఏజీ బదులిచ్చారు. ద్విసభ్య ధర్మాసనం అప్పీల్లోని మెరిట్స్ ఆధారంగా తుది ఉత్తర్వులు ఇవ్వలేదని, అప్పీల్‌కు విచారణార్హత లేదని తేల్చినందున సింగిల్ జడ్జి జోక్యం చేసుకోవచ్చన్నారు. నిందితుల తరఫు సీనియర్ న్యాయవాదులు రవిచందర్, ప్రభాకర్ తదితరులు వాదనలు వినిపిస్తూ.. ద్విసభ్య ధర్మాసనం తీర్పు చెప్పాక స్టే కోసం సింగిల్ జడ్జి వద్దకు ప్రభుత్వం రావడం నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. ఈ పరిస్థితుల్లో సుప్రీంకోర్టుకు వెళ్లడం తప్ప మరో మార్గం లేదని, సింగిల్ జడ్జి స్టే ఇవ్వడానికి ఆస్కారం లేదని వాదించారు. సింగిల్ జడ్జి తీర్పుపై సీజే బెంచ్ వద్ద అప్పీల్ దాఖలు చేస్తే తీర్పు వచ్చిందని, ఇప్పుడు మళ్లీ అదే సింగిల్ జడ్జి వద్దకు స్టే కోసం ఎలా వస్తారని ప్రశ్నించారు. సుప్రీంకోర్టుకు వెళ్లేవరకు ఆదేశాలను నిలుపుదల చేయడానికి ద్విసభ్య ధర్మాసనం నిరాకరించిందని గుర్తుచేశారు. సిట్ దర్యాప్తు చేయాలని భావించడమూ అత్యుత్సాహం కిందకే వస్తుందని చెప్పారు. వాదనలు విన్న తర్వాత జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి.. ద్విసభ్య ధర్మాసనం తీర్పు తర్వాత స్టే కోసం సింగిల్ జడ్జిని ఆశ్రయించవచ్చో లేదో చీఫ్ జస్టిస్ నుంచి స్పష్టత తీసుకుని చెప్పాలని ఏజీని ఆదేశించారు. బుధవారం సీజే బెంచ్ వద్ద స్పష్టత తీసుకుని చెబుతామని ఏజీ చెప్పడంతో విచారణను బుధవారం మధ్యాహ్నానికి వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి చెప్పారు.

ఎమ్మెల్యేల ఎర కేసులోకి సీబీఐని రానీయొద్దు

- పిటిషన్‌ను త్వరగా విచారించాలి
- సీజేఐ ముందు ప్రస్తావించిన తెలంగాణ తరఫు న్యాయవాది

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ఎమ్మెల్యేల ఎర కేసు దర్యాప్తులోకి సీబీఐని రానీయొద్దని సుప్రీంకోర్టుకు తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. మంగళవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ జేబీ పార్దీవాలాతో కూడిన ధర్మాసనం ముందు ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే ప్రస్తావించారు. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను త్వరగా విచారించాలని అభ్యర్థించారు. సీబీఐ దర్యాప్తు చేస్తే కేసు నీరుగారిపోతుందని చెప్పారు. అనంతరం, ఇదే విషయాన్ని బుధవారం మెన్షన్‌లో ప్రస్తావించాలని సీజేఐ సూచించారు. 'వచ్చే వారంలో విచారణ జాబితాలో చేరుస్తాం. మరోసారి బుధవారం ప్రస్తావించండి' అని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు.

నగర వార్తలు

ఏసీబీ వలలో ఎస్ఐ, కానిస్టేబుల్




ఎస్ఐ సాయికుమార్



కానిస్టేబుల్ నరేష్

సనత్‌నగర్: స్టేషన్ బెయిల్ ఇప్పించడంతో పాటు స్వాధీనం చేసుకున్న బైక్‌ను విడిపించేందుకుగాను రూ.12,000 లంచం డిమాండ్ చేసిన బేగంపేట పోలీస్‌స్టేషన్ ఎస్ఐతో పాటు కానిస్టేబుల్‌పై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. లంచం డిమాండ్ చేసినందుకుగాను ఎస్ఐపై దుష్ప్రవర్తన కింద క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కరంపేట్ రాఘవేందర్ అనే వ్యక్తిపై బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో గత ఏడాది డిసెంబర్ 21న కేసు నమోదు అయ్యింది. ఈ క్రమంలో తనకు స్టేషన్ బెయిల్ ఇప్పించడంతో పాటు జప్తు చేసిన తన బైక్‌ను విడిపించాల్సిందిగా రాఘవేందర్ పోలీసులను అభ్యర్థించాడు. ఈ క్రమంలో బేగంపేట పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సాయికుమార్ రూ.15,000 లంచం డిమాండ్ చేశాడు. అదే క్రమంలో కానిస్టేబుల్ నరేష్ సైతం రూ.3000లు ఇవ్వడంతో పాటు బెయిల్ ఇప్పించడం కోసం ఎఫ్‌డీఆర్ రూ.5,000 ఇవ్వాల్సి ఉంటుందని చెప్పాడు. దీంతో జనవరి 3న ఎఫ్‌డీఆర్ రూ.5,000లు చెల్లించడంతో పాటు కానిస్టేబుల్ నరేష్‌కు వెయ్యి రూపాయలు ఇచ్చాడు. ఇదిలా ఉండగా ఎస్ఐ సాయికుమార్ డిమాండ్ చేసిన రూ.15,000లను తగ్గించాల్సిందిగా రాఘవేందర్ కోరడంతో ఆ మొత్తాన్ని రూ.12,000కు తగ్గించాడు. ఆ డబ్బులను రాఘవేందర్ చెల్లించలేకపోయాడు. దీంతో ఎస్ఐతో పాటు కానిస్టేబుల్ అతనిపై ఒత్తిడి తీసుకురావడంతో చేసేదేమీ లేక ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు తమకు అందిన ఫిర్యాదు ఆధారంగా ఆడియో, వీడియో టేపులను సేకరించారు. మంగళవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో సోదాలు జరిపారు. ఆధారాల ఆధారంగా ఎస్ఐతో పాటు కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేశారు.

ఆదివాసీలపై వైమానిక దాడులను వ్యతిరేకించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఛత్తీస్‌ఘఢ్ ఆదివాసీలపై వైమానిక దాడులను ప్రజాస్వామిక వాదులు, మేధావులు, వ్యతిరేకించాలని ప్రొఫెసర్ హరగోపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పౌర హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ఆదివాసీలపై రాజ్య నిర్బంధం సరైంది కాదన్నారు. ఇది రాజ్యాంగానికి విరుద్ధమన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ప్రజల జీవితాల్లో మార్పు రావడం లేదన్నారు. 2005లో ప్రారంభమైన సల్వాజుడుం హత్యాఖండ 1.5 లక్షల ఆదివాసీలను నిర్వాసితులను చేయడమే కాకుండా 644 గ్రామాలను దగ్ధం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. 50 వేల మంది ఆదివాసీలను సల్వాజుడుం క్యాంపుల్లో నిర్బంధించారని విమర్శించారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్ల స్క్రాప్ దుకాణంలో అగ్ని ప్రమాదం

మైలార్‌దేవ్‌పల్లి: కార్ల స్క్రాప్ దుకాణంలో అగ్ని ప్రమాదం జరిగింది. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని టాటానగర్ ప్రాంతంలో షేక్ వాహిద్(50) అనుమతి లేని కార్ల స్క్రాప్ గోదాములను నిర్వహిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం షాట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో గోదాములో ఉన్న కార్లు, వాటి పరికరాలు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.



అగ్నికి ఆహుతైన కార్ల స్క్రాప్ దుకాణం

నిన్నటి వరకు కలెక్టరేట్.. నేడు అక్రమ నిర్మాణం

కీసరలో కొనసాగిన మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం

- కొన్నాళ్ల క్రితమే అంతాయిపల్లి సొంత భవనంలోకి మార్పు
- పాత భవన నిర్మాణానికి అనుమతులు లేవని గుర్తింపు
- నోటీసులు జారీ చేసిన అధికారులు



పంచాయతీ శాఖ నోటీసులు అందజేసిన అక్రమ భవన నిర్మాణం ఇదే (పాత కలెక్టరేట్ అద్దె భవనం)

సాక్షి, మేడ్చల్ జిల్లా: నిన్నటి వరకు అధికారికంగా కలెక్టరేట్‌గా కొనసాగిన భవనం నేడు అక్రమ నిర్మాణ భవన సముదాయమంటూ నోటీసులు అందుకుంది. ప్రభుత్వ కార్యాలయం కొనసాగినన్ని రోజులు అక్రమాలపై నిగ్గు తేల్చని యంత్రాంగం ఐదు నెలల క్రితం కలెక్టరేట్ నూతన భవనం ప్రారంభం కాగానే ఇటీవల ఆ భవనానికి అక్రమ నిర్మాణమని నోటీసులిచ్చింది. ఈ భవనంలో కలెక్టరేట్ కొనసాగించేందుకు అక్షరాలా కోటి రూపాయలతో మరమ్మతులు చేపట్టారు. అంతేకాక సదరు భవన యజమాని నుంచి కూడా రూ.30 లక్షలు వసూలు చేయడం గమనార్హం. ప్రతి నెలా రూ.6 లక్షలు అద్దె చెల్లించేవారు. అక్రమమని తెలిసినా నాలుగేళ్లుగా ప్రభుత్వ కార్యాలయంగా వినియోగించుకొని ఇప్పుడు తీరా అక్రమమని తేల్చేసరికి భవన యజమాని హతాశయుడయ్యారు. ఈభవనాన్ని నిర్మించి 13 ఏళ్లవుతున్నా..ఉన్నతాధికారులు, బడా రాజకీయ నేతలు ఈ కార్యాలయాన్ని పలు మార్లు సందర్శించినా అక్రమాల జాడపై మిన్నకున్న వైనం పలు అనుమానాలకు తావిస్తోంది.

లోకాయుక్త ఫిర్యాదుతో..

సదరు భవన యాజమాని విద్యాసంస్థల స్థాపనలో భాగంగా స్థానిక కీసర గ్రామ పంచాయతీ పరిధిలో జీప్లస్‌త్రీ భవనాన్ని నిర్మించిఇంజనీరింగ్ కళాశాలను నడపారు. దాదాపు పదేళ్ల పాటు ఇంజనీరింగ్ కళాశాలను నిర్వహించిన భవన యాజమాని 2016లో కొత్త జిల్లాల ఆవిర్భావంలో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం సముదాయాలకు అద్దెకు ఇచ్చారు. అప్పటి నుంచి ఐదు మాసాల కిందట తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని అంతాయిపల్లిలోని నూతన భవనంలోకి జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయాన్ని మర్చేంత వరకు కూడా నెలకు రూ.6 లక్షల చొప్పున ప్రభుత్వం అద్దె చెల్లించింది. అయితే.. లోకాయుక్తలో ఒక వ్యక్తి

జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని నిర్వహించిన భవన సముదాయం అక్రమ నిర్మాణమని, ఎలాంటి అనమతులు పొందకుండానే జీప్లస్ త్రీ భవనాన్ని నిర్మించి...ప్రభుత్వం ఆదాయానికి భారీగా నష్ట పరిచారంటూ ఫిర్యాదు చేశారు. దీనిపై లోకాయుక్త జిల్లా పంచాయతీ శాఖను నివేదిక సమర్పించాలని ఆదేశించిన దరిమిలా, కళ్లు తెరిచిన పంచాయతీ అధికారులు చర్యల నిమిత్తం సదరు భవన యాజమానికి నోటీసులు పంపించారు. అక్రమంగా నిర్మించిన జీప్లస్ త్రీ భవన నిర్మాణాన్ని ఎందుకు కూల్చివేయ కూడదో తెలుపాలని పేర్కొంటూ ...కీసర గ్రామ పంచాయతీ నుంచి పలుమార్లు భవన యాజమానికి నోటీసులు జారీ చేశారు. చివరిగా ఇటీవల డీపీఓ ఆదేశాల మేరకు అక్రమ భవన నిర్మాణం కూల్చివేతపై కీసర గ్రామ కార్యదర్శి నోటీసులు అందజేసినట్లు తెలుస్తోంది.

నోటీసు అందలేదు

గ్రామ పంచాయతీ నుంచి నాకు ఎలాంటి నోటీసులు అందలేదు. జీపీ ద్వారా జీప్లస్ 2 భవన నిర్మాణం అనుమతులు పొంది జీప్లస్ త్రీ భవనాన్ని నిర్మించాం. బీఆర్ఎస్‌కు కూడా దరఖాస్తు చేశాను. కలెక్టరేట్ నిర్వహణకు భవనాన్ని 4ఏళ్లకు పైగా అద్దె చ్చాను.రెగ్యులర్‌గా ఇంటి పన్ను చెల్లిస్తున్నాను.
– తరుణ్‌కుమార్, భవన యాజమాని

అక్రమ భవనాన్ని కూల్చి వేయాలని ఆదేశించాం

కీసర గ్రామ పంచాయతీ పరిధిలోని అక్రమ భవన నిర్మాణంపై చర్యలకు పలుమార్లు నోటీసులు ఇచ్చాం. ఇటీవలనే భవన నిర్మాణాన్ని కూల్చివేతకు నోటీసులు జారీ చేయాలని గ్రామ కార్యదర్శిని ఆదేశించాం. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ కట్టడాల్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. – రమణమూర్తి ,డీపీఓ.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

పహాడీషరీఫ్: బైక్ అదుపుతప్పడంతో కిందపడి ఇద్దరు మృతి చెందారు.ఈ సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. ఎల్‌బి నగర్ మైత్రీనగర్‌కు చెందిన వీణ(35) ఆశా వర్కర్‌గా పనిచేస్తోంది. మంగళవారం ఉదయం వీణ పరిచయస్తుడైన కాసోజు శ్రీధరాచారి(35)తో కలిసి రావిరాలలోని సూర్యగిరి ఎల్లమ్మ దేవాలయానికి తన స్కూటీ (టీఎస్ 13 ఈడబ్ల్యూ 3192)పై బయల్దేరింది. ఆర్‌సీఐ రోడ్డులో వెళుతుండగా స్కూటీ అదుపు తప్పి కింద పడింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయపడి ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై వీణ భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

'రాష్ట్ర బడ్జెట్ అన్నిటికంటే భారీ కుంభకోణం'

హిమాయత్‌నగర్: రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్ట్ మొదటి కుంభకోణం అయితే.. ధరణి పోర్టల్ రెండో కుంభకోణమని బీజేపీ సీనియర్ నేతలు ఆరోపించారు. ఈ రెండింటిని మించిన అత్యంత భారీ కుంభకోణం తెలంగాణ బడ్జెట్ అని మాజీ ఎంపీలు వివేక్‌వెంకటస్వామి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి మండిపడ్డారు. బీజేపీ భరోసా యాత్రకు సంబంధించిన పోస్టర్‌లను మంగళవారం నారాయణగూడలోని వెంకటేశ్వరకాలనీలో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈనెల 10 నుంచి 24వ తేదీ వరకు ప్రతి గ్రామలో కార్నర్ మీటింగ్స్ నిర్వహిస్తామన్నారు. వీటిలో తమ పార్టీకి చెందిన 800 మంది ప్రముఖులు హాజరై ప్రసంగించనున్నట్లు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షులు గౌతమ్‌రావు, రాష్ట్ర నాయకులు గడ్డం రామన్‌గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీలు

వ్యాయామ టీచర్లకు అవకాశం కల్పించాలి

సాక్షి, సిటీబ్యూరో: వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు కూడా బదిలీలు, పదోన్నతులలో అవకాశం కల్పించాలని వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మంగళవారం అసెంబ్లీ ప్రాంగణంలో ప్రభుత్వ విప్ రేగా కాంతారావును వ్యాయామ ఉపాధ్యాయ ప్రతినిధులు కలిసి వినతి పత్రం సమర్పించారు. గత 20 సంవత్సరాల నుండి పీఈటీలు ఎలాంటి పదోన్నతులు లేక మానసికంగా కుంగిపోతున్నారన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి గౌడ్, మహబూబ్‌నగర్ జిల్లా శాఖ అధ్యక్షులు జగన్ గౌడ్ పాల్గొన్నారు.

భవనం పైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

మణికొండ: భార్యతో చిన్నపాటి గొడవ జరగటం, క్షణికావేశంలో ఓ వ్యక్తి భవనం మూడవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నార్సింగి పోలీసులు తెలిపిన మేరకు.. పీరం చెరువు గ్రామ పరిధిలోని అక్బర్‌నగర్‌లో భార్యతో కలిసి సిద్దు(36) నివసిస్తున్నాడు. శనివారం రాత్రి భార్యతో చిన్న గొడవ అయింది. దీంతో ఆమె చూస్తుండగానే మూడో అంతస్తు నుంచి దూకాడు. తీవ్ర గాయాలు కావటంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా ఆదివారం రాత్రి చనిపోయాడు. బార్య నిర్మల పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి పోలీసులు తెలిపారు.

కేంద్ర బడ్జెట్.. అభివృద్ధికి బాటలు వేసే బ్లూప్రింట్



ప్రసంగిస్తున్న దిలీప్‌రెడ్డి

కాచిగూడ: అట్టడుగు వర్గాలకు మేలు చేసే విధంగా కేంద్ర బడ్జెట్ ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. కేంద్ర బడ్జెట్‌పై కాచిగూడలోని మార్వాడీ శిక్షా సమితి ఆర్‌జీకేడియా కాలేజీలో కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ డీవీజీ కృష్ణ అధ్యక్షతన జరిగిన సదస్సులో వక్తలు ప్రసంగించారు. కేంద్ర బడ్జెట్ పారిశ్రామిక విప్లవానికి ఊతమిచ్చే విధంగా ఉందన్నారు. ప్రజల కొనుగోలు శక్తిని పెంచి ద్రవ్యోల్బణాన్ని తగ్గించడానికి ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొన్నారు. దేశాన్ని స్వావలంబన దిశగా తీసుకువెళ్లే విధంగా ప్రభుత్వం చేస్తున్న కృషికి దోహదం చేసే విధంగా బడ్జెట్ ఉందన్నారు. ఆలిండియా టాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్‌బీ కాబ్రా, ఆర్థిక శాఖ ప్రొఫెసర్ డాక్టర్ రాములు, మాజీ సమాచార కమిషనర్ దిలీప్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారం.
ప్రధానితో ముచ్చటగా మాటామంతీ.
ఇలాంటి ఓ రోజును కలలోనైనా కలగనలేదు.
బాలపురస్కార్ గ్రహీత అంతరంగం ఇది.

● బాల పురస్కారం

తెలుగు చతురంగ బలం


కొలగట్ల అలన మీనాక్షి


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుండి అవార్డు అందుకుంటున్న మీనాక్షి


ప్రధాని మోదీతో మీనాక్షి

నాలుగేళ్ళ చిరుప్రాయంలో చదరంగ పావులు కదపడం నేర్చిన ఆ చిన్నారి... పదకొండవ ఏటనే ఉమెన్ ఫిడే మాస్టర్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. రాష్ట్రపతి చేతుల మీదుగా గణతంత్రదినోత్సవ వేడుకల్లో భాగంగా బాలపురస్కార్ అవార్డును అందుకుంది. ఆ చిన్నారే ఆంధ్రప్రదేశ్ విశాఖకు చెందిన కొలగట్ల అలన మీనాక్షి. అమ్మ ఆడుకునేందుకు సరదాగా ఇచ్చిన చతురంగ బోర్డే అనతికాలంలో ఎత్తులకు పైఎత్తులు వేసి ఫిడే మాస్టర్ టైటిల్ సాధించే స్థాయికి ఎదిగిన క్రమాన్ని ఆమె 'సాక్షి'తో పంచుకుంది.

ప్రశ్న: చదరంగం ఆడటం ఎలా ప్రారంభమైంది?

జవాబు: నాలుగేళ్లప్పుడు అమ్మ (అపర్ణ) సరదాగా ఆడుకోవడానికి బోర్డ్‌గేమ్స్‌తో పాటు చదరంగం బోర్డ్ ఇచ్చింది. అది మాగ్నటిక్ బోర్డ్. చాలా సరదాగా వుండేది. ఆ తర్వాత గడుల్లో పావులు పెట్టి ఆనందపడేదాన్ని. అది గమనించిన అమ్మ శిక్షణకు తీసుకువెళ్ళింది. అలా వేసవి శిబిరంలో శిక్షణపొంది తొలిసారి స్థానిక టోర్నీలో పాల్గొంటే యంగెస్ట్ ప్లేయర్‌గా నిలిచాను. అప్పటినుంచి మరో ఏడాది ఆటపై దృష్టిపెట్టి ఐదున్నరేళ్లకే జిల్లా చాంపియన్‌గా నిలిచాను.


ఆటలో...

● ఫిడే మాస్టర్‌గా ఎలా ఎదిగారు?

బాలికల అండర్ 7 లో ఐదున్నరేళ్ళకే టోర్నీల్లో పాల్గొనడంతో ఫిడే రేటింగ్ మొదలైంది. క్రమంగా 2021లో ఎలో రేటింగ్ 1829కి చేరడంతో ఉమెన్ కాండిడేట్ మాస్టర్ టైటిల్ సాధించాను. ఇక అక్కడి నుంచి సీరియస్‌గానే టోర్నీల్లో పాల్గొనడం, రేటింగ్ పెంచుకోవడంతో గత డిసెంబర్‌లో ఉమెన్ ఫిడే మాస్టర్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాను. స్పెయిన్‌లో ప్రపంచ చదరంగం క్యాంప్‌లో ఉండగా ఉమెన్ ఫిడే మాస్టర్ టైటిల్‌కు అర్హమైన ఎలోరేటింగ్ 2100 పాయింట్లు సాధించాను.

● బాల పురస్కార్ అవార్డు వస్తుందని ఊహించారా?

జనవరి 20వ తేదీ సాయంకాలం నాన్న(మధు)కి ఓ కాల్ వచ్చింది. ఆ కాల్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ మినిస్ట్రీ నుంచి. అర్జంట్‌గా వివరాలను పంపాలని అన్నారు. బాల పురస్కార్ అవార్డుకి ఎంపికయ్యానన్న విషయాన్ని అర్థం చేసుకోవడానికి ఐదారు నిమిషాలు పట్టింది. అంతే! గంటలో టికెట్స్ రావడం... మరుసటి రోజే ఢిల్లీకి పయనమవడం అంతా జరిగిపోయింది. అయితే రాష్ట్ర సంప్రదాయ దుస్తుల్లో రావాలన్నారు.

● రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం ఎలా ఉంది?

అంత పెద్ద అవార్డు అందుకోవడం.. అదీ దేశ ప్రథమపౌరురాలి చేతుల మీదుగా చిరుప్రాయంలోనే తీసుకోవడం చాలా గర్వకారణం. రాష్ట్రానికి ప్రతినిధి కావడం ఒక మధురానుభూతి.

● ప్రధానమంత్రితో మాట్లాడారా?

మోదీ గారు బాల పురస్కార గ్రహీతలందర్నీ కూర్చోబెట్టుకుని ముచ్చటించారు. నాతో ఆయన తెలుగులో మాట్లాడారు. 'నేను చెప్పడం కాదు మీరు చెప్పండి' అన్నారు. మాస్టర్ టైటిల్స్ సాధించడం వరకు నా అనుభవాన్ని చెప్పాను. నాకు కొందరికి శిక్షణ ఇవ్వాలని ఉంది అంటే... 'నీకు ఇంకా చాలా కెరీర్ ఉంది. మరిన్ని విజయాలను సొంతం చేసుకుని దేశానికి ఖ్యాతి తేవాలి' అన్నారు.

● రాష్ట్ర ముఖ్యమంత్రి ఏమన్నారు?

'ఇంత చిన్నవయస్సులోనే ఇన్ని టైటిల్స్ సొంతం చేసుకున్నావా' అని ఆశ్చర్యపోయారు. 'రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచా'వని జగన్ సర్ అభినందించారు.

● మీ తదుపరి లక్ష్యం ఏమిటి?

ప్రస్తుతం నేను ఆరోతరగతి చదువుతున్నాను. మార్చిలో పరీక్షలున్నాయి. పాఠశాలలోనూ చక్కటి ప్రోత్సాహం లభిస్తోంది. పరీక్షలనంతరం జూన్‌లో యూరప్ వెళదామని అనుకుంటున్నాను. రేటింగ్‌ను మెరుగుపరుచుకుని ఐఎం నార్మ్ సాధించడానికి ఎక్కువ టోర్నీలు ఆడవలసి ఉంటుంది. కొంతకాలం అక్కడుంటేనే అది సాధ్యం. నా తదుపరి లక్ష్యం ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ (డబ్ల్యు ఐఎం)... అంటూ నవ్వుతూ ఇంటర్వ్యూ ముగించింది అలన మీనాక్షి. ఈ చిన్నారికి ఆల్ ది బెస్ట్ చెప్పేద్దామా.

– డాక్టర్ సూర్యప్రకాష్ మాడిమి, సాక్షి, విశాఖపట్నం

ఎత్తులకు పై ఎత్తులు

- 2021 డిసెంబర్ 1న ఫిడే అండర్ 10 బాలికల చదరంగంలో ఉమెన్ కాండిడెట్ మాస్టర్ (డబ్ల్యుసిఎం)గా ప్రకటించారు.
- అండర్10 బాలికల కేటగిరీలో 1829 ఎలో రేటింగ్‌తో ప్రపంచం రెండో ర్యాంక్‌కు చేరింది. అదే ఏడాది సెర్బియాలో జరిగిన ఉమెన్ లీగ్ చెస్ చాంపియన్‌షిప్‌లోనూ జట్టు నాలుగో స్థానంలో నిలవడంలో చక్కటి ప్రతిభ.
- 2021లో నేషనల్ అండర్ 10 బాలికల చదరంగం చాంపియన్‌షిప్.
- ఏషియన్ స్కూల్స్ అండర్ 7 క్లాసిక్‌లో స్వర్ణాన్ని సాధించగా... ర్యాపిడ్‌లో స్వర్ణాన్ని టైగా నిలిచింది.
- కామన్‌వెల్త్ అండర్ 8 బాలికల్లో ఆరోస్థానం.
- ప్రపంచ పాఠశాలల అండర్7 బాలికల క్లాసిక్ పోటీల్లో 13వ స్థానం.
- ఏషియన్ యూత్ – 8 బాలికల రాపిడ్ చెస్‌లో స్వర్ణాన్ని సాధించింది. వెస్టన్ ఆసియన్ -8 బాలకల రాపిడ్, బ్లిజ్‌లలో స్వర్ణాలు.

చెప్పుల్లేకుండా రోజూ 7 కిలోమీటర్లు ఆకలి కడుపుతో స్కూల్‌కు పరిగెత్తిన అమ్మాయి గత వారం రోజుల్లో రెండు బంగారు పతకాలు సాధించింది.
నిన్న మొన్నటి దాకా ఆమె ఇంటికి కరెంట్ లేదు.
తల్లికి వచ్చే వెయ్యి రూపాయల వితంతు పెన్షన్ బతకడానికి ఆధారం.
అయినా సరే ఆటల్లో నిలిచి గెలిచి పారిస్‌లో జరగనున్న ఒలింపిక్స్ కోసం ఆశలు పెట్టుకోదగ్గ అమ్మాయిగా నిలిచింది.
16 ఏళ్ల నిరుపేద బాలిక ఆశా కిరణ్ బార్లా స్ఫూర్తి గాథ ఇది.
గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు భోపాల్‌లో జరుగుతున్న జాతీయ ఖేలో ఇండియా పోటీల్లో న్యూస్ మేకర్ ఆశా కిరణ్ బార్లా.

మట్టిలో బంగారం

న్యూస్‌మేకర్



ఆశా కిరణ్ బార్లా

వారికి పేదరికం శాపం. కాని వారి పోరాటానికి అడ్డు లేదు.

వారికి పోషకాహారలోపం. కాని వారి బలానికి తిరుగులేదు.

దేశంలో ఎందరో పేద క్రీడాకారులు. కాని వారి సంకల్పానికి ఓటమి లేదు.

17 ఏళ్ల లోపు ఉండే దేశగ్రామీణ క్రీడాకారులను ఉత్సాహపరచడానికి 2018 నుంచి కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తూ వస్తున్న 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'లో భాగంగా జనవరి 30 మొదలయ్యాయి. ఫిబ్రవరి 11 వరకూ జరుగుతున్న 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2022' పోటీల్లో ఎందరో ఇలాంటి మట్టిలో మాణిక్యాలు. ఎందరినో ఆశ్చర్యపరుస్తున్న కొత్త ముఖాలు. ఆశా కిరణ్ బార్లా కూడా అలాంటి మాణిక్యమే. ఎవరీ బార్లా అని అందరూ ఆమె పట్ల ఆరా తీస్తున్నారు. నిజానికి ఇప్పటికే ఆశా సాధించిన విజయాలతో ఎంతో ప్రచారం పొందాల్సింది. కాని జార్ఖండ్‌కు చెందిన ఈ నిరుపేద ఆదివాసీ క్రీడాకారిణిని ఎవరు పట్టించుకుంటారు?

■ పరుగుల రాణి

'పీటీ ఉష నాకు ఆదర్శం' అని చెప్పే 16 ఏళ్ల బార్ల చిరుతతో సమానంగా పరిగెత్తగలదు. 2022లో కువైట్‌లో జరిగిన ఆసియా యూత్ ఫెస్టివల్‌లో 800 మీటర్ల పరుగుల పోటీలో మన దేశం నుంచి రికార్డు నమోదు చేసింది. ఇంతకు ముందు ఉన్న రికార్డును చెరిపేసింది. ఈ ఘనవిజయానికి ఆమెకు రావలసినంత పేరు భారతీయ మీడియాలో రాలేదు. విషాదం ఏమంటే కువైట్‌లో సాధించిన ఈ ఘనతను వారి ఇంట్లో రెండు రోజుల తర్వాత తెలుసుకున్నారు. ఎందుకంటే వారి ఇంటికి కరెంట్ లేదు. ఇంట్లో టీవీ లేదు. వారికి ఫోన్ కూడా లేదు. ఆశా కిరణ్ బార్లా ఈ ఘనత సాధించాక అధికారులు వచ్చి హడావిడిగా కరెంట్ ఇచ్చారు. జిల్లా స్పోర్ట్స్ యంత్రాంగం ఒక టీవీ కొని ఇచ్చింది. 'కాని మాకు తిండి ఎట్లా?' అంటుంది బార్లా.

■ ఆకలితో పరిగెత్తి

ఆశా కిరణ్ బార్లాది జార్ఖండ్‌లో రాంచీకి 100 కిలోమీటర్ల దూరంలో అడవిలో కొండల మధ్య ఉన్న అతి చిన్న గిరిజన తండా. 22 ఇళ్లు ఉంటాయి. చుట్టుపక్కల నక్సల్స్ బెడద ఉండటంతో కరెంటు, ఫోన్ సిగ్నల్స్ దాదాపుగా ఆ తండాకి లేవు. అలాంటి ఊర్లో పని చేసిన ఏకైక టీచర్ విలియమ్స్ కుమార్తె ఆశా కిరణ్. కాని 9 ఏళ్ల క్రితం ఆ విలియమ్స్ మరణించడంతో ఆ కుటుంబం దిక్కు లేనిదైంది. నలుగురు పిల్లల్ని వితంతు పెన్షన్ తోటి తల్లి రోసానియా సాకాల్సి వచ్చింది. ఆశా కిరణ్ అక్క ఫ్లోరెన్స్ బాగా పరిగెత్తుతుంది. అది చూసి ఆశా కూడా పరిగెత్తడం నేర్చింది. చిన్నప్పటి నుంచి కొండలు గుట్టలు ఎక్కిన కాళ్లు కనుక వారి కాళ్లల్లో విపరీతమైన వేగం. కాని తండ్రి మరణం తర్వాత జరుగుబాటు కోసం ఐదో తరగతి పూర్తి చేసిన ఆశాను వాళ్లమ్మ రాంచిలో ఏదో ఇంటిలో పనికి పెట్టింది. ఒక సంవత్సరం ఇంట్లో పని మనిషిగా, వెట్టి కార్మికురాలిగా పని చేసింది ఆశా.

■ టీచర్ తెచ్చిన మార్పు

ఆశా అక్క ఫ్లోరెన్స్ వాళ్ల తండాకు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మహుగావ్‌కు వెళ్లి చదువుకునేది. ఫ్లోరెన్స్ పరుగు చూసి వాళ్ల స్కూల్ టీచర్ సిస్టర్ దివ్య 'నువ్వు బాగా పరిగెత్తుతున్నావ్' అనంటే 'మా చెల్లెలు ఇంకా బాగా పరిగెత్తుతుంది' అని ఫ్లోరెన్స్ చెప్పింది. దాంతో ఆ టీచర్ రాంచీలో పనిమనిషిగా ఉన్న ఆశా కిరణ్‌ను తెచ్చి తన స్కూల్లో చేర్చింది. అక్కచెల్లెళ్లు ఇద్దరూ టిఫిన్ చేయకుండా స్కూల్‌కి పరిగెత్తుకుంటూ వచ్చేవారు. స్కూల్ అయ్యాక ఆకలికి తాళలేక మళ్లీ పరిగెత్తుకుంటూ ఇంటికి వెళ్లేవారు. టీచర్ ఇది గమనించి తానే స్వయంగా వారికి రేషన్ ఇచ్చి చదువులో క్రీడల్లో ప్రోత్సహించడమే కాదు ఇలాంటి గిరిజన బాలికలను సొంత ఖర్చులతో ట్రెయిన్ చేసే కోచ్ ఆశు భాటియా దృష్టికి తీసుకెళ్లింది. బొకారో థర్మల్ టౌన్‌లో ఉన్న తన అథ్లెట్స్ అకాడెమీలో ఆశా కిరణ్‌ను చేర్చుకున్న ఆశు భాటియా తగిన శిక్షణ ఇవ్వడంతో ఇప్పుడు ఆమె పతకాల పంట పండిస్తోంది.


● తల్లితో కిరణ్

■ రెండు స్వర్ణాలు

ఇప్పటికి 11 నేషనల్, 2 ఇంటర్నేషనల్ పతకాలు సాధించిన ఆశా తాజాగా భోపాల్‌లో జరుగుతున్న ఖేల్ రత్న యూత్ గేమ్స్‌లో 800 మీటర్ల పరుగులో, 1500 మీటర్ల పరుగులో స్వర్ణ పతకాలు సాధించింది. దాంతో పరిశీలకులు 2024లో పారిస్ ఒలింపిక్స్‌లో ఆశాను ఒక ప్రాపబుల్‌గా ఎంపిక చేశారు. 'కాని ఏం లాభం? ఆమెను ఒలింపిక్స్ స్థాయిలో శిక్షణ ఇవ్వడానికి నా దగ్గర వనరులు లేవు' అని దిగులు పడుతున్నాడు కోచ్ ఆశు భాటియా. 'మా జీవితాలు మెరుగు పరిస్తే మా అమ్మాయి ఇంకా రాణిస్తుంది' అంటుంది తల్లి.

ఈ ప్రతికూలతలు ఎలా ఉన్నా గెలిచి తీరాలనే సంకల్పం ఆశాలో.

ఇలాంటి క్రీడాకారిణుల గురించి ఎంత ప్రచారం చేస్తే అంత సాయం దక్కుతుంది. ప్రోత్సాహం లభిస్తుంది. ఇప్పుడు అందరూ చేయవలసిన పని అదే.

బ్యూటిప్స్

ముఖ సౌందర్యానికి నేచురల్ ప్యాక్స్

ముఖ సౌందర్యం కోసం రకరకాల క్రీములు రాసుకుంటూ ఉంటారు. వాటిలో కొన్ని బాగానే పనిచేయవచ్చు. పడకపోతే ముఖం మీద లేనిపోని గుల్లలు వచ్చి, మచ్చలు పడి అందవికారంగా తయారవుతుంది. అలా కాకుండా కొన్ని సహజ సిద్ధమైన ఫేస్‌ప్యాక్‌లు...



ముందుగా పచ్చిపాలలో దూదిని ముంచి ముఖాన్ని శుభ్రంగా క్లీన్ చేసుకోండి. ఆ తర్వాత...

టీ స్పూన్ నారింజ రసం, టీస్పూన్ నిమ్మ రసం, టేబుల్ స్పూన్ పెరుగు, అర టీ స్పూన్ పసుపు ఒక గిన్నెలోకి తీసుకుని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుని ఆరిన తర్వాత కడిగేసుకుంటే ముఖచర్మం కాంతిమంతంగా కనిపిస్తుంది.





స్పూన్ మినపప్పు, నాలుగైదు బాదం పప్పులు కలిపి నీటిలో నానబెట్టి మెత్తగా పేస్టులా చేసుకుని ముఖానికి ప్యాక్‌లా వేసుకోవాలి. బాగా ఆరిన తర్వాత నలుగు పెట్టుకోవాలి లేదా శుభ్రంగా కడిగేసుకోవాలి.



యూత్ పల్స్

తినాలి కాబట్టి తినడం వేరు. తినడాన్ని ఉత్సవం చేసుకోవడం వేరు.
'చేయక తప్పుతుందా!' అని వంట కోసం గరిట పట్టుకోవడం వేరు.
వంట చేయడాన్ని పండగ చేసుకోవడం వేరు.
అయితే యువతరంలో చాలామంది కొత్త కొత్త వంటకాలు నేర్చుకుంటూ వంట చేయడాన్ని పండగ చేసుకుంటున్నారు. ఇందుకు కారణం ఏమిటంటే...

నివాస భోజనంబు నిఖార్సయిన వంటకంబు!



రాజస్థాన్‌లోని ఆల్వార్‌కు చెందిన కంప్యూటర్ సైన్స్ స్టూడెంట్ అక్షితకు వంటకాల రుచులతో పరిచయం తప్ప వంటగది ముఖం ఎప్పుడూ చూసింది లేదు. ఎంబీఏ చేస్తున్న చెన్నైకి చెందిన లాస్యకు క్లాసు పుస్తకాలలో తలమునకలవ్వడం తప్ప వంటల గురించి బొత్తిగా అవగాహన లేదు. అయితే ఇదంతా పాండమిక్‌కు ముందు. ఇప్పుడు అక్షిత, లహరిలకు ఎన్నో వంటకాలలో ప్రవేశం ఉంది. వారికి వంటగదితో అనుబంధం పెరిగింది. ఈ ఇద్దరు మాత్రమే కాదు... మిలీనియల్స్, జెన్-జెడ్‌లో ఎంతో మంది గరిట పట్టి కొత్త కొత్త వంటకాలు చేసి ఆస్వాదిస్తున్నారు.

పాండమిక్ నేర్పిన పాఠాల్లో ఆరోగ్యస్పృహ ఒకటి.

ఆరోగ్యస్పృహ ఉన్నచోట ఆహార అలవాట్లకు సంబంధించిన స్పృహ మొదలవుతుంది. ఈ నేపథ్యంలో స్వయంగా వంట చేసుకొని తాజా ఆహార పదార్థాలను ఆస్వాదించడంలోని మజాను రుచి చూస్తోంది యువతరం. ఒక విధంగా చెప్పాలంటే స్మార్ట్‌ఫోన్ వీరిని వంటగదికి దగ్గర చేసింది. ఏం వండాలి? ఎలా వండాలి? అనేదానికి దారి చూపించింది.

పాండమిక్ తరువాత ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లాంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఫుడ్ రిలేటెడ్ కంటెంట్‌కు ప్రాధాన్యత పెరిగింది. ఫుడ్-బ్లాగర్స్, చెఫ్స్, హోమ్ కుక్స్ ప్రభావంతో 'ఒకసారి వంట చేసి చూద్దాం' అనే ప్రాజెక్ట్‌లోకి దిగుతుంది యువతరం.

ఫుడ్-బేస్డ్ టీవీ షోలు, ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ ద్వారా కూడా యువతరం వంటగదికి దగ్గర అవుతుంది. ముఖ్యంగా డాక్యు-సిరీస్ 'ట్విస్ట్ ఆఫ్ టేస్ట్', 'మాస్టర్ చెఫ్ ఇండియా'కు మిలీనియల్స్‌లో ఎంతో మంది ఫాలోవర్స్ ఉన్నారు.

రకరకాల సంస్కృతులను రకరకాల వంటకాల ద్వారా ఎక్స్‌ప్లోర్ చేసే ప్రయత్నం చేస్తున్నారు.

'ఒకప్పుడు ఆకలేస్తే ఆన్‌లైన్ ఆర్డర్లకు ప్రాధాన్యత ఇచ్చేదాన్ని. ఇప్పుడు మాత్రం సొంతంగా వంట చేసుకోవడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాను. ఎంతైనా ఇంటి తిండి రుచే వేరు' అంటుంది మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన జాన్వీ.

నిజానికి ఇరవైనాలుగు సంవత్సరాల జాన్వీకి వంట చేయడంలో ఓనమాలు కూడా తెలియవు. అయితే లాక్‌డౌన్ సమయంలో వంట నేర్చుకోవాల్సిన, స్వయంగా వంట చేయాల్సిన తప్పనిసరి పరిస్థితి ఎదురైంది.

'ఇది నా మంచికే జరిగింది' అనుకున్న అనేకానేక మందిలో జాన్వీ ఒకరు మాత్రమే.

'వంట చేయడం అనేది ఫన్-యాక్టివిటీకి మాత్రమే పరిమితమై పోలేదు. ఇప్పుడు అది లైఫ్-స్కిల్స్‌లో ఒకటిగా మారింది.' అంటున్నాడు ఢిల్లీకి చెందిన ఫుడ్-బ్లాగర్ అర్పిత్ అగర్వాల్.

మిల్లెట్స్ మరియు మిలీనియల్స్

మిల్లెట్స్ అనే మాట ఇప్పుడు బాగా సుపరిచితం. మిల్లెట్స్‌పై ఆసక్తి ప్రదర్శిస్తున్న వారిలో మిలీనియల్స్ ముందుండటం అనేది శుభపరిణామంగా చెప్పుకోవాలి. చిరుధాన్యాల ఉపయోగాలు వారికి కంఠోపాఠం.

'చైనీస్, ఇటాలియన్ రుచులకు అలవాటు పడిన మిలీనియల్స్‌ను మిల్లెట్స్ దగ్గరికి తీసుకుపోగలమా?' అనేది ఒకప్పుడు పరిశోధకులు, ప్రచారకుల మదిలోకి వచ్చిన ప్రశ్న.

సోషల్ మీడియా పుణ్యమా అని మిలీనియల్స్ మిల్లెట్స్ గురించి అవగాహన పెంచుకోవడమే కాదు వాటి ఉపయోగాన్ని ఆచరణలోకి తీసుకువస్తున్నారు.

వంటకం పేరు, హెల్తీ ఇన్‌గ్రేడియెంట్స్, మెథడ్ ఆఫ్ ప్రిపరేషన్, హైజీన్... ఆధారంగా జరిగే 'కుకింగ్ ఛాలెంజ్'లో మిలీనియల్స్ ఉత్సాహంగా పాల్గొంటున్నారు. పిజ్జాల రుచుల దగ్గరే ఆగిపోయిన యువతరం ఇప్పుడు మిల్లెట్ బేస్డ్ దోశ, వడ, ఉప్మా.. మొదలైన వాటి రుచిని ఆవురావురుమంటూ ఆస్వాదిస్తుంది. ఆరోగ్యస్పృహతో మిల్లెట్స్‌పై ఆసక్తి పెంచుకోవడం అనేది ఒక కోణం అయితే, రోజురోజుకు మిల్లెట్స్‌కు ఆదరణ పెరుగుతున్న దృష్ట్యా సృజనాత్మకమైన ఆలోచనలతో మిల్లెట్ ఆధారిత అంకురాల(స్టార్టప్)పై దృష్టి పెట్టడం మరో కోణం.

'మిల్లెట్స్, మిలీనియల్స్‌లో 5 ఆల్ఫాబెట్స్ ఒక్కటే. అందుకే మిల్లెట్స్‌కే నా ఓటు' అని చమత్కరిస్తున్నాడు ముంబైకి చెందిన శ్రీచందన్.

ఇంటిప్స్

చెక్క ఫర్నీచర్ పాలిష్ వెలిసిపోయి డల్‌గా కనిపిస్తుంటే దానిలో సులువుగా తిరిగి మెరుపు తెప్పించవచ్చు.

ముందుగా ఫర్నీచర్‌ను పొడిబట్టతో దులిపి శుభ్రం చేయాలి. తర్వాత టీ డికాక్షన్‌లో ఒక బట్టను ముంచి, దానిని పిండేసి ఫర్నీచర్‌ను తుడవాలి. ఆరిన తర్వాత మరో సారి శుభ్రమైన పొడి వస్త్రంతో తుడవాలి.

చెక్క ఫర్నీచర్‌పై మసి మరకలు పడితే... మరక పడిన చోట తెల్లటి టూత్ పేస్ట్ రాసి ఆరిన తర్వాత తడిబట్టతో తుడవాలి. తర్వాత తడిలేకుండా పొడిబట్టతో తుడిచెయ్యాలి.





కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో స్నేహ్ రాణా

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల టి20 బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత ప్లేయర్ స్నేహ్ రాణా తన కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకుంది. దక్షిణాఫ్రికాతో జరిగిన ముక్కోణపు టోర్నీ ఫైనల్లో రెండు వికెట్లు పడగొట్టిన స్నేహ్ నాలుగు స్థానాలు ఎగబాకి ఆరో ర్యాంక్‌లో నిలిచింది. భారత్‌కే చెందిన దీప్తి శర్మ, రేణుక సింగ్ ఒక్కో స్థానం పడిపోయి వరుసగా మూడు, ఎనిమిది ర్యాంకుల్లో నిలిచారు. బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో స్మృతి మంధాన మూడో స్థానంలో, షఫాలీ వర్మ ఎనిమిదో స్థానంలో కొనసాగుతున్నారు.

ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డు రేసులో...

గత నెలలో విశేషంగా రాణించిన భారత క్రికెటర్లు సిరాజ్, శుబ్‌మన్ గిల్ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డు రేసులో నిలిచారు. హైదరాబాద్‌కు చెందిన సిరాజ్ గత నెలలో ఐదు వన్డేలు ఆడి 14 వికెట్లు పడగొట్టడంతోపాటు టాప్ ర్యాంక్‌ను అందుకున్నాడు. గత నెలలో గిల్ ఐదు టి20లు, ఆరు వన్డేలు ఆడి మొత్తం 643 పరుగులు సాధించాడు. ఇందులో రెండు సెంచరీలు, ఒక డబుల్ సెంచరీ, ఒక అర్ధ సెంచరీ ఉన్నాయి.



డబ్ల్యూపీఎల్ వేలం బరిలో 409 మంది



ముంబై: వచ్చే నెలలో తొలిసారి నిర్వహించనున్న మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 టోర్నీ వేలం బరిలో నిలిచిన ప్లేయర్ల జాబితాను మంగళవారం విడుదల చేశారు. మార్చి 4 నుంచి 26 వరకు ముంబైలో జరిగే ఈ టోర్నీలో ఐదు జట్లు బరిలో ఉన్నాయి. గరిష్టంగా 90 బెర్త్‌ల కోసం మొత్తం 409 మంది క్రికెటర్లు పోటీపడనున్నారు. ఈనెల 13న ముంబైలో మధ్యాహ్నం 2:30 నుంచి వేలం కార్యక్రమం జరుగుతుంది. మొత్తం 1525 మంది ప్లేయర్లు వేలంలో పాల్గొనేందుకు తమ పేర్లను నమోదు చేసుకోగా... చివరకు 409 మందిని ఎంపిక చేశారు. ఇందులో 246 మంది భారత క్రికెటర్లు... 163 మంది విదేశీ క్రికెటర్లు ఉన్నారు. మొత్తం 24 మంది క్రికెటర్లు గరిష్ట కనీస ధర రూ. 50 లక్షల విభాగంలో ఉన్నారు. ఐదు ఫ్రాంచైజీలు రూ. 12 కోట్లు చొప్పున వేలంలో వెచ్చించడానికి వీలు ఉంది. ఒక్కో జట్టు 15 నుంచి 18 మంది ప్లేయర్లను ఎంపిక చేసుకోవచ్చు. గరిష్టంగా ఆరుగురు విదేశీ క్రికెటర్లను తీసుకోవచ్చు. వేలం బరిలో ఆంధ్రప్రదేశ్ నుంచి సబ్బినేని మేఘన, అంజలి శర్వాణి, షబ్నమ్, శరణ్య, నల్లపురెడ్డి శ్రీచరణి, స్నేహ దీప్తి, కట్టా మహంతి శ్రీ, వై.హేమ, బారెడ్డి అనూష, చల్లా ఝాన్సీలక్ష్మీ, విన్నీ సుజన్... హైదరాబాద్ నుంచి అరుంధతి రెడ్డి, గొంగడి త్రిష, యషశ్రీ, మమత, ప్రణవి, కోడూరి ఇషిత ఉన్నారు.

తెలంగాణకు రెండు స్వర్ణాలు



వ్రితి అగర్వాల్



లోకేశ్

సాక్షి, హైదరాబాద్: ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో మంగళవారం తెలంగాణ ఖాతాలో రెండు స్వర్ణ పతకాలు చేరాయి. ఫెన్సింగ్ క్రీడాంశంలో బాలుర ఈపీ వ్యక్తిగత విభాగంలో వేమాని లోకేశ్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో లైష్రామ్ (బెంగాల్)పై లోకేశ్ 15–14తో నెగ్గి బంగారు పతకాన్ని దక్కించుకున్నాడు. స్విమ్మింగ్ బాలికల 800 ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో వ్రితి అగర్వాల్ అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. వ్రితి 9ని:35.67 సెకన్లలో రేసును ముగించి అగ్రస్థానంలో నిలిచింది. ప్రస్తుతం తెలంగాణ ఐదు స్వర్ణాలు, మూడు రజతాలు, ఆరు కాంస్యాలతో కలిపి మొత్తం 14 పతకాలతో 11వ స్థానంలో ఉంది.

బ్రిస్బేన్ టు నాగ్‌పూర్...

రేపటి నుంచి బోర్డర్–గావస్కర్ ట్రోఫీ



ప్రాక్టీస్‌లో కేఎల్ రాహుల్, కోహ్లి

జనవరి 19, 2021... బ్రిస్బేన్‌లోని 'గాబా' మైదానం... భారత టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ ఘట్టాల్లో ఒకటిగా నిలిచిపోయే దృశ్యం ఆవిష్కృతమైంది... 33 ఏళ్లుగా ఆస్ట్రేలియా ఓటమి ఎరుగని వేదికపై టీమిండియా జయకేతనం ఎగురవేసింది. ఒకదశలో పూర్తి ఫిట్‌గా ఉన్న 11 మందిని ఎంచుకోవడమే అసాధ్యం మారిన స్థితిలో ఈ మ్యాచ్ బరిలోకి దిగిన మన జట్టు సంచలన ప్రదర్శనతో విజయంతో పాటు సిరీస్‌నూ సొంతం చేసుకుంది. రెండేళ్ల తర్వాత నాటి అవమానభారాన్ని మోస్తూ ఆస్ట్రేలియా జట్టు భారత్‌లో అడుగు పెట్టింది. అయితే మనకు అనుకూలమైన పిచ్‌లు, వాతావరణం, స్పిన్ బలగం... ఇలా అన్నీ టీమిండియా పక్షానే ఉన్నాయి. ఇలాంటి స్థితిలో ఆసీస్ బృందం తమ దేశంలో గత సిరీస్‌లో భారత్ ప్రదర్శించిన స్ఫూర్తిదాయక ప్రదర్శనను చూపించగలదా? లేక ఎప్పటిలాగే తల వంచి నిష్క్రమిస్తుందా? స్వదేశంలో అత్యద్భుత రికార్డు ఉన్న భారత్ ప్రత్యర్థిపై ఏ స్థాయిలో ఆధిపత్యం ప్రదర్శించ గలదో వేచి చూడాలి.

– సాక్షి క్రీడా విభాగం

గత రెండు దశాబ్దాల్లో భారత్, ఆస్ట్రేలియా మధ్య ఎన్నో అద్భుతమైన, చిరస్మరణీయ టెస్టు మ్యాచ్‌లు జరిగాయి. 2001 కోల్‌కతా నుంచి 2021 బ్రిస్బేన్ వరకు విజయం ఎవరిదైనా ఆసక్తికర మలుపు, ఉత్కంఠ నిండిన క్షణాలతో ఇరు దేశాల అభిమానులను అలరించాయి. ఎన్నో హోరాహోరీ సమరాలు, రికార్డులు, ఘనతలు బోర్డర్–గావస్కర్ ట్రోఫీని ప్రపంచ క్రికెట్‌లో అన్నింటికంటే అత్యుత్తమ టెస్టు పోరుగా మార్చేశాయి. 'భారత గడ్డపై టెస్టు సిరీస్ గెలవడం యాషెస్‌కంటే ఎక్కువ' అని స్టీవ్ స్మిత్ నేరుగా చెప్పడం ఈ సిరీస్ ప్రాధాన్యతను చూపిస్తోంది. ఇరు జట్ల బలాబలాలు, జట్టులో ప్రస్తుతం ఆడుతున్న సభ్యులను బట్టి చూస్తే గత మూడు సిరీస్‌లు భారత్ ఆధిపత్యంపై స్పష్టత నిస్తాయి. 2016–17లో స్వదేశంలో జరిగిన సిరీస్‌ను 2–1తో గెలుచుకున్న భారత్... ఆ తర్వాత ఆస్ట్రేలియాలో వరుసగా 2018–19లో 2–1తోనే, ఆపై 2020–21లో 2–1తో సిరీస్‌లను సొంతం చేసుకుంది. రేపటి నుంచి నాగ్‌పూర్‌లో జరిగే తొలి టెస్టు మ్యాచ్‌తో నాలుగు టెస్టుల కీలక సమరానికి సన్నద్ధమవుతున్న నేపథ్యంలో ఈ సిరీస్‌లో సాగబోయే ఆసక్తికర ముఖాముఖీలను చూస్తే...

- భారత గడ్డపై ఆస్ట్రేలియా ప్రధాన స్పిన్నర్ నాథన్ లయన్‌కు మంచి రికార్డే ఉంది. అతను 7 టెస్టుల్లో 30.58 సగటుతో 34 వికెట్లు తీశాడు. తొలి పర్యటనకంటే రెండోసారి అతని ప్రదర్శన మెరుగైంది. మరోవైపు ఆస్ట్రేలియాలో కోహ్లి, పుజారాలపై పేలవ ప్రదర్శన కనబర్చిన లయన్, భారత్‌లో మాత్రం కోహ్లిని 4 సార్లు, పుజారాను 5 సార్లు అవుట్ చేశాడు.
- ఆస్ట్రేలియాలో ఏకంగా 54 సగటుతో 1352 పరుగులు చేసి చెలరేగిపోయిన కోహ్లి... భారత్‌లో మాత్రం అదే ఆసీస్‌పై 33 సగటుతో 330 పరుగులే చేశాడు.
- స్వదేశంలో ఆసీస్‌తో ఆడిన 8 టెస్టుల్లో అశ్విన్ 50 వికెట్లు తీశాడు. ఇప్పుడూ అతనే జట్టుకు కీలకం. వార్నర్‌నే అశ్విన్ 10 సార్లు అవుట్ చేశాడు. జడేజా బౌలింగ్‌లో నూ తీవ్రంగా ఇబ్బంది పడిన వార్నర్ 4 సార్లు అవుటయ్యాడు.
- ఆసీస్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ ఆట ఈ సిరీస్‌లో నిర్ణాయకంగా మారనుంది. భారత గడ్డపై అశ్విన్ బౌలింగ్‌లో ఏకంగా 57 సగటుతో స్మిత్ పరుగులు సాధించాడు. జడేజా బౌలింగ్‌లోనూ 38 సగటుతో పరుగులు చేసిన స్మిత్ వీరిద్దరిని సమర్థంగా ఎదుర్కొంటే కంగారూ బృందం పైచేయి సాధించవచ్చు.

గత సిరీస్‌లో ఏం జరిగిందంటే...

తొలి టెస్టు (పుణే): తాము విసిరిన స్పిన్ ఉచ్చులో చిక్కుకున్న భారత్ 333 పరుగులతో ఓడింది. ఆస్ట్రేలియా రెండు ఇన్నింగ్స్‌లలో 260, 285 పరుగులు చేయగా... లెఫ్టార్మ్ స్పిన్నర్ స్టీవ్ ఒకీఫ్ (12/70) ధాటికి భారత్ 105, 107 పరుగులకే ఆలౌటైంది.

రెండో టెస్టు (బెంగళూరు): భారత్ 75 పరుగులతో గెలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్‌కు 87 పరుగుల ఆధిక్యం లభించినా... రెండో ఇన్నింగ్స్‌లో 188 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక జట్టు 112 పరుగులకే కుప్పకూలింది.

మూడో టెస్టు (రాంచీ): భారీ స్కోర్లు నమోదైన ఈ టెస్టు (భారత్ 603/9 : ఆస్ట్రేలియా 451, 204/6) 'డ్రా'గా ముగిసింది. భారత్‌కు చివర్లో గెలుపు అవకాశం వచ్చినా ఆసీస్ బతికిపోయింది.

నాలుగో టెస్టు (ధర్మశాల): 8 వికెట్లతో భారత్ విజయం. తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌కు 32 పరుగుల స్వల్ప ఆధిక్యమే లభించినా... రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్‌ను 137 పరుగులకే కుప్పకూల్చి జట్టు సునాయాస విజయాన్నందుకుంది.

అంతర్జాతీయ క్రికెట్‌కు ఫించ్ గుడ్‌బై



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా టి20 జట్టు కెప్టెన్ ఆరోన్ ఫించ్ అంతర్జాతీయ క్రికెట్ నుంచి వీడ్కోలు తీసుకున్నాడు. అయితే స్వదేశంలో జరిగే బిగ్‌బాష్, ఇతర దేశాల్లో జరిగే టి20 లీగ్‌లలోనూ ఆడతానని 36 ఏళ్ల ఫించ్ తెలిపాడు. 2015 వన్డే వరల్డ్‌కప్ నెగ్గిన ఆస్ట్రేలియా జట్టులో సభ్యుడైన ఫించ్... 2021తో తన కెప్టెన్సీలో ఆస్ట్రేలియాకు తొలిసారి టి20 ప్రపంచకప్‌ను అందించాడు. 2011లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన ఫించ్ ఆస్ట్రేలియా తరఫున ఐదు టెస్టుల్లో (278 పరుగులు), 146 వన్డేల్లో (5406 పరుగులు), 103 టి20ల్లో (3120 పరుగులు) ప్రాతినిధ్యం వహించాడు. అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన ప్లేయర్‌గా (172; జింబాబ్వేపై 2018లో)... అత్యధిక మ్యాచ్‌ల్లో (76) కెప్టెన్‌గా వ్యవహరించిన ప్లేయర్‌గా ఫించ్ పేరిట రికార్డులు ఉన్నాయి.

గ్యారీ బ్యాలన్స్ సెంచరీ



బులవాయో: వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టులో జింబాబ్వే జట్టు దీటైన సమాధానం ఇచ్చింది. ఓవర్‌నైట్ స్కోరు 114/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే 9 వికెట్లకు 379 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. గ్యారీ బ్యాలన్స్ (137 నాటౌట్; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ సెంచరీ సాధించాడు. ఈ క్రమంలో కెప్లెర్ వెసెల్స్ (ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా) తర్వాత రెండు దేశాల తరఫున టెస్టుల్లో సెంచరీలు చేసిన రెండో క్రికెటర్‌గా బ్యాలన్స్ గుర్తింపు పొందాడు. గతంలో ఇంగ్లండ్ తరఫున ఆడిన బ్యాలన్స్ ఈ ఏడాది నుంచి తను పుట్టిన జింబాబ్వే దేశం తరఫున ఆడుతున్నాడు. 68 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించిన వెస్టిండీస్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 21 పరుగులు చేసింది.


చెన్నై బ్లిట్జ్ గెలుపు

బెంగళూరు: ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో భాగంగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై బ్లిట్జ్ జట్టు 15–9, 11–15, 15–10, 8–15, 15–9తో కొచ్చి బ్లూ స్పైకర్స్ జట్టుపై గెలిచింది. చెన్నై తరఫున జేకబ్ నవీన్ రాజా తొమ్మిది పాయింట్లు, అఖిన్ ఎనిమిది, రెనాటో ఎనిమిది పాయింట్లు సాధించారు. నేడు జరిగే మ్యాచ్‌లో కోల్‌కతా థండర్‌బోల్ట్స్‌తో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ తలపడుతుంది.


సినిమా

కొన్ని రోజులుగా కొందరు స్టార్స్ జైలు చుట్టూ తిరుగుతున్నారు. అయితే సినిమా జైలు అన్నమాట. ఈ జైలు సెట్‌లో కొందరు స్టార్స్ జైలర్లుగా, కొందరు ఖైదీలుగా నటిస్తున్నారు జైలు బ్యాక్‌డ్రాప్‌లో సాగే కథలతో వసూళ్ల పరంగా బాక్సాఫీస్ కోర్టు ఇచ్చే తుది తీర్పు కోసం శాయశక్తులా కృషి చేస్తున్నారు. ఇక ఈ చిత్రాల గురించి తెలుసుకుందాం.

తీర్పు కోసం... జైలు చుట్టూ స్టార్స్







ఖైదీలు పారిపోకుండా 'జైలర్'గా కాపు కాస్తున్నారు హీరో రజనీకాంత్. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా రూపొందుతున్న చిత్రం 'జైలర్'. ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్, మోహన్‌లాల్, సునీల్, జాకీష్రాఫ్, రమ్యకృష్ణ, తమన్నా కీ రోల్స్ చేస్తున్నారు. శివరాజ్‌కుమార్, మోహన్‌లాల్ ఖైదీల్లా కనిపిస్తారట. ఈ చిత్రం కోసం చెన్నైలోని ఓ స్టూడియోలో జైలు సెట్‌ను వేసి, ఓ భారీ షెడ్యూల్‌ను చిత్రీకరించారు. ఇక కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా ఫిల్మ్ 'ఘోస్ట్'. ఈ సినిమా కథ మేజర్‌గా జైలులోనే సాగుతుంది. జైలు సీన్స్ కోసం దాదాపు 6 కోట్ల రూపాయలతో సెట్ వేశారు. ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్ ఖైదీ పాత్రలో కనిపిస్తారని టాక్. శ్రీని దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. అలాగే నాగచైతన్య హీరోగా వెంకట్‌ప్రభు దర్శకత్వంలో 'కస్టడీ' సినిమా సెట్స్‌పై ఉన్న సంగతి తెలిసిందే. ఇందులో కృతీ శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. నాగచైతన్య పోలీసాఫీసర్‌గా నటిస్తుండగా, నేరం మోపబడిన ఖైదీ పాత్రలో కనిపిస్తారట కృతి. ఇక బాలీవుడ్‌లోనూ జైలు కథలు ఉన్నాయి. 'మున్నాభాయ్ ఎమ్‌బీబీఎస్' (2004), 'లగే రహో మున్నా భాయ్' (2006) వంటి హిట్ చిత్రాలతో మెప్పించిన సంజయ్ దత్, అర్షద్ వార్సి తాజాగా మరో సినిమా చేస్తున్నారు. జైలు బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రాన్ని దర్శకుడు సిద్ధాంత్ సచ్‌దేవ్ తెరకెక్కిస్తున్నారని ఫస్ట్ లుక్ చెబుతోంది. ఇక తమిళ హిట్ మూవీ 'ఖైదీ' (2019) కొంత జైలు బ్యాక్‌డ్రాప్‌లోనే ఉంటుంది. ఈ సినిమాను హిందీలో అజయ్ దేవగన్ 'భోలా'గా రీమేక్ చేశారు. సో.. ఈ చిత్రం కూడా జైలు, ఖైదీ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుందని ఊహించ వచ్చు. ఈ సినిమాలో నటించడంతో పాటు, దర్శకత్వం కూడా వహించారు అజయ్ దేవగన్. టబు పోలీసాఫీసర్ రోల్ చేసిన ఈ సినిమా మార్చి 30న రిలీజ్ కానుంది. ఇక 'హే సినామిక' చిత్రం తర్వాత కొరియోగ్రాఫర్ బృందా మాస్టర్ డైరెక్ట్ చేసిన మరో ఫిల్మ్ 'థగ్స్'. జైలు బ్యాక్‌డ్రాప్‌లో ఖైదీలు, వారి ఆలోచనల నేపథ్యంలో ఈ సినిమా తీశారు. హ్రిదు, సింహా, ఆర్‌కే సురేష్, మునిష్కంత్ నటించిన ఈ చిత్రం తెలుగులో 'కోనసీమ థగ్స్'గా రిలీజ్ కానుంది. ఇప్పటివరకూ చెప్పిన చిత్రాలు జైలు చుట్టూ తిరుగుతాయి. కాగా మేజర్ బ్యాక్‌డ్రాప్ అని చెప్పలేం కానీ కమల్‌హాసన్ 'ఇండియన్ 2', అల్లు అర్జున్ 'పుష్ప: ది రూల్', రవితేజ 'టైగర్ నాగేశ్వరరావు', 'రావణాసుర' చిత్రాల్లో కొన్ని జైలు సీన్స్ ఉన్నట్లు తెలిసింది. ఇవే కాదు.. చెరసాల చుట్టూ తిరిగే చిత్రాలు ఇంకొన్ని రానున్నాయి.

మళ్లీ వాయిదా



సమంత

'శాకుంతలం' సినిమా ప్రేక్షకుల ముందుకు ఆలస్యంగా రానుంది. గుణశేఖర్ దర్శకత్వంలో సమంత, దేవ్ మోహన్ లీడ్ రోల్స్‌లో 'దిల్' రాజు సమర్పణలో నీలిమ గుణ ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రాన్ని ముందు గత ఏడాది నవంబరు 4న విడుదల చేయాలనుకున్నారు. అయితే 3డీ విజువల్ ఎక్స్‌పీరియన్స్, వీఎఫ్‌ఎక్స్ (గ్రాఫిక్స్) పనులు పూర్తి కాని కారణంగా ఈ ఏడాది ఫిబ్రవరి 17కి వాయిదా వేశారు. కానీ 17న కూడా 'శాకుంతలం' థియేటర్స్‌కి కావడం లేదు. విడుదల వాయిదా వేస్తున్నామని, కొత్త తేదీని త్వరలో ప్రకటిస్తామని చిత్ర యూనిట్ ప్రకటించింది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం రిలీజ్ కానుంది.

యాక్షన్ థ్రిల్లర్



సుదీప్

సుదీప్, అమలాపాల్ జంటగా ఎస్. కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'హెబ్బులి'. కన్నడలో సూపర్ హిట్టయిన ఈ చిత్రం తెలుగులో విడుదల కానుంది. ఎమ్. మోహన శివకుమార్ సమర్పణలో సి. సుబ్రహ్మణ్యం ఈ నెల 25న ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ట్రైలర్‌ను నిర్మాత సి. కల్యాణ్ రిలీజ్ చేయగా, మొదటి పాటను నిర్మాత ప్రసన్న కుమార్, రెండవ పాటని ప్రొడ్యూసర్ తుమ్మలపల్లి సత్యనారాయణ విడుదల చేశారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ– ''యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'హెబ్బులి'. కన్నడలో మంచి వసూళ్లు సాధించిన ఈ చిత్రాన్ని ఫ్యాన్సీ రేటు ఇచ్చి తెలుగులో డబ్ చేసి, రిలీజ్ చేస్తున్నాను'' అన్నారు. డిస్ట్రిబ్యూటర్ బాపిరాజు, నిర్మాత సురేష్ కొండేటి మాట్లాడారు.

కొత్త సినిమా షురూ



సిద్ధు జొన్నలగడ్డ

సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించనున్న కొత్త సినిమా షురూ అయింది. మంగళవారం (ఫిబ్రవరి 7) సిద్ధు జొన్నలగడ్డ బర్త్ డే సందర్భంగా ఈ సినిమాను ప్రకటించారు. సిద్ధు కెరీర్‌లో 8వ సినిమాగా తెరకెక్కనున్న ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించనున్నారు. ఈ సినిమాతో వైష్ణవి దర్శకురాలిగా పరిచయం కానున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే వెల్లడికానున్నాయి.

ముక్కోణపు ప్రేమకథ

కిరణ్ అబ్బవరం, కశ్మీరా పర్దేశీ జంటగా మురళీ కిశోర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ'. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్ వేడుకను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హీరో సాయిధరమ్ తేజ్ 'వినరో భాగ్యము విష్ణు కథ' ట్రైలర్‌ను లాంచ్ చేసి, సినిమా ఘనవిజయం సాధించాలని ఆకాంక్షించారు. ''దర్శన (కశ్మీర) అనే అమ్మాయి నుండి వచ్చిన ఫోన్ కాల్ ద్వారా విష్ణు (కిరణ్) విధి ఎలా మారింది? చివరికి ఆమె అతన్ని ఎలా చేరుకుంది? అన్నది ఆసక్తిగా ఉంటుంది. ఈ ముక్కోణపు ప్రేమకథలో చక్కని ప్రేమ, వినోదం వంటి వాణిజ్య అంశాలున్నాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ వేడుకలో అల్లు అరవింద్, బన్నీ వాసు, దర్శకులు హరీష్ శంకర్, మారుతి తదితరులు పాల్గొన్నారు.



కిరణ్ అబ్బవరం, సాయి ధరమ్‌తేజ్

మాట ఇస్తున్నా! – శివ రాజ్‌కుమార్



శివ రాజ్‌కుమార్, గీత

''నాన్నగారు (కన్నడ స్టార్ రాజ్‌కుమార్), ఎన్టీఆర్, నాగేశ్వర రావు, శివాజీ గణేశన్, ఎంజీఆర్‌సార్లు బ్రదర్స్‌లా ఉండేవాళ్లు. ఆ వారసత్వాన్ని తర్వాతి తరంలో మేం ముందుకు తీసుకెళుతున్నాం. తారకరత్నగారిని వెళ్లి చూశాను. త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను'' అన్నారు కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్. ఆయన నటించిన 125వ కన్నడ చిత్రం 'వేద'. ఎ. హర్ష దర్శకత్వంలో శివ రాజ్‌కుమార్ భార్య గీత నిర్మించిన ఈ సినిమాని 'శివ వేద' పేరుతో వీఆర్ కృష్ణ మండపాటి ఈ నెల 9న తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో శివ రాజ్‌కుమార్ మాట్లాడుతూ–''ఈ సినిమాలో యాక్షన్, ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్, మంచి సందేశం ఉన్నాయి. నా తర్వాతి చిత్రాలను కన్నడతో పాటు తెలుగు, తమిళ్, హిందీ భాషల్లోనూ ఒకేసారి విడుదల చేస్తానని మాట ఇస్తున్నా'' అన్నారు.

ఏడడుగులు వేశారు



కియారా, సిద్ధార్థ్



ప్రేమికులు సిద్ధార్థ్ మల్హోత్రా, కియారా అద్వానీ మిస్టర్ అండ్ మిసెస్‌గా మారారు. ఫిబ్రవరి ఏడున ఈ జంట ఏడడుగులు వేశారు. మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. ఇరు కుటుంబ సభ్యులు, సినీ పరిశ్రమకు చెందిన కొందరు ప్రముఖుల సమక్షంలో వీరి వివాహం జరిగింది. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో గల సూర్యగఢ్ ప్యాలెస్ వేదికగా వివాహ వేడుక జరిగింది. హీరో షాహిద్ కపూర్, దర్శక–నిర్మాత కరణ్ జోహార్, డిజైనర్ మనీష్ మల్హోత్రా తదితరులు హాజరైనట్లు సమాచారం. పెళ్లికి ముందు రోజు హల్దీ, సంగీత్ తదితర వేడుకలు జరిపారు. కాగా సిద్ధార్థ కియారా స్వయంగా సోషల్ మీడియా ద్వారా తమ పెళ్లి ఫోటోలను షేర్ చేశారు.

దేశం కోసం సిద్ధం



రవీంద్ర గోపాల్

'అన్నల రాజ్యం, నాగమ నాయుడు, రాఘవేంద్ర మహత్యం' వంటి చిత్రాలు నిర్మించిన రవీంద్ర గోపాల్ లీడ్ రోల్‌లో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'దేశం కోసం'. ఈ నెల 10న ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో అతిథిగా పాల్గొన్న నిర్మాత సి. కల్యాణ్ మాట్లాడుతూ– ''దేశం మీద ప్రేమ ఉన్నవారు ఈ చిత్రం తప్పకుండా చూడాలి'' అన్నారు. ''ఈ సినిమాలో 14 మంది స్వాతంత్య్ర సమర యోధుల పాత్రలు చేశాను'' అన్నారు రవీంద్ర గోపాల్.

మహిళలందరూ చూడాల్సిన సినిమా – సుమ



సుహాస్
సుమ

'రైటర్ పద్మభూషణ్' చిత్రాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎంపిక చేసిన 39 థియేటర్స్‌లో బుధవారం ఉచితంగా చూసే అవకాశాన్ని మహిళలకు కల్పిస్తున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. సుహాస్, టీనా శిల్పరాజ్ జంటగా షణ్ముఖ ప్రశాంత్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రైటర్ పద్మభూషణ్'. జి. మనోహర్ సమర్పణలో అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర, చంద్రు మనోహర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన 'ది స్వీట్ సర్‌ప్రైజ్ రివీల్' ప్రెస్‌మీట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన యాంకర్ సుమ మాట్లాడుతూ– ''మహిళల కోసమే 'రైటర్ పద్మభూషణ్' తీశారు. ఈ సినిమాని తప్పకుండా చూడండి. కచ్చితంగా కనెక్ట్ అవుతారు. ఇందులో వినోదం, సందేశం ఉన్నాయి'' అన్నారు. ''నేడు నాలుగు షోలని మహిళలకు ఉచితంగా చూపిస్తున్నాం. 'రైటర్ పద్మభూషణ్' పెద్ద బ్లాక్ బస్టర్ అయ్యింది'' అన్నారు శరత్ చంద్ర, అనురాగ్ రెడ్డి. ''మహిళలందరూ వచ్చి సినిమాని చూసి మమ్మల్ని ఆశీర్వదించాలి'' అన్నారు సుహాస్. ''ప్రేక్షకులు మాపై చూపిస్తున్న ప్రేమకి ఇది చిరు కానుక'' అన్నారు షణ్ముఖ ప్రశాంత్.

సాక్షి **బిజినెస్**
బుధవారం
8-2-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
221	43
60,286	17,722

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	12,052	△	165
డోజోన్స్	34,011	△	172
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,865	△	28
డాక్స్	15,321	▽	25
షాంఘై	3,248	△	9
నికాయ్	27,685	▽	8

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారెట్)		
58,882	▽	90
బంగారం (22 క్యారెట్)		
58,646	▽	90
వెండి (కేజీ)		
71,576	▽	472

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటికి	81.90	83.57
£	బ్రిటన్ పౌండ్	ఒకటికి	87.29	90.40
€	యూరో	ఒకటికి	98.02	101.35
¥	జపాన్ ఎన్ (100)	ఒకటికి	61.53	63.54
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటికి	56.30	58.68
S$	సింగపూర్ డాలర్	ఒకటికి	61.39	63.40
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.06	22.73
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.62	23.41
¥	చైనా యువాన్	పదింటికి	11.06	13.14

కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓగా సత్యనారాయణ రాజు



బెంగళూరు: కెనరా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓగా (ఎండీ, సీఈఓ) కే సత్యనారాయణ రాజు నియమితులయ్యారు. తక్షణం అమల్లోకి వచ్చేలా ఈ నియామకం జరిగినట్లు బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. గతేడాది డిసెంబర్ 31న బాధ్యతలు విరమించిన ఎల్‌వీ ప్రభాకర్ స్థానంలో ఈ నియామకం జరిగింది. ఆయన 2021 మార్చి నుంచి కెనరా బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఫిజిక్స్ గ్రాడ్యుయేట్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బ్యాంకింగ్, ఫైనాన్స్) పోస్ట్ గ్రాడ్యుయేట్ అయిన రాజు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకర్స్ సర్టిఫైడ్ అసోసియేట్ (సీఏఐఐబీ) కూడా కావడం గమనార్హం.

మరింత వ్యాపార వృద్ధిపై పతంజలి ఫుడ్స్ దృష్టి

హైదరాబాద్: పతంజలి ఫుడ్స్ మరింత వ్యాపారాభివృద్ధిపై దృష్టి పెట్టింది. డిసెంబర్ క్వార్టర్‌లో సాధించిన వ్యాపార, ఆర్థిక వృద్ధిని భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని తెలిపింది. సాంకేతికత, బహుళ అంచెల పంపిణీ వ్యవస్థలో విరివిగా పెట్టుబడులు పెట్టి సేల్స్ టీమ్ సామర్థ్యాన్ని, పంపిణీదారుల ద్వారా అమ్మకాలను మరింత పెంచుకుంటామని పేర్కొంది. ప్రీమియం, నూతన ఉత్పత్తుల ఆవిష్కరణ ద్వారా కొత్త కస్టమర్లకు చేరువ కావాలని భావిస్తోంది. విక్రయాల వృద్ధి లక్ష్య సాధనకు పంపిణీ ఛానెల్‌ను బలోపేతం చేయడంతో పాటు అన్ని రకాల ధరల్లో ఉత్పత్తులను ప్రవేశపెట్టింది. తద్వారా మూడో క్వార్టర్ అక్టోబర్‌లో ఒక నెలలో అత్యధికంగా 1.5 లక్షల మెట్రిక్ టన్నుల వంట నూనె, వనస్పతి అమ్మకాలు జరిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-2-2023	
విశాఖ	460-00
చిత్తూరు	473-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	445-00
విజయవాడ	445-00
రిటైల్ ధర (డజను)	72.00
7-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	415-00
వరంగల్	417-00
రిటైల్ ధర	4.75

అదానీ పోర్ట్స్ లాభం డౌన్

క్యూ3లో రూ. 1,337 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022-23) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 13 శాతం క్షీణించి రూ. 1,337 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2021-22) ఇదే కాలంలో రూ. 1,535 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 4,713 కోట్ల నుంచి రూ. 5,051 కోట్లకు పుంజుకుంది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 2,924 కోట్ల నుంచి రూ. 3,507 కోట్లకు పెరిగాయి. కాగా.. పూర్తి ఏడాదికి రూ. 14,500-15,000 కోట్ల నిర్వహణ లాభం లక్ష్యంగా పెట్టుకున్నట్లు కంపెనీ సీఈవో కరణ్ అదానీ పేర్కొన్నారు. రూ. 4,000-4,500 కోట్ల పెట్టుబడి వ్య య అంచనాల మధ్య రూ. 5,000 కోట్ల రుణ చెల్లింపులను చేపట్టే వీలున్నట్లు వెల్లడించారు. తద్వారా 2024 మార్చికల్లా ఇబిటా నికర రుణ నిష్పత్తి 2.5కు చేరే అవకాశమున్నట్లు తెలియజేశారు.



ఫలితాల నేపథ్యంలో అదానీ పోర్ట్స్ షేరు ఎన్ఎస్ఈలో 2 శాతం బలపడి రూ. 556 వద్ద ముగిసింది.

అదానీ గ్రీన్ లాభం హైజంప్

క్యూ3లో రూ. 103 కోట్లు

న్యూఢిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం (2022-23) మూడో త్రైమాసికంలో అదానీ గ్రీన్ ఎనర్జీ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం రెట్టింపునకుపైగా ఎగసి రూ.103 కోట్లను తాకింది. గతేడాది ఇదే కాలంలో రూ.49 కోట్లు మాత్రమే ఆర్జించింది. ఆదాయం సైతం రూ. 1,471 కోట్ల నుంచి రూ. 2,258 కోట్లకు జంప్ చేసింది. ఈ ఏడాది మార్చికల్లా 8,300 మెగావాట్ల నిర్వహణా సామర్థ్యాన్ని అందుకోనున్నట్లు కంపెనీ వెల్లడించింది. కొత్తగా ప్రారంభమైన 1,440 మెగావాట్ల సోలార్, విండ్ హైబ్రిడ్ ప్లాంట్లు బైఫేషియల్ పీవీ మాడ్యూల్ తదితర ఆధునిక సాంకేతికతలతో ఏర్పాటైనట్లు పేర్కొంది.



ఫలితాల నేపథ్యంలో అదానీ గ్రీన్ షేరు ఎన్ఎస్ఈలో 5 శాతం పతనమై రూ. 845 వద్ద ముగిసింది.

అంబుజా సిమెంట్స్ లాభం అప్

క్యూ3లో రూ. 488 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం అంబుజా సిమెంట్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 13 శాతం పుంజుకుని రూ. 488 కోట్లకు చేరింది. గతేడాది(2021-22) ఇదే కాలంలో రూ. 431 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం స్వల్పంగా 4 శాతం బలపడి రూ. 7,907 కోట్లను తాకింది. గతేడాది క్యూ3లో రూ. 7,625 కోట్ల టర్నోవర్ నమోదైంది. అయితే మొత్తం వ్యయాలు 6 శాతం పెరిగి రూ. 7,279 కోట్లకు పెరిగాయి. 51 శాతం వాటా గల అనుబంధ సంస్థ ఏసీసీ పనితీరు సైతం ఫలితాలలో కలసి ఉన్నట్లు అంబుజా పేర్కొంది. కాగా.. ప్రస్తుత క్యూ3లో అంబుజా స్టాండెలోన్ నికర లాభం 46 శాతం జంప్‌చేసి రూ. 369 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం 10 శాతంపైగా ఎగసి రూ. 4,129 కోట్లకు చేరింది. అమ్మకాల పరిమాణం 12 శాతం వృద్ధితో 7.7 మిలియన్ టన్నులుగా నమోదైంది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 3.5 శాతం తక్కువగా 13.7 ఎంటీ అమ్మకాలు సాధించింది.

ఫలితాల నేపథ్యంలో అంబుజా సిమెంట్స్ షేరు బీఎస్ఈలో 1.2% బలపడి 384 వద్ద ముగిసింది.

మార్కెట్లో పాలసీ అప్రమత్తత

- ఐటీ, ఆటో, మెటల్ షేర్ల డీలా
- సూచీలకు రెండోరోజూ నష్టాలే
- సెన్సెక్స్ 221 పాయింట్ల పతనం



ముంబై: ఐటీ, ఆటో, మెటల్ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో స్టాక్ సూచీలు రెండోరోజూ నష్టాలను చవిచూశాయి. ఎకనామిక్ క్లబ్ ఆఫ్ వాషింగ్టన్‌లో ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ ప్రసంగం(మంగళవారం రాత్రి), ఆర్‌బీఐ ద్రవ్య పాలసీ నిర్ణయాలు వెల్లడి(బుధవారం) పరిణామాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. మిశ్రమ అంతర్జాతీయ సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం ఫ్లాటుగా మొదలయ్యాయి. సెన్సెక్స్ నాలుగు పాయింట్ల స్వల్ప లాభంతో 60,511 వద్ద, నిఫ్టీ 25 పాయింట్లు పెరిగి 17,790 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. తొలి సెషన్‌లో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తూ ఎఫ్ఎంజీసీ, ఆటో, ఐటీ, మెటల్ షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. దీంతో సెన్సెక్స్ 444 పాయింట్లు నష్టపోయి 60,063 వద్ద, నిఫ్టీ 113 పాయింట్లు క్షీణించి 17,652 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. అయితే మిడ్ సెషన్ తర్వాత ఫైనాన్స్, బ్యాంకింగ్ షేర్లకు డిమాండ్ లభించడంతో సూచీలు కొంతమేర నష్టాలను భర్తీ చేసుకోగలిగాయి. మార్కెట్ ముగిసే సరికి సెన్సెక్స్ 221 పాయింట్లు నష్టపోయి 60,286 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 43 పాయింట్లు పతనంతో 17,722 వద్ద నిలిచింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2560 కోట్ల షేర్లను అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.640 కోట్ల షేర్లను కొన్నారు. యూఎస్ జాబ్ డేటా అంచనాలకు మించి నమోదవడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి

మార్కెట్లో మరిన్ని సంగతులు

- హిండెన్‌బర్గ్ నివేదికతో గత పది సెషన్ల నుంచి పతనాన్ని చూస్తున్న అదానీ గ్రూప్ కంపెనీ షేర్లు మంగళవారం మిశ్రమంగా ముగిశాయి. అత్యధికంగా అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు 15% ర్యాలీ చేసింది. అదానీ విల్మార్ 5%, అదానీ పోర్ట్స్, అంబుజా సిమెంట్స్, ఏసీసీ సిమెంట్స్, ఎన్‌డీటీవీ షేర్లు ఒకశాతం వరకు లాభపడింది.
- క్యూ3లో నికర నష్టాలు తగ్గడంతో పేటీఎం షేరుకు రెండోరోజూ డిమాండ్ లభించింది. ట్రేడింగ్‌లో 20% ఎగిసి రూ.670 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. లాభాల స్వీకరణతో చివరికి 6% పెరిగి రూ.589 వద్ద ముగిసింది.
- టాటా స్టీల్ షేరు ఐదు శాతం నష్టపోయి రూ.111 వద్ద స్థిరపడింది.

ఎయిర్‌టెల్ లాభం 92% జూమ్

- క్యూ3లో రూ. 1,588 కోట్లు
- రూ. 193కు ఏఆర్‌పీయూ



న్యూఢిల్లీ: మొబైల్ టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ ఈ ఆర్థిక సంవత్సరం(2022-23) మూడో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 92 శాతం జంప్‌చేసి రూ. 1,588 కోట్లను తాకింది. గతేడాది(2021-22) ఇదే కాలంలో కేవలం రూ. 830 కోట్లు ఆర్జించింది. అనుకోని వ్యయాలకు ముందు నికర లాభం 147 శాతం అధికంగా రూ. 1,994 కోట్లకు చేరినట్లు వెల్లడించింది. కాగా.. మొత్తం ఆదాయం సైతం 20 శాతం పుంజుకుని రూ. 35,804 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 29,867 కోట్ల టర్నోవర్ నమోదైంది. మొత్తం పెట్టుబడి వ్యయాలు 52 శాతం పెరిగి రూ. 9,314 కోట్లకు చేరాయి. దేశీయంగా 5జీ నెట్‌వర్క్ ప్రారంభానికి ప్రధానంగా నిధులు వెచ్చించింది. దీంతో ఫ్రీ క్యాష్‌ఫ్లోలు 12% తగ్గి రూ. 5,071 కోట్లకు పరిమితమయ్యాయి. ఆదాయంలో దేశీ విభాగం వాటా 19% వృద్ధితో రూ. 24,962 కోట్లను తాకగా.. పెట్టుబడి వ్యయాలు 74% ఎగసి రూ. 8,095 కోట్లకు చేరాయి.

కొత్త కస్టమర్లు అప్

అన్ని విభాగాల్లోనూ మరోసారి నిలకడైన పటిష్ట పనితీరు చూపినట్లు ఎయిర్‌టెల్ ఎండీ గోపాల్ విఠల్ తెలియజేశారు. ఇబిటా మార్జిన్లు 52 శాతానికి మెరుగుపడినట్లు పేర్కొన్నారు. నాణ్యమైన కస్టమర్లను పొందే వ్యూహాల కారణంగా 4జీ విభాగంలో 6.4 మిలియన్ల మంది కొత్తగా జత కలసినట్లు వెల్లడించారు. మొబైల్ సేవల ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) రూ. 193కు బలపడినట్లు తెలియజేశారు. గత క్యూ3లో రూ. 163 మాత్రమేనని ప్రస్తావించారు. 5జీ సేవల విస్తరణ కొనసాగుతున్నదని, 2024 మార్చికల్లా అన్ని కీలక పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలోనూ సేవలందిస్తామని తెలియజేశారు.

ఇతర విశేషాలు

- గ్లోబల్ కస్టమర్ల సంఖ్య 5.8 శాతం వృద్ధితో 51 కోట్లకు చేరింది. దీనిలో దేశీ కస్టమర్ల సంఖ్య 36.92 కోట్లు.
- దేశీ మొబైల్ యూజర్ల సంఖ్య 33.22 కోట్లు కాగా.. 1.8 కోట్లమంది పోస్ట్‌పెయిడ్ కస్టమర్లు.
- 4జీ డేటా కస్టమర్ల సంఖ్య 11% పెరిగి 21.67 కోట్లకు చేరింది. నెలవారీ సగటు డేటా వినియోగం 20.29 జీబీ.
- క్యూ3కల్లా నికర రుణ భారం 32 శాతం పెరిగి రూ. 2.09 లక్షల కోట్లుగా నమోదైంది.

కల్యాణ్ జ్యువెలర్స్ లాభం ప్లస్

క్యూ3లో రూ. 148 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022-23) మూడో త్రైమాసికంలో కల్యాణ్ జ్యువెలర్స్ పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 10 శాతంపైగా ఎగసి రూ. 148 కోట్లను అధిగమించింది. గతేడాది(2021-22) ఇదే కాలంలో దాదాపు రూ. 135 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 13 శాతం బలపడి రూ. 3,884 కోట్లను తాకింది. గతేడాది క్యూ3లో రూ. 3,435 కోట్ల టర్నోవర్ నమోదైంది. దేశీ కార్యకలాపాల నిర్వహణ లాభం(ఇబిటా) రూ. 253 కోట్ల నుంచి రూ. 276 కోట్లకు వృద్ధి చూపింది.

రామ్‌కో సిమెంట్స్ లాభం క్షీణత

క్యూ3లో రూ. 51 కోట్లు



న్యూఢిల్లీ: రామ్‌కో సిమెంట్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022-23) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 32% క్షీణించి రూ. 51 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2021-22) ఇదే కాలంలో రూ. 75 కోట్లు ఆర్జించింది. పెరిగిన ఇంధన ధరలు ప్రభావం చూపాయి. మొత్తం ఆదాయం మాత్రం 30% ఎగసి రూ.2,020 కోట్లను అధిగమించింది. గతేడాది క్యూ3లో రూ.1,559 కోట్ల టర్నోవర్ నమోదైంది.

భవిత

- ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

చిత్తూరు జిల్లాలో బ్యాక్‌లాగ్ పోస్టులు

చిత్తూరు జిల్లా సెలక్షన్ కమిటీ(డీఎస్సీ) 2022-23 సంవత్సరానికి సంబంధించి చిత్తూరు జిల్లాలో రిజర్వ్ చేసిన బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 06
- **పోస్టుల వివరాలు:** మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్(మేల్)-01, టర్న్ కాక్-01, ఫౌండేషన్ క్లీనర్-01, బోర్ వెల్ క్లీనర్-01, వాచ్‌మెన్-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. ఇంటర్మీడియట్, ఎంపీహెచ్ఏ(ఎం) కోర్సు, ఇంటర్ ఒకేషనల్ (ఎంపీహెచ్‌డబ్ల్యూఎం), డిప్లొమా(సివిల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 52 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** వయసు, వైకల్యం తీవ్రత, ఎంప్లాయ్‌మెంట్ సీనియారిటీ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును వ్యక్తిగతంగా అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, అంబేద్కర్ భవన్, న్యూ కలెక్టరేట్, చిత్తూరులో అందజేయాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 09.02.2023.
- **వెబ్‌సైట్:** chittoor.ap.gov.in

చిత్తూరు జిల్లాలో టైపిస్ట్ పోస్టులు

చిత్తూరు జిల్లా సెలక్షన్ కమిటీ(డీఎస్సీ).. 2022-23 సంవత్సరానికి సంబంధించి చిత్తూరు జిల్లాలో రిజర్వ్ చేసిన బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి దివ్యాంగుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
- **అర్హత:** ఏదైనా డిగ్రీతోపాటు తెలుగులో టైప్‌రైటింగ్ హయ్యర్ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 53 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును వ్యక్తిగతంగా అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, అంబేద్కర్ భవన్, న్యూ కలెక్టరేట్, చిత్తూరులో అందజేయాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 09.02.2023.
- **వెబ్‌సైట్:** chittoor.ap.gov.in

హెచ్ఎంటీ, హైదరాబాద్‌లో ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టులు

హైదరాబాద్‌లోని హెచ్ఎంటీ మెషిన్ టూల్ లిమిటెడ్(హెచ్ఎంటీ).. ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 09
- **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ డిప్యూటీ ఇంజనీర్(మెకానికల్)-03, ప్రాజెక్ట్ డిప్యూటీ ఇంజనీర్(ఎలక్ట్రికల్)-03, ప్రాజెక్ట్ ఆఫీసర్(హెచ్ఆర్)-01, ప్రాజెక్ట్ ఆఫీసర్ (ఫైనాన్స్)-01, ప్రాజెక్ట్ ఆఫీసర్(లీగల్)-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్/ఎల్ఎల్‌బీ/సీఏ/సీఎంఏ/ఐసీడబ్ల్యూఏ/ఎంబీఏ/ఎంహెచ్ఆర్ఎం/పీజీడీఎం ఉత్తీర్ణులవ్వాలి. కనీసం 2ఏళ్ల పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 32 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** పర్సనల్ ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జనరల్ మేనేజర్(హెచ్)హెచ్ఎంటీ మెషిన్‌టూల్స్ లిమిటెడ్, హెచ్ఎంటీ టౌన్‌షిప్ పీఓ, నర్సాపూర్ రోడ్, హైదరాబాద్‌వ-500054, తెలంగాణ చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 25.02.2023
- **వెబ్‌సైట్:** www.hmtmachinetools.com

డీఎంహెచ్‌వో, విజయనగరం జిల్లాలో వివిధ ఉద్యోగాలు

విజయనగరం జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం, పార్వతీపురంలో తాత్కాలిక ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 03
- **పోస్టుల వివరాలు:** ఆడియాలజిస్ట్ అండ్ స్పీచ్ థెరపిస్ట్-01, డెంటల్ టెక్నీషియన్-02.
- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ(స్పీచ్ అండ్ లాంగ్వేజ్ పాథాలజీ), డెంటల్ టెక్నీషియన్ కోర్సు సర్టిఫికేట్ ఉండాలి. వయసు: 42 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు ఆడియాలజిస్ట్ రూ.30,000, డెంటల్ టెక్నీషియన్‌కి రూ.18,000 ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం, విజయనగరం చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 10.02.2023.
- **వెబ్‌సైట్:** www.vizianagaram.nic.in

గ్రూప్-3కి.. సిద్ధమవ్వండిలా!

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ).. మొత్తం 1,363 గ్రూప్ 3 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. బ్యాచిలర్ డిగ్రీతో ఈ పోస్టులకు పోటీ పడొచ్చు. పోటీ తీవ్రంగా ఉండే గ్రూప్ 3 వంటి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే.. ప్రణాళికాబద్ధ ప్రిపరేషన్ తప్పనిసరి. ఈ నేపథ్యంలో.. గ్రూప్-3 పోస్టుల వివరాలు, పరీక్ష విధానం, ప్రిపరేషన్ గైడెన్స్..

» 1,363 గ్రూప్-3 పోస్టుల భర్తీకి రంగం సిద్ధం
» ప్రారంభమైన దరఖాస్తు ప్రక్రియ
» రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా నియామకాలు
» ప్రణాళికాబద్ధ ప్రిపరేషన్‌తో సక్సెస్ అంటున్న నిపుణులు



టీఎస్‌పీఎస్సీ జాబ్స్

ప్రభుత్వ ఉద్యోగాలంటే.. పోటీ తీవ్రం. గ్రూప్-3 అందుకు మినహాయింపు ఏమీ కాదు. అంతేకాకుండా 1363 పోస్టులకు గ్రూప్-1, గ్రూప్2, సివిల్స్ అభ్యర్థులు సైతం పోటీ పడే అవకాశం ఉంది. కాబట్టి అభ్యర్థులు ఈ పరీక్షలో విజయానికి పక్కా ప్రణాళికతో ప్రిపరేషన్ సాగించాలి అంటున్నారు నిపుణులు.

అర్హతలు

ఒకట్రెండ్ పోస్టులకు తప్ప మిగతా అన్ని పోస్టులకు బ్యాచిలర్ డిగ్రీ అర్హతగా పోటీ పడే అవకాశముంది. వయసు: 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా

అన్ని పోస్టులకు రాత పరీక్షలో అభ్యర్థులు చూపిన ప్రతిభ ఆధారంగా.. నియామకాలు ఖరారు చేస్తారు. రాత పరీక్షను ఓఎంఆర్ షీట్ విధానంలోనే నిర్వహించే అవకాశం ఉంది.

రాత పరీక్ష మూడు పేపర్లుగా

• గ్రూప్-3 సర్వీసులకు నిర్వహించే రాత పరీక్ష మూడు పేపర్లుగా మొత్తం 450 మార్కులకు ఉంటుంది. • పేపర్ 1 జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్-150 ప్రశ్నలు-150 మార్కులకు నిర్వహిస్తారు. • పేపర్ 2 హిస్టరీ, పాలిటీ అండ్ సొసైటీ అంశాలపై 150 ప్రశ్నలు-150 మార్కులకు పరీక్ష ఉంటుంది. •పేపర్ 3 ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్‌పై 150 ప్రశ్నలు-150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. •పేపర్-2,3లలో ప్రతి పేపర్‌లోనూ మూడు అం శాలు ఉంటాయి. ఒక్కో అంశం నుంచి 50 ప్రశ్నలు చొప్పున 150 ప్రశ్నలతో పేపర్ ఉంటుంది.

విజయం సాధించాలంటే

గ్రూప్-3 పరీక్షలో విజయం సాధించాలంటే.. అభ్యర్థులు పేపర్ వారీగా నిర్దిష్ట వ్యూహంతో ముందుకు సాగాలి.

పేపర్-1: జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్

ఈ పేపర్‌కు సంబంధించి.. కరెంట్ అఫైర్స్, ఇంటర్నేషనల్ రిలేషన్స్ అండ్ ఈవెంట్స్ కు ప్రాధాన్యం ఇవ్వాలి. అంతర్జాతీయ పరిణామాలకు సంబంధించి భారతదేశ ప్రమేయం, అదే విధంగా భారత్‌పై ప్రభావం చూపే అవకాశం ఉన్న అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. హిస్టరీలో ఆయా సంఘటనలు,అవి చోటు చేసుకున్న సంవత్సరాలపై పట్టు సాధించాలి. అదే విధంగా చరిత్రలో ముఖ్యమైన ఘట్టాలకు దారితీసిన యుద్ధాలు, పరిస్థితులపై ప్రత్యేక అవగాహన పెంచుకోవాలి. భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలోని ముఖ్యమైన ఉద్యమాల గురించి తెలుసుకోవాలి. పాలిటీకి సంబంధించి.. రాజ్యాంగం, రాజ్యాంగ పీఠిక, ముఖ్యమైన ఆర్టికల్స్, సవరణలను అధ్యయనం చేయాలి. ఎకానమీ కోసం బేసిక్ అంశాలతోపాటు ఇటీవల కాలంలో ఆర్థిక విధానాలు, అభివృద్ధి కారక పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, లబ్ధిదారులు, పథకాల లక్ష్యం వంటి అంశాలను అధ్యయనం చేయాలి. సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి బేసిక్ సైన్స్ అంశాలతోపాటు నిజ జీవితంలో సైన్స్ అండ్ టెక్నాలజీ పాత్ర, ఇటీవల కాలంలో ఈ రంగంలో తాజా పరిణామాలు, వాటి వల్ల ప్రయోజనాలు వంటి వాటిపై పట్టు సాధించాలి. జాగ్రఫీలో భౌగోళికంగా ప్రాధాన్యం సంతరించుకున్న ప్రాంతాలు, ఖనిజ వనరులు, సహజ వనరులు, నదీ తీర ప్రాంతాలు, అడవులు-రకాలు, పంటలు-అవి ఎక్కువగా పండే ప్రాంతాలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి. జనరల్ ఎబిలిటీలో రాణించేందుకు దత్తాంశాల విశ్లేషణ, టేబుల్స్, గ్రాఫ్స్‌ను పరిశీలించి.. వాటిలోని ముఖ్యాంశాలను గుర్తించే విధంగా అధ్యయనం చేయాలి.

పేపర్-2 కోసం ఇలా

- హిస్టరీ, పాలిటీ, అండ్ సొసైటీ అంశాలున్న పేపర్-2 కోసం ప్రత్యేకంగా చదవాలి. ముఖ్యంగా తెలంగాణ హిస్టరీ కోసం తెలంగాణ చరిత్ర, సంస్కృతి, కవులు, కళలు; ముఖ్యంగా మధ్యయుగ చరిత్ర, శాతవాహనులు, కాకతీయులు, కుతుబ్ షాహీలు, అసఫ్‌జాహీలు, సాయుధ రైతాంగ పోరాటం తదితర అంశాలను క్షుణ్నంగా చదవాలి.
- పాలిటీ విభాగానికి సంబంధించి.. భారత రాజ్యాంగం, ప్రధాన చట్టాలపై పట్టు సాధించాలి. అధికరణలు, సవరణల గురించి పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, ప్రభుత్వ వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, సమాఖ్య వ్యవస్థలపై అవగాహన పెంచుకోవాలి. వీటితో పాటు రాజ్యాంగ పరమైన సంస్థలు(ఉదా: యూపీఎస్సీ, ఎలక్షన్ కమిషన్, కాగ్, ఆర్థిక సంఘం తదితర), వాటి విధుల గురించి తెలుసుకోవాలి. గ్రూప్-3 అభ్యర్థులు వీలైనంత ఎక్కువగా రాజ్యాంగంపై పట్టు సాధించాలి.
- సమాజ నిర్మాణం, సమస్యలు,ప్రజా విధానాలకు సంబంధించి జాతీయ, రాష్ట్ర స్థాయిలో సమస్యలు, ప్రభుత్వ విధానాల గురించి తెలుసుకోవాలి. ఆయా వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం రూపొందిస్తున్న నూతన పాలసీలపై పట్టు సాధించాలి.

పేపర్-3 కోసం

ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ అంశాలుండే పేపర్-3 కోసం దేశ, రాష్ట్ర ఆర్థిక విధానాలపై సంపూర్ణ అవగాహన ఏర్పరచుకోవాలి. తెలంగాణ పాలసీలపై పట్టు పెంచుకోవాలి. రాష్ట్రంలో ఆయా వర్గాల కోసం అమలు చేస్తున్న నూతన విధానాలపై అవగాహన పెంచుకోవాలి. వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, గిరిజనులకు సంబంధించి తెచ్చిన పథకాల గురించి తెలుసుకోవాలి. జాతీయ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి కోర్ ఎకానమీ అంశాలు మొదలు.. తాజా ఆర్థిక విధానాల వరకూ.. అన్నింటినీ క్షుణ్నంగా అధ్యయనం చేయాలి.బడ్జెట్ గణాంకాలు, ఆర్థిక సర్వే గణాంకాలపై పట్టు సాధించాలి.

అనుసంధానం

గ్రూప్-3 అభ్యర్థులు గ్రూప్-1, 2, 4లతో అనుసంధానం చేసుకుంటూ.. ప్రిపరేషన్ సాగించొచ్చు. ముఖ్యంగా గ్రూప్-3 అభ్యర్థుల్లో ఎక్కువ మంది గ్రూప్-2కు కూడా పోటీ పడుతున్నారు. వీరికి కలిసొచ్చే అంశం రెండు పరీక్షలకు సంబంధించి సిలబస్ ఒకే విధంగా ఉండడం. గ్రూప్-2లోని నాలుగో పేపర్‌ను మినహాయిస్తే.. మిగతా అన్ని పేపర్లు రెండు సర్వీసుల్లోనూ ఒకే రకంగా ఉన్నాయి. దీంతో ఆయా అంశాలను సమ్మిళితం చేసుకుంటూ..ఒకే సమయంలో గ్రూప్-3తోపాటు గ్రూప్-2కు కూడా పోటీ పడే అవకాశం ఉంది.

మెటీరియల్ ముఖ్యం

గ్రూప్-3 అభ్యర్థులు పుస్తకాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రామాణిక పుస్తకాలను చదివే ప్రయత్నం చేయాలి. సిలబస్‌పై స్పష్టత తెచ్చుకున్నాక.. అన్ని అంశాలున్న పుస్తకాలను అన్వేషించి.. వాటి ద్వారా ప్రిపరేషన్‌కు ఉపక్రమించాలి. ప్రధానంగా తెలంగాణ ఉద్యమ దశలకు సంబంధించి ప్రత్యేక దృష్టితో ప్రిపరేషన్ సాగించాలి. అకాడమీ పుస్తకాలు, బ్యాచిలర్ డిగ్రీ స్థాయి చరిత్ర పుస్తకాలను చదవాలి.

విశ్లేషణాత్మక అధ్యయనం

గ్రూప్-3 పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. కాని ప్రిపరేషన్‌లో మాత్రం అభ్యర్థులు విశ్లేషణాత్మక అధ్యయనం సాగించాలి. ఆయా అంశాలను డిస్క్రిప్టివ్ విధానంలో చదువుతూ.. సిలబస్ అంశాలపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలి. అభ్యర్థులు ప్రతి రోజు ప్రతి సబ్జెక్ట్ చదివేలా సమయ పాలన పాటించాలి.

కోర్ టు కాంటెంపరరీ

ఆయా సిలబస్ అంశాలను చదివేటప్పుడు.. వాటికి సంబంధించి కోర్ అంశాలతోపాటు కాంటెంపరరీ పరిణామాలను అనుసంధానం చేసుకుంటూ చదవాలి. ఒక టాపిక్‌కు సంబంధించి నిర్వచనం మొదలు తాజా పరిణామాల వరకూ..సమగ్ర అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా పరీక్షలో విజయం కోసం నిర్ణయాత్మక సామర్థ్యం, సమస్య పరిష్కార నైపుణ్యం పెంచుకోవాలి. దీనివల్ల ఆబ్జెక్టివ్‌తోపాటు డిస్క్రిప్టివ్ విధానంపైగా అవగాహన పొందే అవకాశం లభిస్తుంది. అదే విధంగా నిర్దిష్టంగా ఒక టాపిక్‌ను వాస్తవ పరిస్థితుల్లో అన్వయించే విధంగా చదవాలి.

సొంత నోట్స్

అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలో ఆయా విభాగాలకు సంబంధించి ముఖ్యమైన అంశాలను పాయింట్ల వారీగా నోట్స్ తయారు చేసుకోవాలి. మతాలు, సామాజిక వర్గాలు, గిరిజన సమస్యలు, ప్రాంతీయ సమస్యలు వంటి స్థానిక అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా ఒక అంశాన్ని చదివేటప్పుడు అన్ని కోణాల్లో అధ్యయనం చేయాలి. ఉదాహరణకు సామాజిక వర్గాలనే పరిగణనలోకి తీసుకుంటే.. ఆ వర్గాల నిర్వచనానికే పరిమితం కాకుండా.. వాటి ఆవిర్భావ చరిత్ర, విస్తరణ, తాజా పరిస్థితులు.. ఇలా అన్నింటినీ చదవాలి. అప్పుడే ఒక అంశంపై సంపూర్ణ అవగాహన ఏర్పడుతుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ విధానం ద్వారా.
- దరఖాస్తులకు చివరి తేదీ: ఫిబ్రవరి 23, 2023
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.tspsc.gov.in

క్లుప్తంగా...

రాబర్ట్ లాంగర్‌కు జినోమ్‌వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డు



సాక్షి, హైదరాబాద్: కోవిడ్ నియంత్రణకు ఎంఆర్ఎన్ఏ టీకాను అభివృద్ధి చేసిన మొడెర్నా సహ వ్యవస్థాపకుడు రాబర్ట్ ఎస్.లాంగర్ ఈ ఏడాదికిగాను జినోమ్‌వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 24 నుంచి 26 మధ్య హైదరాబాద్‌లో జరగనున్న 20వ బయో ఆసియా సదస్సులో ఆయనకు ఈ అవార్డు అందించనున్నట్లు బయో ఆసియా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలోని డేవిడ్ హెచ్.కోచ్ ఇన్‌స్టిట్యూట్ అధ్యాపకుడైన రాబర్ట్ ఎస్.లాంగర్... వ్యాధుల చికిత్సకు మందులను నియంత్రిత పద్ధతుల్లో అందించే వ్యవస్థలను అభివృద్ధి చేశారు. వాటిని ప్రస్తుతం కేన్సర్ సహా పలు రకాల వ్యాధుల చికిత్సకు ఉపయోగిస్తున్నారు. లాంగర్ ల్యాబ్స్ డైరెక్టర్‌గా ఆయన చేసిన పరిశోధనల కారణంగానే తొలి ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్ తయారైంది. 2010లో లాంగర్ స్థాపించిన కంపెనీ మొడెర్నా కోవిడ్–19 నియంత్రణకు టీకా తయారు చేయడం తెలిసిందే. క్వీన్ ఎలిజబెత్ ప్రైజ్ ఫర్ ఇంజినీరింగ్‌తోపాటు అనేక ఇతర అవార్డులను అందుకున్న రాబర్ట్ ఎస్.లాంగర్ ఇప్పటివరకూ దాదాపు 1,500 పరిశోధన వ్యాసాలను ప్రచురించారు. జినోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డుకు రాబర్ట్ ఎస్.లాంగర్ అన్ని విధాలుగా అర్హుడని, ఆయన పరిశోధనలు రానున్న కాలంలోనూ సమాజంపై ప్రభావం చూపనున్నాయని తెలంగాణ మున్సిపల్, పరిశ్రమల శాఖల మంత్రి కల్వకుంట్ల తారక రామారావు వ్యాఖ్యానించారు.



పర్వత ప్రాంతాల్లో పెరిగే ఔషధ మొక్కలపై ఉమ్మడిగా పరిశోధనలు సాగించేందుకు యూనివర్సిటీ ఆఫ్ లద్దాఖ్, హైదరాబాద్‌కు చెందిన సీఎస్ఐఆర్‌–ఐఐసీటీ ముందుకొచ్చాయి. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో కుదిరిన అవగాహన ఒప్పందంపై లద్దాఖ్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ వీకే మెహతా సీఎస్ఐఆర్‌–ఐఐసీటీ డైరెక్టర్ డి.శ్రీనివాసరెడ్డి సంతకాలు చేశారు.

10న చెన్నైకి కవిత



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈనెల 10న చెన్నైలో పర్యటించనున్నారు. ఓ ప్రఖ్యాత సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమంలో ''2024 ఎన్నికలు – ఎవరు విజయం సాధిస్తారు ?''అనే అంశంపై జరిగే చర్చా వేదికలో ఆమె పాల్గొంటారు. ఈ చర్చా వేదికలో ఎమ్మెల్సీ కవితతో పాటు డీఎంకే ఎంపీ తిరుచి శివ, తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై, బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు ఎమ్మెల్యే వాసంతి శ్రీనివాసన్, కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ వల్లభ్ పాల్గొననున్నారు. బీఆర్ఎస్ జాతీయ ఎజెండా, దేశాభివృద్ధిపై సీఎం కేసీఆర్ ఆలోచనలను ఈ వేదిక ద్వారా కవిత పంచుకోను న్నారు. రైతుబంధు, దళిత బంధు, రైతు బీమా వంటి పథకాల ప్రాముఖ్యత గురించి ప్రసంగించాలని భావిస్తున్నట్లు సమాచారం. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర వార్షిక బడ్జెట్ వల్ల సామాజికంగా ఒనగూరే ప్రయోజనాలతో పాటు గ్రామీణ ఆర్థికవ్యవస్థ పై చూపించే సానుకూలతల గురించి వివరించనున్నారు.

నైటింగేల్ నర్సింగ్ కాలేజీలో అడ్మిషన్లకు అనుమతి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ హుమయూన్‌నగర్‌లోని నైటింగేల్ నర్సింగ్ కాలేజీలో 2022–23 ఏడాదికి మూడేళ్ల జనరల్ నర్సింగ్, మిడ్‌వైఫరీ కోర్సుల అడ్మిషన్లను 2 వారాల్లోగా పూర్తి చేయాలని హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌కు జస్టిస్ ఎస్.నందా ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. నర్సింగ్ కోర్సుల అడ్మిషన్లు చేపట్టే నోటిఫికేషన్‌లో తమ కాలేజీ లేకపోవడంతో నైటింగేల్ హైకోర్టులో రిట్ దాఖలు చేసింది. దీనిపై హైకోర్టు.. కాలేజీ పర్మిషన్లు రద్దు చేయకుండా అడ్మిషన్లు ఆపడానికి వీల్లేదని తేల్చింది. హైకోర్టు సూచనల మేరకు రెండోసారి తనిఖీ చేసిన ఆఫీసర్లు ఇచ్చిన రిపోర్టును పరిశీలించి అడ్మిషన్ల అనుమతి కోసం నోటిఫికేషన్ గడువును పెంచింది.

11న 'మనుస్మృతి' ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్ : 'ప్రాచీన భారత రాజ్యాంగం – శిక్షాస్మృతి అయిన 'మనుస్మృతి'గ్రంథాన్ని ఈ నెల11న ఆవిష్కరించనున్నట్టు వేద ధర్మ ప్రచార ట్రస్టు అధ్యక్షురాలు మర్రి రాధాదేవి మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. డాక్టర్ మర్రి కృష్ణారెడ్డి తెలుగులోకి అనువదించిన ఈ గ్రంథాన్ని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో బృహద్విసహస్రావధాని డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ ఆవిష్కరిస్తారన్నారు. ప్రభుత్వ సలహాదారులు కె.వి.రమణాచారి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ఏపీ పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్.వి. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొంటారు.

మీ ల్యాప్‌టాప్ లేదా కంప్యూటర్ ఉన్నట్టుండి ఆగిపోతోందా? విపరీతంగా వేడెక్కి సక్రమంగా పనిచేయడం లేదా? లోపలున్న ఫ్యాన్లు, హీట్ సింక్‌లతో ప్రయోజనం ఉండట్లేదా? ఈ ప్రశ్నలన్నింటికీ మీరు అవునని జవాబు చెబుతుంటే ఈ కథనం మీ కోసమే. ఎందుకంటే.. ఫ్యాన్ల అవసరమే లేకుండా ఓ భారతీయ అమెరికన్... పీసీ, ల్యాప్‌టాప్‌లను చల్లబరిచేందుకు ఓ వినూత్న టెక్నాలజీని ఆవిష్కరించాడు కాబట్టి!



కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లకూ.. వేడికి అవినాభావ సంబంధం ఉంది. అవి పనిచేస్తుంటే ప్రాసెసర్ వేడెక్కుతూ ఉంటుంది. ఎప్పటికప్పుడు ఆ వేడిని తొలగించకపోతే పీసీ, ల్యాప్‌టాప్‌ల పని సామర్థ్యం తగ్గడమే కాకుండా కొన్ని సందర్భాల్లో లోపలి సర్క్యూట్లు కాలిపోవచ్చు. ఈ సమస్యలను అధిగమించేందుకు తొలినాళ్ల నుంచి ఫ్యాన్లు ఉపయోగిస్తుండగా ఇటీవలి కాలంలో హీట్ సింకుల్లాంటివి ఏర్పాటు చేస్తున్నారు. కానీ వాటితో ప్రయోజనం అంతంతగానే ఉంటోంది. ఈ నేపథ్యంలోనే అమెరికా స్టార్టప్ సంస్థ ఫ్రోర్ సిస్టమ్స్ గత నెలలో జరిగిన కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ షోలో ప్రదర్శించిన ఎయిర్‌జెట్ టెక్నాలజీ ఆధారిత పరికరం అందరి దృష్టిని ఆకర్షించింది. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది కూడా ఒక చిప్‌లాంటిదే. కాకపోతే వేడిని తొలగించేందుకే ఉపయోగపడుతుంది. కొన్ని ఎయిర్‌జెట్ చిప్‌లను కంప్యూటర్/ల్యాప్‌టాప్‌లలో ఏర్పాటు చేసుకుంటే అత్యంత సమర్థంగా వేడిని తొలగించుకోవచ్చని ఇండియన్‌–అమెరికన్, ఫ్రోర్ సంస్థ సీఈవో డాక్టర్ మాధవపెద్ది శేషు చెబుతున్నారు. డాక్టర్ సూర్య పి. గంటితో కలసి ఆయన ఫ్రోర్ సిస్టమ్స్‌ను స్థాపించారు.



ఎం.శేషు, గంటి సూర్య



వేడి పెరిగితే సమస్య ఏమిటి?

వేడిని ఎప్పటికప్పుడు తొలగించకపోతే కంప్యూటర్ల సామర్థ్యం తగ్గిపోతుంది. అన్ని రకాల ఎలక్ట్రానిక్ పరికరాల్లోనూ మైక్రోప్రాసెసర్లు ఉపయోగిస్తున్నాం. వాటి వేగం పెరిగిన ప్రతిసారీ అవి ఉత్పత్తి చేసే వేడి కూడా ఎక్కువ అవుతుంది. నిపుణుల అంచనాల ప్రకారం ఇది గరిష్ఠంగా 70 శాతం వరకూ ఉండవచ్చు. పైగా 13 అంగుళాల సైజుండే అత్యాధునిక 4.8 గిగాహెర్ట్జ్ ప్రాసెసర్ నోట్‌బుక్ 56 వాట్ల విద్యుత్ ఖర్చు చేస్తోంది. దీనివల్ల ఎక్కువవుతున్న వేడిని ఫ్యాన్లు, హీట్‌సింక్, పైపుల్లాంటివి తొలగించలేవు. ఫలితంగా ప్రాసెసర్లు కాలిపోకుండా వాటి వేగాన్ని తగ్గించేలా కంపెనీలు ఏర్పాట్లు చేశాయి.

ప్రపంచంలోనే తొలిసారి వినూత్న పరిష్కారం

వేడి సమస్యను ఎదుర్కొనేందుకు ఫ్రోర్ సిస్టమ్స్ సిద్ధం చేసిన ఎయిర్‌జెట్ టెక్నాలజీ ప్రపంచంలోనే తొలి సాలిడ్ స్టేట్ కూలింగ్ టెక్నాలజీ. ఇందులో రెండు పొరలుంటాయి. పైనున్న పొరలో సూక్ష్మ రంధ్రాలు ఏర్పాటు చేశారు. కింద రాగితో చేసిన పొర ఉంటుంది. రెండింటికీ మధ్యలో కంపించే త్వచాల్లాంటివి ఉంటాయి. ఈ వైబ్రేటింగ్ మెంబ్రేన్స్ వేడిని గ్రహించినప్పుడు వేగంగా కంపిస్తాయి. ఫలితంగా అక్కడున్న వేడిగాలి ఒత్తిడికి గురై కిందనున్న రాగిపొర వద్దకు చేరుకుంటుంది. కొంత వేడిని ఈ రాగిపొర గ్రహిస్తుంది...మిగిలిన వేడిగాలి చిప్‌కు గొట్టంలాంటి ఏర్పాటు ద్వారా బయటకు ప్రయాణిస్తుంది. ఫ్యాన్లు చేసే పనే ఇక్కడ మెమ్స్ మెంబ్రేన్స్ చేస్తున్నాయన్నమాట.

ప్రత్యేకతలెన్నో..

ఎయిర్‌జెట్ టెక్నాలజీతో ఇప్పుడు రెండు చిప్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఎయిర్‌జెట్ మినీ కేవలం 270 మిల్లీమీటర్ల వెడల్పు, 41.5 మిల్లీమీటర్ల పొడవు, 2.8 మిల్లీమీటర్ల ఎత్తు ఉంటుంది. కానీ ఒకే ఒక్క వాట్ విద్యుత్‌ను వాడుకుంటూ ఇది 5.25 వాట్లకు సరిపడా వేడిని తొలగించగలదు. కొంచెం పెద్దదైన ఎయిర్‌జెట్ ప్రో 31.5 మి.మీ. వెడల్పు, 71.5 మి.మీ. పొడవు ఉంటుంది. ఇది వాడే విద్యుత్ 1.75 వాట్లు కాగా.. తొలగించగల వేడి 10.75 వాట్లకు సరిపడా ఉంటుంది. ఈ రెండు చిప్‌ల నుంచి వెలువడే శబ్దం దాదాపుగా శూన్యమనే చెప్పాలి. ఎందుకంటే ఇవి గరిష్ఠంగా 24 డెసిబెల్స్ స్థాయిలోనే శబ్దం చేస్తాయి. వీటి బరువు 13 నుంచి 22 గ్రాముల మధ్యే ఉండటం విశేషం. 13 అంగుళాల నోట్‌బుక్‌లో 4 ఎయిర్‌జెట్ మినీలను ఉపయోగిస్తే మైక్రోప్రాసెసర్ సామర్థ్యం 100 %వరకూ పెరుగుతుందని, 15 అంగుళాల నోట్‌బుక్‌లో 3 ఎయిర్‌జెట్ ప్రోలను వాడటం ద్వారా సామర్థ్యం 50% పెంచవచ్చని కంపెనీ చెబుతోంది. ఈ పరికరాలు డస్ట్ ప్రూఫ్ కావడం వీటి ప్రత్యేకత.

క్యూ కడుతున్న దిగ్గజ సంస్థలు..

ఫ్రోర్ సిస్టమ్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్న మైక్రోప్రాసెసర్ల తయారీ సంస్థ ఇంటెల్... భవిష్యత్తులో తాము తయారు చేయబోయే ల్యాప్‌టాప్‌లలో ఎయిర్‌జెట్ సాంకేతికతను ఉపయోగిస్తామని ప్రకటించింది. క్వాల్‌కాం... ఫ్రోర్ సిస్టమ్స్‌లో పెట్టుబడులు పెట్టింది. ప్రపంచంలోని 10 చిప్ తయారీ సంస్థల్లో ఐదు సంస్థలు ఇప్పటికే ఫ్రోర్ సిస్టమ్స్‌తో జట్టుకట్టాయి. అయితే ఎయిర్‌జెట్ మినీ, ప్రో ఇంకా ఉత్పత్తి దశలోనే ఉన్నందున వాటి ధరల వివరాలు తెలియరాలేదు. – సాక్షి, హైదరాబాద్

ముందస్తు నోటీసులిచ్చిన తర్వాతే
ఏసీడీ వసూలు!

వినియోగదారులకు 30 రోజుల నోటీసు ఇవ్వాలి

- డిస్కంలకు విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశం
- తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో దిద్దుబాటు చర్యలు

సాక్షి, హైదరాబాద్: నిబంధనల ప్రకారం 30 రోజుల ముందస్తు నోటీసులు జారీ చేసిన తర్వాతే విద్యుత్ వినియోగదారుల నుంచి ముందస్తు వినియోగ ధరావతు (ఏసీడీ) వసూలు చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ) ఆదేశించింది. అప్పటి వరకు ఏసీడీ చార్జీల వసూళ్లను నిలుపుదల చేయాలని స్పష్టం చేసింది. వినియోగదారులకు స్పష్టంగా అర్థమయ్యే రీతిలో ఏసీడీ చార్జీల లెక్కలను నోటీసుల్లో పొందుపర్చాలని సూచించింది. ఈ మేరకు రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు తాజాగా ఈఆర్సీ మార్గదర్శకాలను జారీ చేసింది. ➡ ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎన్పీడీసీఎల్) భారీ మొత్తంలో ఏసీడీ చార్జీలు వసూలు చేస్తోందని వ్యతిరేకత రావడంతో ఈఆర్సీ దిద్దుబాటు చర్యలను చేపట్టింది. వినియోగదారుడి వార్షిక విద్యుత్ వినియోగం ఎంత? అందులో రెండు నెలల సగటు వినియోగం ఎంత? ఈ మేరకు వినియోగానికి చెల్లించాల్సిన డిపాజిట్ ఎంత? ఇప్పటికే డిస్కం వద్ద ఉన్న ఆ వినియోగదారుడి డిపాజిట్ మొత్తాన్ని సర్దుబాటు చేశాక చెల్లించాల్సిన అదనపు వినియోగ డిపాజిట్ ఎంత? .. వంటి లెక్కలను నోటీసుల్లో పొందుపర్చాలని కోరింది. ఇప్పటి వరకు నోటీసులు లేకుండానే ఏసీడీ చార్జీలు వసూలు చేసిన నేపథ్యంలో ఆ వినియోగదారులకు సైతం నోటీసులు జారీ చేయాలని కోరింది. ➡ విద్యుత్ నియంత్రణ మండలి జారీ చేసిన రెగ్యులేషన్ 6, 2004 ప్రకారం ఉత్తర తెలంగాణలోని ఐదు ఉమ్మడి జిల్లాల్లో గత రెండు నెలలుగా ఏసీడీ చార్జీలను టీఎస్ఎన్పీడీసీఎల్ విధిస్తోంది.

నిబంధనలకు వ్యతిరేకమని విమర్శలు..

ఏపీఈఆర్సీ జారీ చేసిన రెగ్యులేషన్ 6, 2004 ప్రకారం డిస్కంలు వినియోగదారుల నుంచి అదనపు సెక్యూరిటీ డిపాజిట్ (ఏఎస్డీ) వసూలు చేసుకోవచ్చు. గృహ వినియోగదారులకు కొత్తగా కనెక్షన్ ఇచ్చేటప్పుడు ఏఎస్డీ కింద కిలోవాట్‌కు రూ.80 నుంచి రూ.300 వరకు వసూలు చేస్తారు. కనెక్షన్ ఇచ్చిన తర్వాత ఏడాదిపాటు వినియోగదారుడి సగటు విద్యుత్తు వినియోగాన్ని లెక్కగట్టి రెండు నెలల సగటు మొత్తాన్ని ఏఎస్డీ చార్జీల రూపంలో మరోసారి వసూలు చేసుకోవచ్చు. ఆపై ప్రతీ ఏటా ఆ ఏడాది సగటు వినియోగాన్ని, అంతకు ముందు ఏడాది సగటుతో పోల్చి చూసి, అదనంగా జరిగిన సగటు వినియోగానికి మాత్రమే ఏఎస్డీ చార్జీలు వసూలు చేస్తారు. ఈ చార్జీలు డిపాజిట్ రూపంలో వినియోగదారుల పేరుమీదనే విద్యుత్ సంస్థల వద్ద ఉంటాయి. ఈ రెగ్యులేషన్ జారీ చేసిన 19 ఏళ్ల తర్వాత ఏఎస్డీకి బదులు ఏసీడీ చార్జీల పేరుతో టీఎస్ఎన్పీడీసీఎల్ వసూళ్లను ప్రారంభించింది. విద్యుత్ చట్టం, ఈఆర్సీ రెగ్యులేషన్లలో ఎక్కడా ఏసీడీ చార్జీల ప్రస్తావన లేనందున, వీటిని వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధమని విద్యుత్ రంగ నిపుణులు విమర్శిస్తున్నారు.

ఒకే రాష్ట్రం.. వేర్వేరు చార్జీలు

ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాలకు రెండు వేర్వేరు డిస్కంలు విద్యుత్ సరఫరా చేస్తున్నా ఏకరూప చార్జీలు అమల్లో ఉన్నాయి. కొత్తగా ఉత్తర తెలంగాణ జిల్లాల గృహ వినియోగదారులపై ఏసీడీ చార్జీలను విధిస్తుండటంతో ఒకే రాష్ట్రంలో వేర్వేరు విధానాలను అమలుచేస్తున్న విచిత్ర పరిస్థితి. ఇప్పటివరకు ఏఎస్డీ చార్జీలను కమర్షియల్, పరిశ్రమల వర్గాల నుంచి మాత్రమే వసూలు చేసేవారు.

ముందస్తు నోటీసులివ్వకపోవడం తప్పే

- ఏసీడీ చార్జీలతో ప్రభుత్వానికి సంబంధం లేదు
- ఈఆర్సీ చైర్మన్ తన్నీరు శ్రీరంగారావు



మంచిర్యాల అగ్రికల్చర్: ముందస్తు వినియోగ ధరావతు (ఏసీడీ) చార్జీల వసూలులో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని, ఈఆర్సీ అనుమతితోనే విద్యుత్ సంస్థ వినియోగదారుల నుంచి వసూలు చేస్తోందని ఈఆర్సీ చైర్మన్ తన్నీరు శ్రీరంగారావు స్పష్టం చేశారు. మంచిర్యాలలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జిల్లా విద్యుత్ వినియోగదారులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వినియోగదారులకు ముందస్తు నోటీసులు ఇవ్వకపోవడం విద్యుత్ సంస్థ తప్పేనన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే రైతులు రవాణా, మరమ్మతు చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆలస్యమైనప్పుడు సొంతంగా తీసుకొస్తే చార్జీల కింద సంస్థ రూ.700 చెల్లిస్తుందని వెల్లడించారు.

మే 7 నుంచి ఎంసెట్

- తర్వాత వరుసగా ఇతర సెట్లు
- తేదీలను ప్రకటించిన మంత్రి సబిత
- త్వరలో నోటిఫికేషన్లు

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష టీఎస్ ఎంసెట్–2023ను మే 7న నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇంజనీరింగ్ ఎంసెట్‌ను మే 7 నుంచి 11 వరకు, అగ్రికల్చర్, ఫార్మసీ ఎంసెట్‌ను మే 12 నుంచి 14 వరకు నిర్వహించనున్నారు. ఈ ఏడాది కూడా ఎంసెట్‌ను జేఎన్‌టీయూహెచ్ నిర్వహిస్తోంది. ఎంసెట్ సహా వివిధ ప్రవేశ పరీక్షల తేదీలను విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మంగళవారం తన కార్యాలయంలో ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వి.వెంకటరమణ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సెట్స్‌కు సంబంధించిన దరఖాస్తు తేదీలు, ఫీజుల వివరాలతో కూడిన వివరణాత్మక నోటిఫికేషన్‌లను సంబంధిత సెట్ల కన్వీనర్లు త్వరలో విడుదల చేస్తారని మంత్రి తెలిపారు.

	సెట్	నిర్వహించే యూనివర్సిటీ	పరీక్ష తేదీ
రాష్ట్రంలో నిర్వహించే వివిధ ఉమ్మడి ప్రవేశ పరీక్షల షెడ్యూల్ ఇదీ..	ఎంసెట్ (ఇంజనీరింగ్)	జేఎన్‌టీయూహెచ్	7.5.23-11.5.23
	ఎంసెట్ (అగ్రికల్చర్, ఫార్మసీ)	జేఎన్‌టీయూహెచ్	12.5.23-14.5.23
	టీఎస్ ఎడ్యుకేషన్ సెట్	మహాత్మాగాంధీ	18.5.23
	టీఎస్ ఈసెట్	ఉస్మానియా	20.5.23
	టీఎస్ లాసెట్	ఉస్మానియా	25.5.23
	టీఎస్ పీజీ సెట్	ఉస్మానియా	25.5.23
	టీఎస్ ఐసెట్	కాకతీయ	26, 27.5.23
	టీఎస్ పీజీఈసెట్	జేఎన్‌టీయూహెచ్	29.5.23

కాజీపేటలో రైల్ వ్యాగన్ల తయారీ

- పీఓహెచ్ స్థాయి పెంచేందుకు కేంద్రం నిర్ణయం
- యూనిట్ అంచనా వ్యయం రూ.521 కోట్లకు పెంపు
- దేశంలోనే ప్రభుత్వ పరంగా రెండో యూనిట్

సాక్షి, హైదరాబాద్: కాజీపేటకు మంజూరు కావాల్సిన కోచ్ ఫ్యాక్టరీని కేంద్రం ఎగ్గొట్టిందని రాజకీయంగా తీవ్ర దుమారం రేగుతున్న సమయంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం కాజీపేటకు మంజూరై పనులు ప్రారంభించుకున్న పీరియాడికల్ ఓవర్‌హాలింగ్ వర్క్‌షాప్ (పీఓహెచ్) స్థాయి పెంచి వ్యాగన్ల తయారీ యూనిట్‌గా మార్చాలని నిర్ణయించింది. వర్క్‌షాప్ అంచనా వ్యయం రూ.269 కోట్లు కాగా, తాజా నిర్ణయంతో దానిని రూ.521 కోట్లకు పెంచారు. ఐదు రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు సమర్పించిన వార్షిక బడ్జెట్‌లో దీని ఊసు లేకపోవటం గమనార్హం. దీంతో బడ్జెట్ తయారీ తర్వాత కేంద్రం దీనిపై నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. కేంద్ర బడ్జెట్ తర్వాత హైదరాబాద్‌కు వచ్చిన రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ దీనికి సంబంధించిన కీలక ప్రకటన చేశారు. ఈ మేరకు గూడ్స్ రైళ్లకు సంబంధించిన వ్యాగన్ల తయారీ యూనిట్ ఏర్పాటుకు రైల్వే బోర్డు చర్యలు ప్రారంభించిందని ఓ సీనియర్ రైల్వే అధికారి 'సాక్షి'తో చెప్పారు.

ఆ వివాదంతోనేనా..

కాజీపేటకు 1980లలో కోచ్ ఫ్యాక్టరీ మంజూరైంది. దాని ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్న సమయంలో నాటి ప్రధాని ఇందిర హత్య జరిగింది. అప్పుడే సిక్కులపై ప్రతీకార దాడులు తీవ్రం కావటంతో పంజాబ్‌లో పరిస్థితి చేయిదాటింది. సిక్కులను చల్లార్చే క్రమంలో కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని పంజాబ్‌లోని కపుర్తలాకు తరలించే నిర్ణయం తీసుకున్నారు. అప్పటినుంచి ఈ డిమాండ్ పెండింగులో ఉండిపోయింది. రాష్ట్ర విభజన సమయంలో దాని ఏర్పాటు సాధ్యాసాధ్యాల పరిశీలనకు కమిటీ వేస్తామన్న కేంద్రం ఆ మేరకు కమిటీ వేసింది. కోచ్ ఫ్యాక్టరీల అవసరం లేదన్న ఆ కమిటీ అభిప్రాయం మేరకు కాజీపేటకు పీరియాడికల్ ఓవర్‌హాలింగ్ వర్క్‌షాప్ మంజూరు చేశారు. ఇది వివాదాస్పదమైన సంగతి తెలిసిందే.

రైల్వేకు ఇది రెండో యూనిట్..

దేశవ్యాప్తంగా రైల్వేకు కోచ్ ఫ్యాక్టరీలు చాలా ప్రాంతాల్లో ఉన్నాయి. కానీ గూడ్సు వ్యాగన్ల తయారీకి ప్రభుత్వరంగ కేంద్రం ఒక్కటే ఉంది. కాగా కాజీపేటలో వ్యాగన్ తయారీ కేంద్రం ఏర్పాటైతే ప్రభుత్వ పరంగా రెండో యూనిట్ అవుతుంది. రైల్వే సొంత యూనిట్‌గా మారుతుంది. పవర్ మెక్–టైకిషా జేవీ అన్న సంస్థ కాజీపేట పీఓహెచ్ టెండర్ దక్కించుకున్న విషయం తెలిసిందే. దానికి కావాల్సిన 160 ఎకరాల భూమికి గాను ఇప్పటివరకు రాష్ట్రప్రభుత్వం 150 ఎకరాలను రైల్వేకు అందజేసింది. దీంతో అక్కడ వర్క్‌షాప్ ఏర్పాటుకు పనులు ప్రారంభమయ్యాయి. కేంద్ర బడ్జెట్‌లో దానికి రూ.160 కోట్లు కేటాయించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి బిజినెస్
గురువారం
9-2-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	378	60,664
నిఫ్టీ ▲	150	17,872

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	11,935	▲	178
డోజోన్స్	33,972	▲	185
ఎఫ్‌టీఎస్ఈ 100	7,885	▲	20
డాక్స్	15,412	▲	91
షాంఘై	3,232	▼	16
నికాయ్	27,402	▼	79

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్)	57,538	▲ 173
బంగారం (22 క్యారెట్)	57,308	▲ 173
వెండి (కిలో)	67,516	▲ 382

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	80.66	84.34
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	86.42	90.89
€	యూరో	ఎస్‌బీఐ	97.51	102.31
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	50.00	76.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.18	59.99
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.06	64.61
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.00	22.68
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.56	23.36
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.04	13.11

బిజినెస్ రీల్

రిలయన్స్ డిజిటల్ స్టోర్లలో శాంసంగ్ గెలాక్సీ ఎస్23 ఫోన్లు



హైదరాబాద్: దక్షిణ కొరియా శాంసంగ్ ఇటీవల మార్కెట్‌లోకి విడుదల చేసిన గెలాక్సీ ఎస్23 ఫోన్లు రిలయన్స్ డిజిటల్ స్టోర్లలో లభిస్తాయని కంపెనీ వెల్లడించింది. ''శాంసంగ్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నందుకు సంతోషిస్తున్నాము. ఈ ఒప్పందం ద్వారా కస్టమర్లకు గెలాక్సీ ఎస్23 సిరీస్ వంటి అత్యాధునిక సాంకేతికత అందించడం గర్వంగా ఉంది'' అని కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ బ్రియాన్ బడే అన్నారు. గెలాక్సీ ఎస్23 కొనుగోలుపై గెలాక్సీ వాచ్4 బ్లూటూత్‌ను రూ.2,999 పొందవచ్చు. గెలాక్సీ ఎస్23 అల్ట్రా కొనుగోలుపై గెలాక్సీ వాచ్4 క్లాసిక్ ఎల్‌టీఈ–గెలాక్సీ బడ్స్‌ను రూ.4999కే లభిస్తుంది.

ఫీనిక్స్ గ్రూప్‌తో టీసీఎస్ భారీ డీల్




ముంబై: దేశీ ఐటీ సేవల దిగ్గజం టీసీఎస్ తాజాగా బ్రిటన్‌కు చెందిన ఫీనిక్స్ గ్రూప్‌నకు వ్యాపార డిజిటలీకరణ సర్వీసులు అందించనుంది. ఇందులో భాగంగా కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ సేవలకు సంబంధించి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ 600 మిలియన్ పౌండ్లు (సుమారు రూ. 5,986 కోట్లు). ఆర్థిక సర్వీసుల సంస్థ ఫీనిక్స్ గ్రూప్‌తో ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఇది కొనసాగింపని టీసీఎస్ తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

9-2-2023	
విశాఖ	460-00
చిత్తూరు	473-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	415-00
విజయవాడ	415-00
రిటైల్ ధర (డజను)	66.00
8-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	415-00
వరంగల్	417-00
రిటైల్ ధర	4.85

వడ్డింపే.. కానీ భారం స్వల్పం!

ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆరుగురు సభ్యుల ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) పాలసీ సమీక్షా సమావేశం అంచనాలకు అనుగుణంగా రెపో రేటును (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు) ఈ సారి పావుశాతమే పెంచింది. దీనితో ఈ రేటు 6.5 శాతానికి చేరింది. ఈ మేరకు బ్యాంకుల గృహ, వాహన, కార్పొరేట్ రుణ రేట్లు పెరగనున్నాయి. గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలో జరిగిన మూడు రోజుల సమావేశ కీలక నిర్ణయాలు బుధవారం వెలువడ్డాయి. ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో గవర్నర్ ఈ విషయాలు వెల్లడించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2023–24) లోక్‌సభలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల ఒకటవ తేదీన ప్రవేశపెట్టిన బడ్జెట్ తర్వాత జరిగిన మొదటి పాలసీ సమీక్ష ఇది.



ఈసారి రెపో రేటు పెంపు 0.25 శాతమే

- 6.5 శాతానికి కీలక రేటు
- గృహ, వాహన, కార్పొరేట్ రుణాలు ఆమేరకు 'ప్రియం'
- ద్రవ్యోల్బణం పెరిగితే రేటు పెంపు తప్పదని సంకేతాలు
- 2022–23 ద్రవ్యోల్బణం సగటు 6.5%
- 2023–24లో 5.3% అంచనా

ఆర్థిక వృద్ధి 7%

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) అంచనా 7 శాతంకాగా, 2023–24లో ఇది 6.4 శాతానికి తగ్గుతుంది. అయితే, ఎకానమీ పటిష్టంగా ఉంది. భారీ రబీ విస్తీర్ణం, రుణ విస్తరణ, 2023–24 బడ్జెట్‌లో మూలధన కేటాయింపుల పెంపు వంటి అంశాలు వృద్ధికి మద్దతు నిస్తాయి.

– శక్తికాంత దాస్, ఆర్‌బీఐ గవర్నర్

వరుసగా ఆరవసారి...

ఉక్రెయిన్‌పై రష్యా దాడి, అంతర్జాతీయంగా క్రూడ్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం తీవ్రత నేపథ్యంలో దీర్ఘకాలంగా 4 శాతంగా ఉన్న రెపో రేటు, మే 4వ తేదీన మొదటిసారి 0.40 శాతం పెరిగింది. జూన్ 8, ఆగస్టు 5, సెప్టెంబర్ 30 తేదీల్లో అరశాతం చొప్పున పెరుగుతూ, 5.9 శాతానికి చేరింది. డిసెంబర్ 7న ఈ రేటు పెంపు 0.35 శాతం ఎగసి 6.25 శాతాన్ని తాకింది. వరుసగా ఆరవసారి పెంపుతో మే నుంచి 2.5 శాతం రెపో రేటు పెరిగినట్లయ్యింది. తాజా సమీక్షలో ఆరుగురు ఎంపీసీ సభ్యుల్లో నలుగురు రేటు పెంపునకు ఓటువేయగా, మిగిలిన ఇద్దరు... కఠిన ద్రవ్య విధానం ఉపసంహరణను కోరారు. ద్రవ్యోల్బణం కట్టడిలోకి రావడం దీనికి కారణంగా చూపారు.

క్యూఆర్ కోడ్.. కాయిన్ వెండింగ్ మెషీన్

విధాన నిర్ణయాల ప్రకారం.. నాణేల పంపిణీని పెంచేందుకు క్యూఆర్ కోడ్ ఆధారిత కాయిన్ వెండింగ్ మెషీన్ (క్యూసీవీఎం) కోసం పైలెట్ ప్రాజెక్ట్ 12 నగరాల్లో ప్రారంభించడం జరుగుతుంది. రైల్వే స్టేషన్లు, షాపింగ్ మాల్స్, మార్కెట్ ప్లేస్‌లలో ఈ ప్రాజెక్ట్ అమలవుతుంది. దీనివల్ల నకిలీ నోట్ల బెడదా తగ్గుతుంది.

ద్రవ్యోల్బణం దిగివస్తుంది...



అక్టోబర్ వరకూ గడచిన 10 నెలల్లో రెపో రేటు నిర్ణయానికి ప్రాతిపదిక అయిన వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తున్న ఆరు శాతంపైబడి కొనసాగిన సంగతి గమనార్హం. నవంబర్, డిసెంబర్‌లలో ఇది 6 శాతం దిగువకు చేరింది. ఇది తాజా పాలసీ సమీక్షలో రేటు పెంపు స్పీడ్ తగ్గడానికి కారణమైంది. అయితే ద్రవ్యోల్బణం పెరిగితే రేటు పెంపు అవకాశాలకు తలుపులు తెరిచే ఉంటాయని గవర్నర్ తన విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సగటున 6.5 శాతంగా ఉండే రిటైల్ ద్రవ్యోల్బణం, వచ్చే 2023–24 ఆర్థిక సంవత్సరంలో 5.3 శాతానికి దిగివస్తుందని సమావేశం అంచనా వేసింది. భౌగోళిక ఉద్రిక్తతలు, కమోడిటీ ధరల పెరుగుదల వల్ల ద్రవ్యోల్బణం అవుట్‌లుక్ అస్పష్టంగా ఉందనీ గవర్నర్ పేర్కొన్నారు.

అదానీ గ్రూప్ ప్రభావం వ్యవస్థపై ఉండదు



అదానీ గ్రూప్‌నకు దేశీయ బ్యాంకుల రుణ పరిమాణం 'భారీ ప్రాధాన్యత కలిగినది కాదు''అని ఆర్‌బీఐ పేర్కొంది. ఇలాంటి ఏకైక ఘటన వ్యవస్థపై ఎంతమాత్రం పడబోదని డిప్యూటీ గవర్నర్ ఎంకే జైన్ పేర్కొన్నారు. ఒకే ఒక్క సంఘటన వ్యవస్థను బలహీనపరిచే స్థితిలో భారత్ లేదన్నారు. ''బ్యాంకులు ఆస్తులు తనఖాగా ఉంచుకునే రుణాలు ఇస్తాయి. లిక్విడిటీ, ప్రాజెక్టుల అమలు, వంటి అంశాలను రుణాలకు ప్రాతిపదికగా తీసుకుంటాయి. మార్కెట్ క్యాపిటలైజేషన్ రుణాలకు ప్రాతిపదిక కాదు'' అని అన్నారు.

ఈ-రూపీ ప్రాజెక్ట్ విస్తరణ



రిటైల్ కస్టమర్ల కోసం సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) లేదా ఈ–రూపాయికి సంబంధించిన పైలెట్ ప్రాజెక్టులో మరో ఐదు బ్యాంకులు చేరతాయి. అలాగే ప్రాజెక్ట్‌ను మరో తొమ్మిది నగరాలకు విస్తరించడం జరుగుతుంది. డిసెంబర్‌లో ఐదు నగరాల్లో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్‌లో 8 బ్యాంకులు పాల్గొంటున్నాయి. రిటైల్ సీబీడీసీ ఇప్పుడు 50,000 మంది వినియోగదారులకు మాత్రమే అందుబాటులో ఉంది.

ముఖ్యాంశాలు...

- దేశంలోకి వచ్చీ–పోయే మొత్తం విదేశీ మారకద్రవ్యం మధ్య నికర వ్యత్యాస గణాంకాలకు సంబంధించిన కరెంట్ అకౌంట్ లోటు 2022–23 ఏప్రిల్–సెప్టెంబర్‌లో 3.3 శాతంగా ఉంటే, అక్టోబర్– మార్చి మధ్య తగ్గే వీలుంది.
- 2023 జనవరి 27 నాటికి భారత విదేశీ మారకద్రవ్య నిల్వలు 576.8 బిలియన్ డాలర్లు. దాదాపు 9.4 నెలల దిగుమతులకు ఇవి సరిపోతాయి.
- ఆసియా సహదేశాలతో పోల్చితే భారత్ రూపాయి విలువ 2022లో తక్కువ ఒడిదుడుకులనే చూసింది.
- జీ20 దేశాల నుండి దేశంలోని ఎంపిక చేసిన విమానాశ్రయాలకు వచ్చే ప్రయాణికులు దేశంలో చెల్లింపులు చేయడానికి యూపీఐని వినియోగించడానికి అనుమతి ఇవ్వడం జరిగింది. తరువాత ఈ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ సదుపాయాన్ని అన్ని దేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు విస్తరించాలని కూడా ప్రతిపాదించడం జరిగింది.
- దేశీయ మ్యూచువల్ ఫండ్స్‌లో విదేశీ పెట్టుబడుల పరిమితిని ప్రస్తుత 7 బిలియన్ డాలర్ల నుంచి పెంచే ప్రతిపాదన ప్రస్తుతానికి లేదు.
- తదుపరి పాలసీ సమీక్ష ఏప్రిల్ 3 నుంచి 6వ తేదీ మధ్య జరుగుతుంది.

గృహ కొనుగోళ్లకు ప్రతికూలమే..!



రేటు పెంపు గృహ రుణాలపై వడ్డీ రేట్లు పెరగడానికి దారి తీస్తుంది. దిగువ– మధ్య స్థాయి ఆదాయ వర్గాల నుంచి గృహ వినియోగ డిమాండ్ తగ్గవచ్చు. అయితే ఇది చివరి దఫా రెపో రేటు పెంపు అని భావిస్తున్నాం.

– ప్రాపర్టీ దెవలపర్లు, కన్సల్టెంట్లు

సూచీలకు పాలసీ లాభాలు

- మార్కెట్‌ను మెప్పించిన ఆర్‌బీఐ
- సెన్సెక్స్ 378 పాయింట్లు అప్
- 17,850 స్థాయిపైకి నిఫ్టీ
- రెండురోజుల నష్టాలకు చెక్



ముంబై: ఆర్‌బీఐ రేట్ల పెంపులో దూకుడు తగ్గించడంతో స్టాక్ మార్కెట్ బుధవారం రెండు రోజుల నష్టానికి ముగింపు పలికింది. అదానీ గ్రూప్ షేర్లలో రెండోరోజూ రికవరీ, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో సానుకూల సంకేతాలు కలిసొచ్చాయి. రిలయన్స్, ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లు ఒకశాతం బలపడి సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. సెన్సెక్స్ 47 పాయింట్ల లాభంతో 60,333 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 60,324 కనిష్టాన్ని, 60,792 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 378 పాయింట్ల పెరిగి 60,664 వద్ద స్థిరపడింది. సూచీలో మొత్తం 30షేర్లకుగానూ ఐదు మాత్రమే నష్టపోయాయి. నిఫ్టీ 28 పాయింట్లు పెరిగి 17,750 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 17,744 – 17,899 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 150 పాయింట్లు బలపడి 17,872 వద్ద నిలిచింది. బీఎస్ఈలో రూ.2.56 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.268.60 లక్షల కోట్లకు చేరింది. కాగా, రూపాయి విలువ 21 పైసలు బలపడి 82.50 స్థాయి వద్ద స్థిరపడింది.

రెండింతలైన పెన్నార్ లాభం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంజనీరింగ్ కంపెనీ పెన్నార్ ఇండస్ట్రీస్ డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రెండింతలై రూ.21.12 కోట్లు సాధించింది. ఎబిటా 40.61 శాతం దూసుకెళ్లి రూ.66 కోట్లుగా ఉందని పెన్నార్ కార్పొరేట్ స్ట్రాటజీ వైస్ ప్రెసిడెంట్ కె.ఎం.సునీల్ తెలిపారు. టర్నోవర్ 29.88 శాతం అధికమై రూ.692.22 కోట్లను తాకిందన్నారు. ఏప్రిల్–డిసెంబర్‌లో నికరలాభం రెండింతలకుపైగా పెరిగి రూ.51.58 కోట్లు, ఎబిటా 41% అధికమై రూ.183.87 కోట్లుగా ఉంది. టర్నోవర్ 41.53 శాతం ఎగసి రూ.2,226 కోట్లకు పెరిగింది.

బీఎస్ఈలో షేరు ధర బుధవారం 4.53% అధికమై రూ.57.70 వద్ద స్థిరపడింది.

భవిత

నేవీలో.. విద్య + ఉద్యోగం

10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్‌కు ప్రకటన

ఇంటర్మీడియట్ పూర్తిచేసి రక్షణ రంగంలో కొలువు కోరుకునే వారి కోసం ఇండియన్ నేవీ.. 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్‌కు ప్రకటన విడుదల చేసింది. దీనిలో భాగంగా నేవీలో ఎగ్జిక్యూటివ్ అండ్ టెక్నికల్ బ్రాంచ్, ఎడ్యుకేషన్ బ్రాంచ్ పోస్టులను భర్తీ చేయనుంది. జేఈఈ మెయిన్స్‌లో సాధించిన ర్యాంక్, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూల ద్వారా నియామకాలు చేపడతారు. ఇందులో ఎంపికైన వారికి ఉచిత ఇంజనీరింగ్ విద్యను అందించి ఉద్యోగంలోకి తీసుకుంటారు. శిక్షణ పూర్తిచేసుకున్నవారు సబ్ లెఫ్టినెంట్ హోదాతోపాటు ఆకర్షణీయ వేతనాలు అందుకుంటారు.

నేవీ జాబ్స్

- మొత్తం ఖాళీలు: 35
- ఎగ్జిక్యూటివ్ అండ్ టెక్నికల్ బ్రాంచ్–30, ఎడ్యుకేషన్ బ్రాంచ్–05.

అర్హతలు

- అవివాహిత పురుష అభ్యర్థులు మాత్రమే నేవీ 10+2 కేడెట్ ఎంట్రీ స్కీమ్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. వీరు ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్‌ల్లో 70శాతం మార్కులతో ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఉండాలి. అలాగే పదోతరగతి లేదా ఇంటర్‌లో ఇంగ్లిష్‌లో కనీసం 50 శాతం మార్కులు సాధించాలి. వీటితోపాటు జేఈఈ మెయిన్ -2022లో అర్హత సాధించడం తప్పనిసరి.
- వయసు: జనవరి 02, 2004 నుంచి జులై 01, 2006 మధ్య జన్మించి ఉండాలి.

ఎంపిక ఇలా

జేఈఈ మెయిన్ 2022లో సాధించిన ర్యాంకుతో మెరిట్ ప్రకారం–వచ్చిన దరఖాస్తులను మదింపు చేస్తారు. ఖాళీలకు అనుగుణంగా కొంతమందిని ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తారు. వీరికి సర్వీసెస్ సెలక్షన్ బోర్డు(ఎస్ఎస్‌బీ).. ఐదురోజుల పాటు రెండు దశల్లో బెంగళూరు, భోపాల్, కోల్‌కతా, విశాఖపట్నంలో.. మార్చి నుంచి ఏప్రిల్‌లోపు ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

రెండు దశలు

స్టేజ్–1 పరీక్షలో భాగంగా ఇంటెలిజెన్స్ టెస్టు, పిక్చర్ పెర్సెప్షన్ టెస్టు, గ్రూప్ డిస్కషన్ ఉంటాయి. ఇందులో అర్హత సాధించిన వారికే మిగిలిన 4 రోజులపాటు స్టేజ్–2 ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. దీనిలో భాగంగా సైకలాజికల్ పరీక్షలు, గ్రూప్ పరీక్షలు, మౌఖిక పరీక్ష జరుపుతారు. వీటిలో విజయం సాధించిన వారికి మెడికల్ టెస్టులు ఉంటాయి. అందులోనూ అర్హత సాధించిన వారిని తుది నియామకానికి పరిగణనలోకి తీసుకుంటారు. ఎస్ఎస్‌బీలో సాధించిన మెరిట్ ప్రకారం–అర్హులకు అవకాశం ఇస్తారు. ప్రవేశం పొందిన కోర్సును అనుసరించి వీరికి ఎగ్జిక్యూటివ్ అండ్ టెక్నికల్ లేదా ఎడ్యుకేషన్ బ్రాంచ్ కేటాయిస్తారు.

వేతనం

ఎంపికైన వారికి లెవల్ పే 10 ప్రకారం–ప్రతి నెల రూ.56,100 మూలవేతనంగా లభిస్తుంది. మిలటరీ సర్వీసెస్ పే కింద రూ.15వేలు చెల్లిస్తారు. అంతేకాకుండా డీఏ, హెచ్ఆర్ఏ సహ ఇతర అలవెన్సులను కూడా అందుకోవచ్చు.

శిక్షణ

అభ్యర్థులు ఇంటర్వ్యూలో సాధించిన మార్కులు, ఖాళీలకు అనుగుణంగా ఇండియన్ నేవల్ అకాడెమీ, ఎజిమళ(కేరళ)లో బీటెక్ అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ లేదా మెకానికల్ ఇంజనీరింగ్ లేదా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ కోర్సుల్లోకి తీసుకుంటారు. చదువుతోపాటు ఉచిత భోజనం, స్టడీ మెటీరియల్ అందిస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్న వారికి జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ)–న్యూఢిల్లీ.. ఇంజనీరింగ్ డిగ్రీని ప్రధానం చేస్తుంది.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- దరఖాస్తులకు చివరి తేదీ: ఫిబ్రవరి 12, 2023
- వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిమ్స్, బీబీనగర్‌లో ఫ్యాకల్టీ పోస్టులు

బీబీనగర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 02
- పోస్టుల వివరాలు: ప్రొఫెసర్–01, అసిస్టెంట్ ప్రొఫెసర్–01. • విభాగం: కార్డియాలజీ.
- అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌లో పీజీ డిగ్రీ/ఎండీ/ఎంఎస్/ఎంసీఏహెచ్/డీఎం ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 50 నుంచి 58 ఏళ్లు ఉండాలి.
- వేతనం: నెలకు రూ.1,42,506 నుంచి రూ.2,20,000 చెల్లిస్తారు.
- ఎంపిక విధానం: ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా. • ఇంటర్వ్యూ తేది: 20.02.2023.
- ఇంటర్వ్యూ సమయం: ఉదయం 8.30 నుంచి.
- వెబ్‌సైట్: www.aiimsbibinagar.edu.in

అవుతారా.. ఆర్మీ ఆఫీసర్!

ఇండియన్ ఆర్మీ.. ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్-54వ కోర్సుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనికి ఎంపికైతే.. షార్ట్ సర్వీస్ కమిషన్(నాన్-టెక్నికల్) పద్ధతిలో కొలువు సొంతం చేసుకోవచ్చు. అంతేకాకుండా లెఫ్ట్‌నెంట్ హోదాతో కెరీర్ ప్రారంభించి.. ఆర్మీలో విధులు నిర్వర్తించే అవకాశం లభిస్తుంది. ఈ నేపథ్యంలో.. ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్-54వ కోర్సుకు ఎంపిక ప్రక్రియ, అర్హతలు, శిక్షణ, ఆర్మీలో కెరీర్ తదితర అంశాలపై విశ్లేషణ..

» 55 ఖాళీలతో ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ నోటిఫికేషన్
» ఎన్‌సీసీ–సీ, డిగ్రీ ఉత్తీర్ణతతో పోటీ పడే అవకాశం
» ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే లెఫ్టినెంట్ హోదాతో కెరీర్
» శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 స్టయిఫండ్

ఇండియన్ ఆర్మీ.. త్రివిధ దళాలు అనగానే గుర్తొచ్చే పేరు. ఆర్మీ ఉద్యోగాల కోసం ఏటా లక్షల మంది సన్నద్ధమవుతున్న సంగతి తెలిసిందే. దీనికి అనుగుణంగానే ఇండియన్ ఆర్మీ ఎన్‌డీఏ, సీడీఎస్‌లే కాకుండా..తన సొంత ఎంపిక విధానం ద్వారా పలు నియామకాలు చేపడుతోంది. తాజాగా.. ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్–54వ కోర్సు ద్వారా ఆర్మీలో షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో అర్హులను ఎంపిక చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది.

55 మందికి అవకాశం

ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్–54వ కోర్సు ద్వారా.. షార్ట్ సర్వీస్ కమిషన్ అధికారులుగా 55 మందికి అవకాశం కల్పిస్తారు. ఎన్‌సీసీ–పురుష అభ్యర్థులకు 50, ఎన్‌సీసీ–మహిళా అభ్యర్థులకు 5 పోస్టులను కేటాయించారు. ఈ కోర్సు అక్టోబర్‌లో ప్రారంభం కానుంది.

అర్హతలు

ఎన్‌సీసీ–సి సర్టిఫికెట్ ఎగ్జామ్‌లో బి గ్రేడ్‌తో పాటు 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. అర్హత కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే అక్టోబర్ 1 నాటికి సర్టిఫికెట్ అందించాల్సి ఉంటుంది. వయసు: 19–25 ఏళ్లు ఉండాలి.

ఎస్ఎస్‌బీ ఎంపిక

ముందుగా అభ్యర్థుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి..అంతర్గత నిబంధనలు, కటాఫ్ మార్కులు, రిజర్వేషన్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని.. ఎస్ఎస్‌బీ(సర్వీస్ సెలక్షన్ బోర్డ్) ఎంపిక ప్రక్రియకు జాబితా సిద్ధం చేస్తారు. ఆ తర్వాత అలహాబాద్, భోపాల్, బెంగళూరు, కపుర్తలలోని ఎస్ఎస్‌బీ సెలక్షన్ సెంటర్లలో ఏదో ఒక కేంద్రంలో ఎంపిక ప్రక్రియకు హాజరవ్వాల్సి ఉంటుంది. అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే ఎస్ఎస్‌బీ సెలక్షన్ సెంటర్ ప్రాథమ్యాన్ని పేర్కొనాల్సి ఉంటుంది.

రెండు దశల్లో ఎస్ఎస్‌బీ

అర్హులైన అభ్యర్థులకు నిర్వహించే ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ.. రెండు దశల్లో(స్టేజ్–1, స్టేజ్–2) ఉంటుంది. స్టేజ్–1ను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారిని స్టేజ్–2కు ఎంపిక చేస్తారు. స్టేజ్–2లోనూ చూపిన ప్రతిభ ఆధారంగా తుది విజేతలను ఖరారు చేస్తారు.

అయిదు రోజులు

- ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్‌లో కీలకంగా నిలిచే ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ మొత్తం అయిదు రోజులపాటు రెండు దశల్లో(స్టేజ్–1, స్టేజ్–2) జరుగుతుంది.
- స్టేజ్–1నే స్క్రీనింగ్ టెస్ట్‌గానూ పిలుస్తారు. ఈ దశలో ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ (ఓఐఆర్) టెస్ట్, పిక్చర్ పర్సెప్షన్ టెస్ట్, డిస్కషన్ టెస్ట్‌లు ఉంటాయి.
- ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ టెస్ట్‌ను రెండు పేపర్లలో నిర్వహిస్తారు. వెర్బల్, నాన్–వెర్బల్ రీజనింగ్ టాపిక్స్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థులకు అయిదు రకాలుగా(ఔట్ స్టాండింగ్, ఎక్సలెంట్, ఎబోవ్ యావరేజ్, యావరేజ్, బిలో యావరేజ్) రేటింగ్స్ ఇస్తారు. తర్వాత దశలో నిర్వహించే పిక్చర్ పర్సెప్షన్, డిస్కషన్ టెస్ట్‌లలో పొందిన మార్కులకు ఈ రేటింగ్స్‌ను కూడా కలుపుతారు.
- ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ టెస్ట్ తర్వాత నిర్వహించే పిక్చర్ పర్సెప్షన్ టెస్ట్‌లో ఒక సందర్భం లేదా సన్నివేశానికి సంబంధించిన చిత్రాన్ని 30 సెకన్లపాటు ప్రదర్శించి.. ఆ చిత్రంలోని అంశాల ఆధారంగా అభ్యర్థులు నాలుగు నిమిషాల వ్యవధిలో ఒక చిన్న స్టోరీ రాయాలని పేర్కొంటారు. ఆ చిత్రం ప్రాధాన్యత, అందులో కనిపించిన సన్నివేశం, సందర్భం, ఆ చిత్రం సారాంశం గురించి వివరించాల్సి ఉంటుంది.
- పిక్చర్ పర్‌సెప్షన్ టెస్ట్‌లో.. ప్రతిభ ఆధారంగా విభజించిన బృందాలకు గ్రూప్ డిస్కషన్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో అభ్యర్థులు తాము రాసిన స్టోరీ(వివరణ) గురించి మౌఖికంగా చర్చించాల్సి ఉంటుంది. ప్రతి బృందంలోని అభ్యర్థులందరూ ఆ చిత్రానికి సంబంధించి ఉమ్మడి అభిప్రాయానికి వచ్చే విధంగా ఉండాలి.
- ఈ మూడు టెస్ట్‌లలో అభ్యర్థుల ప్రతిభ ఆధారగా షార్ట్‌లిస్ట్ రూపొందించి స్టేజ్–2కు ఎంపిక చేస్తారు.



స్టేజ్-2 నాలుగు రోజులు

ఎస్ఎస్‌బీ స్టేజ్–2 ఎంపిక ప్రక్రియ మొత్త నాలుగు రోజుల పాటు సాగుతుంది. ఈ నాలుగు రోజుల్లో ప్రతిరోజు పలు పరీక్షలు, ఈవెంట్స్ నిర్వహిస్తారు.

సైకాలజీ టెస్ట్

స్టేజ్–2 మొదటి రోజు సైకలాజికల్ టెస్ట్ నిర్వహిస్తారు. ముందుగా థీమాటిక్ అప్పెర్‌సెప్షన్ టెస్ట్, వర్డ్ అసెస్‌మెంట్ టెస్ట్, సిట్యుయేషన్ రియాక్షన్ టెస్ట్, సెల్ఫ్ డిస్క్రిప్షన్ టెస్ట్‌లు ఉంటాయి. థీమాటిక్ అప్పెర్‌సెప్షన్ టెస్ట్‌లో అభ్యర్థులు ఏదైనా చిత్రంపై స్టోరీ రాయాల్సి ఉంటుంది. వర్డ్ అసోసియేట్ టెస్ట్‌లో నిర్దేశిత పదాలతో అర్థవంతమైన వాక్యాన్ని రూపొందించాల్సి ఉంటుంది. అదే విధంగా సిట్యుయేషన్ రియాక్షన్ టెస్ట్‌ను కూడా నిర్వహిస్తారు. ఈ టెస్ట్‌లో భాగంగా అభ్యర్థులు నిజ జీవిత సంఘటనలపై అభిప్రాయాలు తెలియజేయాల్సి ఉంటుంది.

రెండో రోజు

స్టేజ్–2 రెండో రోజున గ్రూప్ టెస్టింగ్–1 పేరుతో ఔట్ డోర్, ఇన్‌డోర్ టెస్ట్‌లను నిర్వహిస్తారు. గ్రూప్ డిస్కషన్, గ్రూప్ ప్లానింగ్ ఎక్సర్‌సైజ్, ప్రోగ్రెసివ్ గ్రూప్ టాస్క్, గ్రూప్ అబ్‌స్టాకిల్ టాస్క్, హాఫ్ గ్రూప్ టాస్క్ వంటి ఇండోర్, ఔట్‌డోర్, ఇండివిడ్యువల్, గ్రూప్ యాక్టివిటీస్‌లో సత్తా చూపాల్సి ఉంటుంది.

గ్రూప్ టెస్టింగ్-2

స్టేజ్ 2లో మూడో రోజున..గ్రూప్ టెస్టింగ్–2 పేరుతో లెక్చరెట్, ఇండివిడ్యువల్ అబ్‌స్టాకిల్స్, కమాండ్ టాస్క్, ఫైనల్ గ్రూప్ టాస్క్ వంటివి నిర్వహిస్తారు. వీటన్నింటిలోనూ చూపిన ప్రతిభ ఆధారంగా.. అదేరోజున పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఈ ఇంటర్వ్యూలో ఎస్ఎస్‌బీలో అప్పటి వరకు జరిగిన ప్రక్రియల్లో అనుభవాలు, అదే విధంగా వ్యక్తిగతంగా అకడమిక్, కుటుంబ నేపథ్యం, అకడమిక్‌గా చూపిన ప్రతిభ, జనరల్ అవేర్‌నెస్ అంశాలపై అభ్యర్థులను ప్రశ్నిస్తారు.

నాలుగో రోజు.. కాన్ఫరెన్స్

స్టేజ్–2లో చివరి రోజున కాన్ఫరెన్స్ పేరిట అభ్యర్థుల వ్యక్తిత్వాన్ని పరిశీలిస్తారు. ఈ ప్రక్రియలో ముందుగా మూల్యాంకన చేసే అధికారి క్లోజింగ్ అడ్రస్(ముగింపు ప్రకటన) చేస్తారు. ఆ తర్వాత అభ్యర్థుల కాన్ఫరెన్స్ మొదలవుతుంది.

49 వారాల ట్రైనింగ్

ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి.. తుది జాబితాలో నిలిచిన వారికి.. 49 వారాల పాటు చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో ప్రీ–కమిషన్ ట్రైనింగ్ పేరుతో శిక్షణనిస్తారు. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి మద్రాస్ యూనివర్సిటీ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ సర్టిఫికెట్‌ను కూడా అందజేస్తారు. అదే విధంగా శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 చొప్పున స్టయిఫండ్ ఇస్తారు.

లెఫ్టినెంట్ హోదా

ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత.. పురుష అభ్యర్థులకు పద్నాలుగేళ్లు, మహిళా అభ్యర్థులకు పదేళ్లు గడువుతో షార్ట్ సర్వీస్ కమిషన్‌ను ఖరారు చేస్తారు. తర్వాత మరో నాలుగేళ్లపాటు పొడిగించే విధానాన్ని కూడా ఇండియన్ ఆర్మీ అనుసరిస్తోంది. అంటే.. పురుష అభ్యర్థులు గరిష్టంగా 18ఏళ్లు, మహిళా అభ్యర్థులు గరిష్టంగా 14 ఏళ్లు ఆర్మీలో విధులు నిర్వర్తించొచ్చు. షార్ట్ సర్వీస్ కమిషన్ ఖరారు చేసుకున్న వారికి లెఫ్టినెంట్ హోదాతో కెరీర్ ప్రారంభమవుతుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకోసం జాయిన్ ఇండియన్ ఆర్మీ వెబ్‌సైట్‌లోని 'ఆఫీసర్ ఎంట్రీ అప్లికేషన్/లాగిన్' ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు: జనవరి 17 – ఫిబ్రవరి 15, 2023
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.joinindianarmy.nic.in

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.